Pubilshed from Kakinada

PRGI NO : APTEL/25/A1470

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




| కాకినాడ KAKINADA | సంపుటి : 02 | సంచిక : 247 | శుక్రవారం | జూలై 31, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|---|
| | Vol.No : 02 | Issue No : 247 | Friday | 31 JULY 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/- |

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## ఏపీలో పలు జిల్లాలకు వర్ష సూచన

### 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ఎండీ ప్రకర్ జైన్ తెలిపారు. పోలవరం, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.

2 పేజీలో..



## వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం

- వందేమాతరం అవమానాన్ని నేరంగా పరిగణించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి చట్టపరమైన రక్షణ
- అవమానిస్తే మూడేళ్ల జైలు, జరిమానా విధించేలా కఠిన నిబంధనలు
- ఉభయ సభల ఆమోదంతో రాష్ట్రపతి పరిశీలనకు చేరనున్న బిల్లు

న్యూఢిల్లీ : జాతీయ గేయం వందేమాతరాన్ని అవమానించడం లేదా దాని గానానికి ఆటంకం కలిగించడాన్ని నేరంగా పరిగణించే కీలక బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం ముద్ర వేసింది. జాతీయ గౌరవ పరిరక్షణ (సవరణ) బిల్లు, 2026ను ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. నిన్న ఈ బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందింది.

2 పేజీలో..

## విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం

### మల్లికార్జున ఖర్గే

- రాజ్యసభకు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు
- కేంద్రంపై ప్రతిపక్ష నేత ఖర్గే విమర్శలు
- అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్
- రాజకీయాల కోసమే బిల్లు తెచ్చారని ఆరోపణ
- పేపర్ లీక్‌లపై అమలు వ్యవస్థ బలోపేతం చేయాలని సూచన
- విద్యార్థుల ఉద్యమం వల్లే ప్రభుత్వం దిగివచ్చిందన్న ఖర్గే

న్యూఢిల్లీ : ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026పై రాజ్యసభలో తీవ్ర వాగ్వాదం జరిగింది. చర్చ సందర్భం గా ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.



విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని ఆరోపించారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై

2 లో..

## తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి

### కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలల అభివృద్ధి

- పిల్లల భవిష్యత్ తీర్చి దిద్దేందుకే విద్యాశాఖ చూస్తున్నా
- పిల్లలను హాస్టళ్లలో వేయడంతో దెబ్బతింటున్న కుటుంబ బంధాలు
- మండలం క్లస్టర్‌గా విద్యా ప్రణాళిక రూపొందిస్తున్నాం
- ఉపాధ్యాయుల పదోన్నతలపై అనుమానాలు వద్దు
- 2034 వరకు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా
- తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ : తెలంగాణను విద్యాపరంగా అగ్రగామిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్కూళ్లను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకే రాష్ట్ర బడ్జెట్‌లో ఏకంగా 9 శాతం నిధులను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఓట్ల రాజకీయం కోసం కాకుండా, పిల్లల బంగారు భవిష్యత్తును దిద్ది తీర్చాలనే ఏకైక లక్ష్యంతోనే విద్యాశాఖ బాధ్యతలను తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. గతంలో ఉన్నవారు ఇరిగేషన్ శాఖను ఎంచుకుంటే, నేను విద్యాశాఖ బాధ్యతను నా వద్దే ఉంచుకున్నా. 80 వేల పుస్తకాలు చదివానన్న నాయకుడి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది. కానీ నా ప్రాధాన్యత ప్రాజెక్టులు కావు, పిల్లల చదువులే అని సీఎం అన్నారు. లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాలు పొందుతున్నా, ఉద్యోగానికి దరఖాస్తు రాసుకోలేని పరిస్థితి రాకూడదని, విద్యా ప్రమాణాలను పెంచడమే తమ నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు.

2 పేజీలో..

## సూపర్ ఎల్ నినో, సాగు నీటి సంక్షోభంపై రైతుల్లో అవగాహన కల్పించాలి


### రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి పరిస్థితులు వివరించండి

- సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు భేటీ
- ఏలేరు నుంచి కాకినాడ జిల్లాకు 1000 క్యూసెక్కుల నీరు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు
- సూపర్ ఎల్ నినో పరిస్థితులపై చర్చ

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : సూపర్ ఎల్ నినో, తద్వారా రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సంక్షోభంపై రైతుల్లో అవగాహన కల్పించాలని, సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జల వనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడుకి సూచించారు. సాగు నీటి ఎద్దడిపై రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులతోపాటు ప్రజా ప్రతినిధులు కూడా తీసుకుంటే ఫలితం ఉంటుందని స్పష్టం చేశారు.

- మిగతా 2లో..





## ఇరాన్‌పై మరోసారి యుద్ధ హెచ్చరికలు చేసిన ట్రంప్

### ఉద్రిక్తతలు పెంచుతున్న వ్యాఖ్యలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌పై కఠిన వ్యాఖ్యలు చేస్తూ సైనిక దాడి హెచ్చరికలు చేశారు. ఈజిప్టులోని డమియెట్టా నౌకాశ్రయం సమీపంలో అమెరికా సంబంధిత ఇంధన సదుపాయాలపై జరిగిన దాడి అనంతరం స్పందించిన ట్రంప్, "ఇప్పుడు మా వంతు వచ్చింది. ఇరాన్‌పై అత్యంత శక్తివంతమైన దాడి చేస్తాం"

- మిగతా 2లో..

## చంద్రబాబువి అన్నీ దుర్మార్గపు ఆలోచనలే

### వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి, శ్రీకాకుళం : మాజీ మంత్రి సీదిరి అప్పల రాజు కుటుంబంపై చంద్రబాబు సర్కార్ కుట్రకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. యాక్సిడెంట్‌ను హత్య కేసుగా మార్చి సీదిరి కుటుంబంపై కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందన్నారు. అసలు యాక్సిడెంట్ కేసును హత్య కేసుగా ఎలా మారుస్తారు? అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. అంపోలు జైలులో ఉన్న సీదిరిని పరామర్శించేం దుకు వెళ్లిన వైఎస్ జగన్.. అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి సర్కారు అరాచకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. 'ఈ రోజు రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు జరగుతున్నాయనే దానికి ఇదే నిదర్శనం. కనీసం మానవతా విలువలు లేకుండా మంచితనానికి పాతరేశారు.

2 పేజీలో..



## ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్

### మంత్రి నారా లోకేష్

- గత ప్రభుత్వ చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసం కోల్పోయిందని వ్యాఖ్య
- త్వరలో ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ ఎగుమతులు
- పరిశ్రమలు తేవడం మా బాధ్యత.. కష్టపడటం యువత బాధ్యత
- టాటా రెన్యువబుల్ ఎనర్జీ శంకుస్థాపన సభలో మంత్రి నారా లోకేష్

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల తొలి ప్రాధాన్యతగా మారిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, ఈక్యూటీ, టీపీజీ వంటి ప్రతిష్టాత్మక గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, టాటా పవర్, సుజ్లాన్, రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ఏసీఎంఈ, వారీ వంటి ప్రముఖ భారతీయ దిగ్గజ సంస్థల తమ కార్యకలాపాలను ఇక్కడ విస్తరిస్తున్నాయని ఆయన వెల్లడించారు. పత్తికొండ సమీపంలోని హోసూరు వద్ద టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (టీపీఆర్ఈఎల్) ఆధ్వర్యంలో రూ.5,350 కోట్లతో

- మిగతా 2లో..

## సాయం చేయడంలోనే సంతృప్తి

- ఎన్టీఆర్ ట్రస్ట్‌తో 29 ఏళ్లుగా ప్రజాసేవ
- కుప్పం ప్రజల ప్రేమాభిమానాలే మా కుటుంబానికి బలం
- నారా భువనేశ్వరి
- నాలుగు రోజుల పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న భువనేశ్వరి



ప్రజాభూమి ప్రతినిధి,కుప్పం: ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి సాయం చేయడంలోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌లో 29 ఏళ్లుగా తన ప్రయాణం ప్రజాసేవకే అంకితమైందని తెలిపారు. కుప్పం ప్రజలు తమ కుటుంబంపై చూపిస్తున్న ప్రేమాభిమానాలే తమకు కొండంత బలమని చెప్పారు.

వివరాలు 2లో..



## ఏపీ టెట్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షా సమావేశం

### 10,620 మంది అభ్యర్థులకు 5 పరీక్షా కేంద్రాలు : కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి, కాకినాడ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్)ను జిల్లాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 5 నుంచి 21 వరకు జరిగే టెట్ పరీక్షల ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 10,620 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానుండగా, కంప్యూటర్ ఆధారిత పరీక్షల కోసం ఐదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

2 లో

# తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి

చిన్నతనంలోనే పిల్లలను హాస్టళ్లలో వేయడం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బ తింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంటరిగా పెరిగే పిల్లలు పెద్దయ్యాక తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులే తల్లిదండ్రుల స్థానంలో ఉండి పిల్లలకు సరైన మార్గదర్శనం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయంగా, ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్‌గా తీసుకుని విద్యా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. విద్యాబోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ఏటా 10 నుండి 12 మంది ఉపాధ్యాయులను 'స్టడీ లీవ్'పై విదేశాలకు పంపిస్తామని ప్రకటించారు. టీచర్ల ప్రమోషన్లు, బదిలీల బాధ్యతను తానే చూసుకుంటానని, అడగకుండానే ఒకటో తేదీన జీతాలు వేస్తున్నామని గుర్తుచేశారు. ఇదే క్రమంలో తన రాజకీయ ప్రస్థానంపై స్పందిస్తూ 2034 వరకు నేనే సీఎంగా ఉంటాను, ఎలాంటి సందేహాలు వద్దని ధీమా వ్యక్తం చేశారు. దీనిపై ఎవరూ ఎలాంటి అనుమానాలు, డౌట్లు పెట్టుకోవాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయుల బృందంతో ఇవాళ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్వహణలో తాము మానవత్వంతో వ్యవహరిస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో మాట్లాడిన సీఎం, వారి సమస్యల పరిష్కార బాధ్యతను పూర్తిగా తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రమోషన్లు, బదిలీలు ఇంటికే వస్తాయని, ఉపాధ్యాయులు కేవలం విద్యార్థుల భవిష్యత్తు, బడులలో సౌకర్యాల పైనే దృష్టి పెట్టాలని కోరారు. ఐఏఎస్ అధికారులనైనా సులభంగా బదిలీ చేయవచ్చుని,



కానీ టీచర్ వ్యవస్థ అత్యంత శక్తివంతమైనదని కొనియాడారు. బడులలోని పిల్లల సమస్యలపై తనతో చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడులలో చదివితే ఏం అవుతావు?' అని ఎవరైనా అడిగితే, 'తెలంగాణ సీఎం అవుతాను' అని పిల్లలు ధైర్యంగా చెప్పాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తాను స్వయంగా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని, ఎలాంటి మంత్రి పదవి అనుభవం లేకపోయినా ఈరోజు సమర్థవంతంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నానని గుర్తుచేశారు. ఇటీవల తాను హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని చెబుతూ, కేవలం తెలివి ఉంటే సరిపోదని, క్రమశిక్షణే మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుందని నొక్కి చెప్పారు. ఉపాధ్యాయులు అడగకపోయినా 2024 జనవరి నుంచి ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా సమయానికి వేతనాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ ఛార్జీలను సైతం పెంచామని వివరించారు. అమెరికాపైనే కాకుండా జర్మనీ, జపాన్ వంటి దేశాల వైపు దృష్టి సారించాలని, భాష అనేది కేవలం ఒక సంభాషణ మాధ్యమం మాత్రమేనని పేర్కొన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇకపోతే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్పులు ఎక్కువగా చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందరూ ప్రధాన మంత్రుల కంటే మోదీ అప్పులు ఎక్కువ చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకూ రూ.51లక్షల కోట్ల అప్పు ఉందని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని రూ.151లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. విమర్శలు గుర్తు చేసుకుంటూ ఉంటే మనం మనుగడ సాధించలేమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విద్యావ్యవస్థ తమ హయాంలో బలపడిందని తెలిపారు. 28వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం ఇప్పుడు దేశంలో 18వ స్థానానికి చేరిందని వ్యాఖ్యానించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యాశాఖకు మంత్రి లేరని.. తాను రాజీనామా చేయాలని ప్రతిపక్షాల నేతలు అంటున్నారని అన్నారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ పెట్టినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. తాను కూడా మెళకువలు నేర్చుకోవడానికి హార్వర్డ్ వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

## సంపాదకీయం

### ప్రతిపక్షంగా విఫలం అవుతున్న కాంగ్రెస్ !

ఈ దేశ దౌర్భాగ్యం ఏమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఎ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచుకోవడంలో కూడా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఎ తప్పడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితవ క్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్‌లో నరనరాన జీర్ణించుకుపో యింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్లమెంట్ సమావేశాల్లో కూడా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ది పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది కూడా తెలియని వారు మన పాలనా వ్యవస్థలో ఉండడం దౌర్భాగ్యం. పోలీస్ మాన్యువల్ కూడా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడు తున్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకుని లాఠీఛార్జ్ చేస్తారు. నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదికూడా తెలియ నట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలి చ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశుద్ధి లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగింది. అందుకే అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళుతుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూతి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. అందంతా కేవలం నాకీయ రాజకీయ ప్రయోజనం కోరి చేస్తున్నవే. కేవలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయిందన్నదే ప్రశ్న. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేం దుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి సిజెపి ఉద్యమమే కారణం.

నెల రోజులకు పైగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. చాలాసార్లు పోలీసుల దమనకాండ అణచితేకు పోలీసులు లాఠీఛార్జ్ షరామమూలే. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. అయితే ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. ఇప్పుడు రాహుల్ వారిని భుజాన వేసుకుని ఊరేగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావిం చనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలి. కాంగ్రెస్ ఇప్పటికైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలి. లేకుంటే కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోతుంది.


## ఏపీలో పలు జిల్లాలకు వర్ష సూచన

మరోవైపు, మార్కాపురం, నెల్లూరు, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడే అవకాశముందని పేర్కొన్నారు. వర్షాల సమయంలో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సమయంలో చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ సమీపంలో నిలబడవద్దని హెచ్చరించారు. అలాగే, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటికి దూరంగా ఉండాలని సూచించారు.

## ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్

అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న 800 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు గురువారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, గత ఏడాదితో పోలిస్తే ఈ ఒక్క ఏడాదిలోనే ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400 శాతం పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న విశ్వసనీయత వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు.

## ఇరాన్‌పై మరోసారి యుద్ధ హెచ్చరికలు చేసిన ట్రంప్



అని అన్నారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా ట్రంప్, ఇరాన్ "తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని వ్యాఖ్యానించారు. ఈ ప్రకటనలు ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న ప్రాంతీయ పరిస్థితులను మరింత తీవ్రతరం చేసే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈజిప్టులో జరిగిన దాడి వెనుక ఇరాన్ ప్రమేయం ఉందని ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ కాలేదు. దాడిలో రెండు సహజ వాయువు ట్యాంకర్లు అగ్నికి ఆహుతయ్యాయని, అమెరికాకు చెందిన తేలియాడే ఇంధన నిల్వ కేంద్రం మరియు గ్రీకు ట్యాంకర్ దెబ్బతిన్నాయని ఈజిప్ట అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఈజిప్ట పెట్రోలియం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## చంద్రబాబువి అన్నీ దుర్మార్గపు ఆలోచనలే

నీట్ రాసి.. తన తండ్రిలాగా డాక్టర్ అవ్వాలని అనుకున్నాడు సీదిరి కుమారుడు. తెలిసో తెలియకుండా యాక్సిడెంట్ చేశాడు. కానీ కేసును ట్విస్ట్ చేసి హత్య చేశాడని, కుట్ర చేసి సీదిరి కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు. అనుకోని పరిస్థితుల్లో రోడ్డు ప్రమాదం జరిగితే.. ఆ పిల్లాడి జీవితాన్ని నాశనం చేయాలని చూడటం ఎంతవరకు సరైంది. బీసీల్లో సీదిరి మంచి నాయకుడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కాబట్టి. చిన్న పిల్లాడు చేసిన యాక్సిడెంట్‌ను కుట్రగాను. హత్యగాను చిత్రీకరించి సీదిరి కుటుంబాన్ని ఇరికించే కార్యక్రమం ఎంతవరకు ధర్మం. అతిసామాన్యమైన కుటుంబం నుంచి వచ్చి వైద్యుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అప్పల రాజును ఇబ్బంది పెట్టేలా తన కెరీర్‌ను నాశనం చేయాలని దుర్మార్గకపు ఆలోచన చేస్తున్నారు. 18 ఏళ్ల విద్యార్థి జీవితాన్ని నాశనం చేస్తున్న చంద్రబాబు గడ్డి తింటున్నారా?. మనిషా? రాక్షసుడా?. ఇదే టీడీపీ నేతలు ఎవరైనా చేస్తే ఇలాగే శిక్షలు విధిస్తారా?. ఇదే శ్రీకాకుళం ఎమ్మెల్యే, పాతపట్నం ఎమ్మెల్యే యాక్సిడెంట్ చేస్తే.. ఈ కేసుల్లో ఎవరిని అరెస్టు చేశారు. ఒక్కొక్కరికి ఒక్కోలా చేస్తే వ్యవస్థ బతకదు. చంద్రబాబు విష విత్తనాలు నాటుతున్నారు. అదే వ్యవస్థను నాశనం చేస్తున్నారు. హత్య చేసేందుకు ప్రయత్నం చేస్తే.. ప్రమాదంలో గాయపడ్డ బాధితుడ్ని రక్షించేందుకు సీదిరి కుమారుడు ప్రయత్నించాడు. 108కి ఫోన్ చేశాడు. సీపీఆర్ చేశాడు. సీదిరి సైతం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు యాదవ మంత్రిని పంపించి ర్యాలీలు చేస్తారా?. అదే చంద్రబాబుకు బాధిత కుటుంబానికి మంచి చేయాలన్న మనసుంటే ఇరు కుటుంబాల మధ్య సయోధ్య చేకూర్చి బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చేసే ప్రయత్నం చేయాలి.

పేదలంటే ప్రేమలేదు. బీసీలను ఓటు బ్యాంకు కోసం వాడుకుంటాడు. చంద్రబాబుకు బీసీలు కాదు యాదవులంటేనే ప్రేమలేదు. ప్రకాశం జిల్లాలో యాదవ కుటుంబం దాడి చేసి తిరిగి ఆ కుటుంబంపైనే కేసు పెట్టించిన ఘనుడు చంద్రబాబు. చరిత్రలో తొలిసారి యాదవ మహిళను వైఎస్సార్‌సీపీ విశాఖ మేయర్‌ని చేసింది. ఆ తర్వాత చంద్రబాబు కుట్రతో ఆమెకు పదవిని దూరం చేశాడు. విశాఖలో యాదవ భవన్‌ను పూర్తి కాకుండా అక్కడో కుట్ర. మత్స్యకారులు ప్రమాదానికి గురైతే కనీసం వాళ్ల కుటుంబ సభ్యుల్ని పరామర్శించలేదు. వైఎస్ జగన్ వెళ్లాడు. బాధితుల్ని పరామర్శించాడు. ఫిషింగ్ హార్బర్‌లను అమ్ముకుంటుంటున్నాడు. మత్స్యకారుల జీవితాల్ని నాశనం చేస్తున్నాడు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ లేదు. అమ్మఒడి లేదు. నోరు తెరిస్తే అబద్ధాలు, చేస్తే మోసాలు. ప్రశ్నిస్తే వాళ్లమీద తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలు, జీవితాలు నాశనం అవుతాయన్న జ్ఞానం లేదు. సీదిరి అప్పల రాజు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తోంది. అప్పల రాజు విషయంలో న్యాయం గెలుస్తోంది. త్వరలో ఆయన జైలు నుంచి బయటకు వస్తారు' అని వైఎస్ జగన్ ఆకాంక్షించారు.

### సూపర్ ఎల్ నినో, సాగు నీటి సంక్షోభంపై రైతుల్లో అవగాహన కల్పించాలి

సూపర్ ఎల్ నినో పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా– కాకినాడ జిల్లాలోని పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట తదితర నియోజకవర్గాల రైతుల కోసం అడిగిన వెంటనే ఏలేరు ప్రాజెక్టు నుంచి వెంటనే 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించినందుకు మంత్రి నిమ్మల రామానాయుడుకి ఉప ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ జిల్లా, పిఠాపురం పరిసర ప్రాంతాల్లో నెలకొన్న నీటి కొరత పరిస్థితులను పరిశీలించేందుకు ఏలేరు ఆయకట్టు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తున్నట్టు నిమ్మల రామానాయుడు వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. క్షేత్రస్థాయి పర్యటనల సందర్భంగా సూపర్ ఎల్ నినో ప్రభావం, దాని వల్ల ఏర్పడుతున్న నీటి కొరత పరిస్థితులపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని, ప్రకృతి విపత్తుల కారణంగా రైతులు నష్టపోకుండా ప్రతి రైతు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చేయించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అవకాశం ఉన్న చోట రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి, ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు, వాటి ప్రభావం, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించాలని సూచించారు. ప్రస్తుతం పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనదని, కాలువల్లో పూడిక తీయడం, గట్లు లీకేజీలు లేకుండా మరమ్మత్తులు చేయడం వంటి చర్యల ద్వారా నీటి వృథాను అరికట్టాలని చెప్పారు. ముఖ్యంగా కాకినాడ జిల్లా మరియు పిఠాపురం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి కోరారు.

అంతకు ముందు భుజం గాయానికి శస్త్ర చికిత్స చేయించుకున్న పవన్ కళ్యాణ్ ని రామానాయుడు పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరితగతిన కోలుకుని తిరిగి ప్రజా సేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

## సాయం చేయడంలోనే సంతృప్తి

కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, వినికిడి సమస్య ఉన్న పలువురికి మిషన్లు అందజేశారు.

**మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి**

కుప్పంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వయం ఉపాధికి చేయూత' కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబం సంతోషంగా ఉండాలంటే అది మహిళల చేతిలోనే ఉంటుందని చెప్పారు. ఏమీ తెలీదు.. చేయలేను అని భయపడకుండా ధైర్యంగా ముందడుగు వేస్తే మహిళలు అనుకున్న లక్ష్యాలను సాధించగలరని భువనేశ్వరి సూచించారు. చంద్రబాబు ప్రోత్సాహంతో తాను వ్యాపార రంగంలోకి అడుగుపెట్టానని భువనేశ్వరి తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు, ఆర్థిక చేయూత కల్పించాలనే లక్ష్యంతో కుప్పంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. కుప్పం మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ కల్పించేందుకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో 'స్త్రీ శక్తి హస్తకళా స్టోర్' ఏర్పాటు చేశామని తెలిపారు. అక్కడి విక్రయాల ద్వారా వచ్చే లాభాన్ని తిరిగి మహిళలకే అందిస్తున్నామని చెప్పారు.

**టీం వర్క్‌తోనే విజయం :** ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించాలంటే సమష్టి కృషి, టీం వర్క్ ఎంతో కీలకమని భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌కు దాతలు అందిస్తున్న సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేమని పేర్కొన్నారు. చల్లపల్లి ఎన్టీఆర్ స్కూల్ తన హృదయానికి ఎంతో దగ్గరగా ఉంటుందని చెప్పారు. ఆ స్కూల్ ద్వారా అనాథ పిల్లలకు విద్యను అందిస్తున్నందుకు ఎంతో సంతృప్తిగా ఉందన్నారు.

**కార్యకర్తల కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ :** మొదట కుప్పం హెచ్‌పీ రోడ్డులోని శ్రీ సాయిబాబా ఆలయంలో భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తపేటలోని శ్రీ ప్రసన్న పెద్దపల్లి గంగమ్మ ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి పూజలు చేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన టీడీపీ కార్యకర్తలు అన్వార్ బాషా, చిన్ని నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శాంతిపురం మండలం కడపల్లిలోని తన నివాసంలో భువనేశ్వరి స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు వివరించిన సమస్యలను శ్రద్ధగా విన్న ఆమె, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి అండగా నిలవడమే తమ కుటుంబం ఎప్పటి నుంచో పాటిస్తున్న సేవా స్ఫూర్తి అని పేర్కొన్నారు.

## వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం

1971 నాటి జాతీయ గౌరవ పరిరక్షణ చట్టానికి ఈ బిల్లు సవరణలు చేపడుతుంది. ఇప్పటివరకు జాతీయ జెండా, రాజ్యాంగం, జాతీయ గీతం 'జన గణ మన'కు మాత్రమే ఉన్న చట్టపరమైన రక్షణ ఇకపై వందేమాతరం గేయానికి కూడా వర్తించనుంది. నూతన నిబంధనల ప్రకారం, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వందేమాతరం గానానికి ఆటంకం కలిగించినా లేదా దానిని అవమానించినా గరిష్టంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి సమున్నత గౌరవం కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా వివరించారు. సభలో చర్చ కొనసాగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు ఇతర అంశాలపై పట్టుబడుతూ నిరసనలు వ్యక్తం చేయగా,



వారు ప్రతిపాదించిన సవరణలను సభ తోసిపుచ్చింది. వందేమాతరం 150వ వార్షికోత్సవాల నేపథ్యంలో ఈ బిల్లును తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం

పోలీసులు వ్యవహరించిన తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి జరిగిందని ఖర్గే ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోనే పనిచేస్తాయని గుర్తు చేశారు. ఆ శాఖ అనుమతి లేకుండా ఇలాంటి చర్యలు జరిగే అవకాశం లేదని అన్నారు. ఈ ఘటనపై అమిత్ షా బాధ్యత నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై ఆయన సభలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టే బిల్లును ఇంత ఆలస్యంగా ఎందుకు తీసుకొచ్చారని ఖర్గే ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే సంస్కరణలు చేయకుండా ప్రభుత్వం రాజకీయాల్లోనే నిమగ్నమైందని విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలను చల్లార్చేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. బీజేపీ రాజకీయాల వల్లే దేశంలో ప్రశ్నపత్రాల లీకేజీలు, నిరసనలు, పోలీసు చర్యలు చోటుచేసుకున్నాయని అన్నారు. పేపర్ లీకేజీలు జరిగిన తర్వాత నష్టనివారణ చర్యలు తీసుకోవడం ఒక్కటే సరిపోదని ఖర్గే అభిప్రాయపడ్డారు. అలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అమలు వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వం అనుసరించబోయే స్పష్టమైన కార్యాచరణను వివరించలేదని విమర్శించారు. ఈ బిల్లు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందా అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా పరీక్షల వ్యవస్థపై నిరసనలు వ్యక్తం చేశారని ఖర్గే గుర్తుచేశారు. వారి గొంతుకను ప్రతిపక్షం వీధుల నుంచి పార్లమెంట్ వరకు వినిపించిందన్నారు. ప్రజల ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం చివరకు వెనక్కి తగ్గిందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల పోరాటం ఫలించిందని, వారి ఉద్యమం వల్లే ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు. అధికారాన్ని కోల్పోతామన్న భయంతోనే ప్రభుత్వం డిమాండ్లకు తలొగ్గిందని ఆరోపించారు.

## ఏపీ టెట్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షా సమావేశం

కాకినాడ అచ్చుతాపురంలోని ఐయాఎన్ డిజిటల్ జోన్‌లో 4,300 మంది, రాయుడుపాలెం జంక్షన్‌లోని సాఫ్ట్ టెక్నాలజీస్‌లో 4,400 మంది, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 530 మంది, ఆదిత్య యూనివర్సిటీలో 540 మంది, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 850 మంది పరీక్షలు రాయనున్నారని వెల్లడించారు. ప్రతిరోజూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రంలో నిరంతర విద్యుత్ సరఫరా, ప్రతి కంప్యూటర్‌కు యూపీఎస్, ప్రత్యామ్నాయంగా జనరేటర్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలు చేయడంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని తెలిపారు. ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స సదుపాయం, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని వైద్యశాఖకు, అభ్యర్థుల రాకపోకలకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఒరిజినల్ గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గుడివాడలో ఘనంగా 'చెన్నై లవ్ స్టోరీ' సక్సెస్ వేడుకలు...
## కథానాయకుడు కిరణ్ అబ్బవరంకు ఆత్మీయ స్వాగతం పలికిన ఎమ్మెల్యే రాము



**G3 థియేటర్లో సందడి చేసిన హీరో కిరణ్ అబ్బవరం...చిత్ర యూనిట్ విజయం సాధించిన చిత్ర యూనిట్ అభినందించిన... ఎమ్మెల్యే రాము... ఐ లవ్ గుడివాడ సెల్ఫీ పాయింట్ వద్ద... ఎమ్మెల్యే రాముతో కలిసి సందడి చేసిన కిరణ్ అబ్బవరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి విజయోత్సవ కేక్ కట్ చేసిన....హీరో అబ్బవరం**

**గుడివాడకు తొలిసారి వచ్చాను, ఇక్కడ ప్రజల ఆప్యాయత చూసి పులకించా: కిరణ్ అబ్బవరం**

**అభిమానులు సొంత అన్నయ్యలా చూసుకోవడం గర్వంగా ఉంది: కిరణ్ గుడివాడ గడ్డ ఏఎన్ఆర్, ఎన్టీఆర్ లాంటి మహనీయులది:ఎమ్మెల్యే రాము విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న చిత్ర యూనిట్ కు అభినందనలు:ఎమ్మెల్యే రాము మంచి చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడు ప్రోత్సహిస్తారు:ఎమ్మెల్యే రాము**

**కళలకు నిలయమైన గుడివాడ ప్రజలు... చిత్ర రంగాన్ని ఎప్పుడూ ఆదరిస్తారు: ఎమ్మెల్యే రాము**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

సినీ, రాజకీయ రంగాల్లో ఎంతో ప్రాముఖ్యత కలిగిన గుడివాడ రావడం తనకు సంతోషంగా ఉందని ప్రముఖ హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. తనకు సన్నిహితుడైన ఎమ్మెల్యే రాముతో కలిసి తన సోదర సమానుడైన వంశీ నందిపాటి థియేటర్లో విజయోత్సవ వేడుకల్లో పాల్గొనడం మరింత ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.గుడివాడలో 'చెన్నై లవ్ స్టోరీ' చిత్ర యూనిట్ గురువారం సందడి చేసింది. చిత్రం ప్రదర్శితమవుతున్న జీ3 సింధూర థియేటర్ కు హీరో కిరణ్ అబ్బవరం ఇతర చిత్ర బృందం చేరుకోగానే అభిమానులు పెద్ద ఎత్తున కేరింతలు కొట్టారు. థియేటర్ యజమాన్యం తీన్మార్ డప్పులతో వారికి ఘన స్వాగతం పలికింది. ఎమ్మెల్యే రాము ఈ చిత్ర హీరో కిరణ్ అబ్బవరాన్ని ఆత్మీయ ఆలింగణం చేసుకుంటూ స్వాగతించారు.అనంతరం థియేటర్ స్క్రీన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపైకి చేరుకున్న హీరో కిరణ్ అబ్బవరం, కథానాయిక గౌరీ ప్రియ, దర్శకుడు రవి అబ్బూరి ప్రేక్షకులకు,అభివాదాలు చేయగా, అభిమానులు గజమాలలతో హీరో, హీరోయిన్లను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే రాము మరియు కూటమి నాయకులతో కలిసి కిరణ్ అబ్బవరం చిత్ర విజయోత్సవ కేక్ కట్ చేశారు.పర్యటనలో భాగంగా ఏజీకే స్కూల్ వద్ద గల ఐ లవ్ గుడివాడ సెల్ఫీ పాయింట్ వద్ద... ఎమ్మెల్యే రాముతో కలిసి కిరణ్ అబ్బవరం ఫోటోలు దిగుతూ సందడి చేశారు.విజయోత్సవ వేడుకల్లో భాగంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ మంచి చిత్రంతో వచ్చిన తమను ఆశీర్వదించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. గుడివాడ ఎమ్మెల్యే రాము తనకు సన్నిహితుడన్నారు, సోదర సమానుడైన వంశీ నందిపాటి థియేటర్లో సందడి వాతావరణం లో జరుగుతున్న వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రాయలసీమలో పుట్టిన తాను గుడివాడ గురించి సినీ, రాజకీయ పరంగా అనేకసార్లు విన్నానని, అలాంటి ప్రాము ఖ్యత కలిగిన గుడివాడకు తొలిసారి రావడం ఆనందంగా ఉందని చెప్పారు.

ఆప్యాయంగా స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇంతమంది అభిమానులు తనను సొంత అన్నయ్యగా చూపిస్తున్న ప్రేమ చూస్తుంటే చెప్పలేని ఆనందంగా ఉందని అన్నారు. తాను హిట్ కొట్టిన ప్పుడు సొంత అన్నయ్య విజయం సాధించినట్లు అభిమానులు చూపిస్తున్న ఆదరణ ను ఎన్నటికీ మర్చిపోలేనని పేర్కొ న్నారు. కొత్త రకమైన కథలతో వస్తే తప్పకుండా సక్సెస్ అవుతారని ప్రేక్షకులు మరోసారి నిరూపిం చారని తెలిపారు. మరిన్ని విజయా లతో తప్పకుండా మళ్లీ మళ్లీ గుడివాడ వస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.కథానాయిక గౌరీ ప్రియ మాట్లాడుతూ గుడివాడలో ఆహ్లాదకర వాతావరణంలో జరుగుతున్న వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తాను చేసిన పాత్రను ఆదరించిన ప్రేక్షకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ తెలుగు చిత్ర సీమకు రెండు కళ్ల లాంటి ఏఎన్ఆర్, ఎన్టీఆర్ తో పాటు ఎందరో మహనీయులు పుట్టిన గుడివాడ గడ్డపై 'చెన్నై లవ్ స్టోరీ' సక్సెస్ వేడుకలు నిర్వహించుకోవడం సంతోషకరం అన్నారు. కిరణ్ అబ్బవరంతో తనకు చిరకాలం నుండి పరిచ యం ఉందని,తెలిపారు.యువ హీరోలను ప్రోత్స హించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, కిరణ్ మరిన్ని విజయాలతో గుడివాడ రావాలని ఆకాంక్షించారు. తెలుగు చిత్రశ్రమను గుడివాడ ఎప్పుడు ప్రోత్సహిస్తూనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కిరణ్ చిరకాలం విజయవంతంగా కొనసాగాలని ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు. విజయోత్సవ వేడుకల్లో చిత్ర దర్శకుడు రవి అబ్బూ రి, థియేటర్ యజమాని నందిపాటి పద్మా రెడ్డి, గుడివాడ జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అసిస్టెంట్ డైరెక్టర్ రాజా, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహనరావు సత్య సాయి, పంచకర్ల మహేష్ తో పాటు చిత్ర యూనిట్ సభ్యులు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# రాయలసీమ, దక్షిణ ఆంధ్రకు వరం.. కృష్ణా-పెన్నార్ నదుల అనుసంధానం

**పార్లమెంట్‌లో కేంద్ర జలశక్తి శాఖ వెల్లడి**

**కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి**



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

ఆంధ్రప్రదేశ్ దీర్ఘకాలిక నీటి అవసరాలను తీర్చే కృష్ణా–పెన్నార్ నదుల అనుసంధాన ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పార్లమెంట్ సమావేశాల్లో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ స్పందిస్తూ ప్రాజెక్టు పురోగతికి సంబంధించిన వివరాలను వెల్లడించింది.ప్రాజెక్టు ముఖ్యాంశాలు:సాధ్యాసాధ్యాల నివేదిక పూర్తి: కృష్ణా (నాగార్జునసాగర్)–పెన్నార్ (సోమశిల) లింక్ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల నివేదిక (Feasibility Report) జనవరి 2022లోనే పూర్తయింది.బృహత్ ప్రాజెక్టులో భాగం: ఈ అనుసంధానం గోదావరి (ఇంచంపల్లి)–కావేరి లింక్ ప్రాజెక్టులో ప్రధాన భాగంగా ఉంది.మూడు కీలక లింకులు:ఈ ప్రాజెక్టులో భాగంగా మూడు విభాగాలుగా నదులను అనుసంధానించనున్నారు:గోదావరి (ఇంచం పల్లి) – కృష్ణా (నాగార్జునసాగర్)కృష్ణా (నాగార్జునసాగర్) – పెన్నార్ (సోమశిల)పెన్నార్ (సోమశిల) – పాలార్ – కావేరి రాష్ట్రాల ఏకాభిప్రాయానికి చర్యలు:జాతీయ జల అభివృద్ధి సంస్థ (NWDA) ఈ ప్రాజెక్టు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (DPR)ను జనవరి 2024లోనే సంబంధిత రాష్ట్రాలకు పంపినట్లు కేంద్రం స్పష్టం చేసింది. ప్రాజెక్టు అమలుకు సంబంధించి రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిర్చేందుకు ఇప్పటివరకు ఆరు అంతర్రాష్ట్ర సంప్రదింపుల సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించింది.వేగంగా పూర్తి చేయాలి: ఎంపీ వల్లభనేని బాలశౌరి"రాయలసీమతో పాటు దక్షిణ ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల సాగు, తాగునీటి ఎద్దడిని తీర్చడానికి కృష్ణా–పెన్నార్ నదుల అనుసంధానం అత్యంత కీలకమైన ప్రాజెక్టు. రాష్ట్రాల మధ్య త్వరిత గతిన ఏకాభిప్రాయం సాధించి, ప్రాజెక్టును త్వరగా పట్టాలెక్కించేలా కేంద్ర ప్రభుత్వం వేగవంతమైన చర్యలు తీసుకోవాలి."— వల్లభనేని బాలశౌరి, మచిలీపట్నం ఎంపీ




# కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి

## మచిలీపట్నం ధర్నా చౌక్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో పది కార్మిక సంఘాల భారీ నిరసన

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కనీస వేతన చట్టాన్ని తక్షణమే కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ (CITU) నాయకత్వంలో పది కార్మిక సంఘాలు గురువారం కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ ఎదుట ఉన్న ధర్నా చౌక్‌లో భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి.ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు పి.సుబ్బారావు, ఎం. పోల్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వంపై పలు కీలక డిమాండ్లను ఉంచారు: కనీస వేతనం పెంపు: కార్మికులకు నెలకు కనీస వేతనంగా రూ. 26,000 చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. ఉద్యోగ క్రమబద్ధీకరణ: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఏళ్లుగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సేవలందిస్తున్న ఉద్యోగులను తక్షణమే శాశ్వతీకరించాలి (రెగ్యులరైజ్ చేయాలి).భద్రత & సంక్షేమం: దీర్ఘకాలంగా పని చేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి తగిన వేతనాలు, సంక్షేమ సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని స్పష్టం చేశారు. ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం!"కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే సానుకూలంగా స్పందించి, ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలను ఏకం చేసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం."— కార్మిక సంఘాల నాయకులుఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ ముఖ్య నాయకులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# శ్రీ బాలాజీ కోలాట భక్త బృందం అమ్మవారికి వైభవంగా సారె సమర్పణ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

ఆషాడమాసాన్ని పురస్కరించుకుని శ్రీ బాలాజీ కోలాట భక్త బృందం ఆధ్వర్యంలో భవానీపురంలో టెలిఫోన్ కాలనీ,బాలాజీ టవర్స్ అపార్మెంట్ వద్ద అమ్మవారి సారె సమర్పణ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడింది.భవానిపురం టెలిఫోన్ కాలనీలోని బాలాజీ టవర్స్ నుండి ప్రారంభమై న ఈ శోభాయాత్రలో కోలాట బృంద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.మంగళవాయిద్యాలు, అమ్మవారి నామస్మరణలు, కీర్తనల నడుమ భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ఆషాడమాస సాంప్రదాయ ప్రకారం పసుపు, కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలు మరియు ఫలహారాలతో కూడిన ప్రత్యేక సారెను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఊరేగింపులో స్థానిక భక్తులు, మహిళలు, శ్రీ బాలాజీ కోలాట భక్త బృందం ప్రతినిధులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు.

# కృష్ణా జిల్లా గ్రంథాలయానికి రూ.30 వేల స్టడీ మెటీరియల్ బహుకరణ

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా



ఐఏఎస్, పోటీ పరీక్షల పుస్తకాలు అందజేసిన 'లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్' మచిలీపట్నం నగరంలోని జిల్లా గ్రంథాలయానికి 'లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్' ఆధ్వర్యంలో రూ.30 వేల విలువైన ఐఏఎస్, పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌తో పాటు భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలకు సంబంధించిన విలువైన గ్రంథాలను గురువారం సాయంత్రం అందజేశారు. ఈ పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్య దర్శి వేములపల్లి రవికుమార్కు అధికారికంగా పంపిణీ చేశారు.ముఖ్యుల ప్రసంగాలు & విశే షాలు: యువతకు ఎంతో ఉపయోగకరం – లంకిశెట్టి బాలాజీ (ప్రముఖ న్యాయవాది):"పోటీ పరీక్ష లకు సిద్ధమవుతున్న నగర యువతకు, విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో దోహదపడతాయి. ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యురాలు కంచర్లపల్లి శ్రీచంద్ర నాగార్జున యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేసి, తనకు ఉపయోగపడిన విలువైన పుస్తకాలను ఇతరుల భవిష్యత్తు కోసం గ్రంథాలయానికి విరాళంగా ఇవ్వడం ఎంతో ఆదర్శప్రాయం."శ్రీచంద్ర సేవలు స్ఫూర్తిదాయకం – గడ్డం రాజు (జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు):"ఎంతోమంది నిరుద్యోగులను ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనత జిల్లా గ్రంథాలయానిది. అలాంటి లైబ్రరీకి శ్రీచంద్ర అందించిన ఈ చేయూత నేటి యువతకు గొప్ప స్ఫూర్తినిస్తుంది."అభినందనీయమైన కార్యక్రమం – బీరం వెంకట రమణ (అసిస్టెంట్ లైబ్రేరియన్):"మా లైబ్రరీలో అందుబాటులో లేని పలు విలువైన పోటీ పరీక్షల పుస్తకాలు, సాంస్కృతిక గ్రంథాలను అందజేయడం చాలా సంతోషకరం."హాజరైన ప్రముఖులు:ఈ కార్యక్రమంలో 15వ వార్డు మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడపా మురళి, అధ్యాపకులు లంకిశెట్టి హరినాథ్ బాబు, యువ న్యాయవాది లంకిశెట్టి సాయి ఫణి సంతోష్, మాదిరెడ్డి అంజి బాబు, లైబ్రరీ సిబ్బంది రామారావు, మాదిరెడ్డి సుగుణ కుమారిలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



# ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

ప్రజాభూమి ప్రతినిధి / అవనిగడ్డ

అవనిగడ్డ నియోజకవర్గంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు అన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు, రెండు ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం. పేరుతో నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగు దేశం పార్టీ కార్యక్రమంలో గురువారం విక్కుర్తి పాల్గొన్నారు.తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్ర మంలో విక్కుర్తి పాల్గొని, కరపత్రాలను పంపిణీ చేశారు. అవనిగడ్డ పంచాయతీలోని ఒకటవ వార్డులో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు రెండు సంవత్సరాల నుంచి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని విక్కుర్తి విపులంగా వివరించారు.ఈ సందర్భంగా విక్కుర్తి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు యువనేత నారా లోకేష్ సూచనల మేరకు అవనిగడ్డ నియోజకవర్గంలోని 6 మండలాలలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ల సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ముందుకు సాగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. అవనిగడ్డ నియోజకవర్గంలో జరుగుతున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ




చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, విక్కుర్తి రాంబాబు, క్లస్టర్ ఇంచార్జ్ బండే రాఘవ, న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ, అశ్వరావుపాలెం నీటి సంఘాల అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు, పరుచూరి దుర్గాప్రసాద్, అవనిగడ్డ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కంచర్ల ఆనంద్, కొల్లూరి వాసు, దేగల రాఘవ, మెగావత్తు గోపి, లుక్కా శ్రీనివాసరావు, నాగిడి రాంబాబు, లింగం బాబురావు, జటావత్తు శ్రీను, పిరాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ కూటమి సంక్షేమ ఫలాలు.. జనంలో విశేష ఆదరణ

**కూటమి ప్రభుత్వ సాధనలే మన అతిపెద్ద బలం.. ప్రతి కార్యకర్త ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలి**

**గోపు సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి**



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

నాల్గో రోజు జోరుగా 'డోర్ టూ డోర్' ప్రచారంటీడీపీ క్యాలెండర్ ముందస్తు ప్రణాళికలో భాగంగా మచిలీపట్నం నియోజకవర్గం, కానూరు గ్రామంలోని 1, 2, 3, 4 బూత్‌ల పరిధిలో డోర్ టు డోర్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ గారి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, నేతలు ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రజాదరణ చూరగొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం!ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం గడిచిన రెండేళ్ల కాలంలో సాధించిన అపూర్వ విజయాలను ప్రజలకు వివరించారు.


సర్వతోముఖాభివృద్ధి: రైతులు, మహిళ లు, యువత, వృద్ధులు, పేదల జీవితాల్లో తెచ్చిన సానుకూల మార్పులను స్పష్టంగా వివరించారు.హామీల అమలు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంలో ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో నెరవేరుస్తున్న తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.నమ్మకమే బలం: ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న చెక్కుచెదరని విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ డోర్ టూ డోర్ ముఖ్య ఉద్దేశమని నేతలు స్పష్టం చేశారు. ప్రతి బూత్‌లోనూ ప్రచారం విస్తృతంరానున్న రోజుల్లో మచిలీపట్నం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామం, ప్రతి బూత్ పరిధిలోనూ సంక్షేమ ఫలాలను విస్తృతంగా తీసుకెళ్తామని గోపు సత్యనారాయణ స్పష్టం చేశారు.

పాల్గొన్న ముఖ్య నాయకులు & కార్యకర్తలు:ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి మినవల్లి నాగేశ్వరరావు, జి. రవి, సీహెచ్. సత్యం, దాసి విజయ్ కుమార్, జి. ప్రభాకర్, వీరవల్లి శ్రీను, దుర్గ, వై. ఈశ్వరరావు, పి. నాగరాజు, బసవాని ఏడుకొండలు, బసవాని రమేష్, జయరాజు, పీత రాము, మోపిదేవి కృష్ణ, బొట్ల సాయి, రాజులపాటి బాబీ, షేరు సుబ్రహ్మణ్యం, నడకదుటి జోజిబాబు తదితర ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్‌లో రోడ్డు ప్రమాదం.. మహిళకు తీవ్ర గాయాలు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

దేవుని దర్శనానికి వెళ్తుండగా, వేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనం రూపంలో దురదృష్టం ఆ మహిళను వెక్కిరించింది. జిల్లా కోర్టు సెంటర్‌లో గురువారం చోటుచేసుకున్న ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో విజయలక్ష్మి అనే మహిళ తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాదం జరిగిన తీరు: ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. స్థానిక సాయిబాబా దేవాలయానికి వెళ్లేందుకు విజయలక్ష్మి రోడ్డు దాటుతుండగా, పల్సర్ బైక్‌పై ఇద్దరు యువకులు అతివేగంగా దూసుకొచ్చి ఆమెను బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాద ధాటికి ఆమె రోడ్డుపై ఎగిరిపడి తీవ్ర గాయాలపాలై, లేవలేని స్థితికి చేరుకున్నారు.వెంటనే స్థానికులు స్పందించి, 108 వాహనంలో ఆమెను చికిత్స నిమిత్తం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.నగరంలో నింగికెగురుతున్న 'అతివేగం'.. ఆందోళనలో ప్రజలు!ఇటీవల నగరంలో యువత బైక్‌లపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ, డబుల్, ట్రిపుల్ రైడింగ్‌లతో హల్‌చల్ చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రధాన రహదారులపై కనీస వేగ నియంత్రణ పాటించకపోవడం.ట్రాఫిక్ నిబంధనలను బేఖాతరు చేయడం.రద్దీ ప్రాంతాలు, పాఠశాలలు విడిచే సమయాల్లో నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం. ఈ తరహా ప్రవర్తన వల్లే వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రజల విజ్ఞప్తి: "ట్రాఫిక్ నియంత్రణపై కఠిన చర్యలు తక్షణ అవసరం!" జిల్లా కోర్టు సెంటర్ వంటి నిత్యం రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, నిబంధనల




ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి ప్రాణాంతక ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుందని స్పష్టం చేస్తున్నారు.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

శుక్రవారం 31 జూలై 2026

# పంటల బీమా గడువు ఆగస్టు 30 వరకు పొడిగించాలి

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్



ప్రజాభూమి ప్రతినిధి ఏలూరు జిల్లా

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువును ఆగస్టు 30 వరకు పొడిగించాలని, ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని కోరారు. బుధవారం ఏలూరు అన్నే భవనంలో రైతాంగ సమస్యలపై ఆయన మాట్లాడారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఎల్‌నినో ప్రభావంతో సకాలంలో వర్షాలు లేకపోవడంతో జూన్‌లో పంటల సాగు సక్రమంగా సాగలేదన్నారు. వర్షాభావం కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ ప్రణాళిక ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటల బీమా నమోదు గడువును ఆగస్టు 30 వరకు పొడిగించాలన్నారు. గతంలో మాదిరిగా ఉచిత పంటల బీమా అమలు చేయాలన్నారు. పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులు రైతులందరూ పంటలకు బీమా చేయించుకోవాలని సూచిస్తున్నప్పటికీ, నాన్-లోనీ రైతులు మీ సేవా, ఆన్‌లైన్ కేంద్రాల్లో సర్వర్ సమస్యల కారణంగా బీమా నమోదు చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జూలై 31తో గడువు ముగియనున్న నేపథ్యంలో రైతుల ప్రయోజనాల దృష్ట్యా గడువును ఆగస్టు 30 వరకు పొడిగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత పంటల బీమాను అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందజేసి వడ్డీ లేని పంట రుణాలు అందించాలన్నారు.

**వర్జీనియా పొగాకు రైతులను ఆదుకోవాలి.**

రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి వర్జీనియా పొగాకు రైతులను ఆదుకుంటామని కిలోకు రూ.20లు వ్యత్యాసపు ధర చెల్లిస్తామని చేసిన ప్రకటన హాస్యాస్పదంగా ఉన్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న కనీస ధరలు కంటే అదనంగానే రైతులకు ధర వస్తున్నదని, ప్రస్తుతం వస్తున్న ధరలు పెట్టుబడి ఖర్చులు కంటే అతి తక్కువగా ఉండటం వలన పొగాకు రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిలోకు సరాసరి ధర రూ.310 అమలు చేసే చర్యలు చేపట్టాలని, ఈ ధరకు ఎంత తక్కువ వస్తే అంత ధరను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యత్యాసపు ధర అమలు చేసి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ సభ విజయవంతానికి విశాఖ దక్షిణలో చంటి సమీక్ష



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఆగస్టు 1న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్ల పర్యవేక్షణ, విజయవంతమైన నిర్వహణ కోసం ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి)ను విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిశీలకుడిగా పార్టీ నియమించింది. ఈ మేరకు గత కొన్ని రోజులుగా విశాఖలోనే ఉంటూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న బడేటి రాధాకృష్ణయ్య (చంటి) గురువారం విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని 34వ వార్డు, కొబ్బరి తోట ప్రాంతంలో కూటమి పార్టీల నాయకులు, డ్వాక్రా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సభను విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన ఏర్పాట్లు, ప్రజల భాగస్వామ్యం, సమన్వయం, కార్యకర్తల బాధ్యతలపై నాయకులకు, సిబ్బందికి ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక కూటమి పార్టీల నాయకులు వి. రామ్ కుమార్,నీలం రాజు, మూర్తి పాల్గొన్నారు.

## రేపు జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల 'డిమాండ్ డే' ఆందోళనలు

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31న రాష్ట్రవ్యాప్తంగా 'జర్నలిస్ట్ డిమాండ్ డే' నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఏలూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలోనూ శాంతియుత నిరసనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎ పి డబ్ల్యు జే ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జబీర్, కార్యదర్శి హరీష్,ఎ పి బి జే ఎ జిల్లా అధ్యక్షుడు పి. నారాయణ, కార్యదర్శి ఎం. కిరణ్ పిలుపునిచ్చారు. జర్నలిస్టులకు 3 సెంట్ల స్థలం, హెల్త్ కార్డులు, పెన్షన్, అలాగే జర్నలిస్టులపై దాడుల నివారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఆసుపత్రి ముందే పొంచి ఉన్న ప్రమాదం.



ప్రజా భూమి ప్రతినిధి-చింతలపూడి

ఏలూరు జిల్లా చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద డ్రైనేజ్‌పై పెద్ద గొయ్యి ఏర్పడడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులు ఈ ప్రమాదకరమైన గుంత కారణంగా ఆందోళనకు గురవుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం, డ్రైనేజ్‌పై ఏర్పడిన ఈ పెద్ద గొయ్యి కారణంగా వాహనాల రాకపోకలకు కూడా ఆటంకం కలుగుతోంది. ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజ్‌ను మరమ్మతు చేసి, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, రోగులు కోరుతున్నారు.

## ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విద్యార్థి ఆత్మహత్య.

### - ఉపాధ్యాయుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపణ.

ప్రజాభూమి ప్రతినిధి- ఏలూరు జిల్లా



తెలంగాణ రాష్ట్రం దమ్మపేట వాస్తవ్యులు కునుసోతు వెంకటేశ్వరరావు, పద్మ దంపతులు జంగారె డ్డిగూడెంలో నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు కునుసోతు. బాల సాయి సుబ్రహ్మణ్యం కామవరపుకోట మండలం రవికంపాడు జిల్లా పరిషత్ హై స్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. జూలైనెల 24న. జంగారెడ్డి గూడెంలోని తల్లిదండ్రులు నివాసం ఉంటున్న ఇంటి వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. ఉపాధ్యాయుల వేధింపుల వల్లే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని ప్రధానోపాధ్యాయుడు, పలువురు ఉపాధ్యాయుల మీద తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన జంగారెడ్డిగూడెం పోలీసులు ఎమ్మార్వో సమక్షంలో బాడీని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. తన కుమారుడి మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పొగాకు రైతులకు మూడేళ్లపాటు వడ్డీలేని రుణం

### ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి- ఏలూరు



పొగాకు రైతులకు ఊరట కల్పించేలా బ్యారెల్‌కు రూ.50 వేల వరకు మూడేళ్లపాటు వడ్డీలేని రుణం అందించేందుకు పొగాకు బోర్డు అంగీకరించిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమా ర్ తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా గురువారం జరిగిన పొగాకు బోర్డు సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్న ఆయన, అంతర్జాతీయ పరిణామాలతో పొగాకు ధరలు తగ్గడం, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను బోర్డు దృష్టికి తీసుకెళ్లారు."లో గ్రేడ్" పొగాకు పండించిన రైతులకు ఈ వడ్డీలేని రుణం కొంత ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. పొగా కు రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం, పొగాకు బోర్డుతో కలిసి నిరంతరం కృషి చేస్తున్నామని, ఈ ఏడాది కూడా రైతులకు మెరుగైన ధర అందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ తెలిపారు.

# ఘనంగా తెలుగు వెలుగు సంబరాలు

## కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మకు ఘన సత్కారం



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

తెలుగు వెలుగు సంబరాలు డాక్టర్ సి నారాయణ రెడ్డి జయంతి వేడుకలు ఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ హాల్లో ఘనంగా జరిగాయి. ఈ మేరకు ఆ వివరాలు స్థానిక విలేకరుల కు జాతీయ తెలుగు సాదస్వత పరిషత్ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేశిరాజు రాంప్రసాద్, ట్రెజరర్ సుధీర్ రమణ తెలిపారు. ఈ కార్యక్రమానికి సభా అధ్యక్షులుగా కేంద్రం ఉక్కు గనులు శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ హాజరై తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, న్యూ ఢిల్లీ లో ఇలాంటి కార్యక్రమాలు జరగడం ఇలాంటి కార్యక్రమాలు జరగడం చాలా గొప్ప విషయం అని, ఆయన ఇలాంటి కార్యక్రమాల ద్వారా తెలుగు వారందరినీ ఒకచోట చేర్చడం వల్ల చాలా ఉపయోగం ఉంటుందని తెలుగు వారందరూ తెలుగువారు తెలుగులో మాట్లాడుకోవడం చేయాలని తెలుగు సారస్వత పరిషత్ చేస్తున్న విభిన్న కార్యక్రమాలను అభినందించారు. మరి మాట్లాడుతూ ఆశాన్ని శాసనసభ్యులు పితాని సత్యానారాయణ, ఆక్వా పితామహులు ముదిరాజు కాశీ విశ్వనాథరాజు చేస్తున్న చేసిన సేవలను ప్రస్తుతించి అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యులు కే లక్ష్మణ్ గారి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు రెండుగా విడిపోయిన మాట్లాడే భాష ఒకటేనని రక్త శ్రీ నారాయణ రెడ్డి గారు చెప్పినట్టు ప్రాంతాలు వేరైనా అందరూ ఒకటేనని రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని అన్నారు తెలుగు భాషా కార్యక్రమాలు ఎక్కువ జరగాలని విద్యార్థులని తెలుగు మాట్లాడే లాగా రాసేలాగా చేయాలని వారు కోరారు జాతీయ తెలుగు సారస్వత పరిషత్ చేస్తున్న కవిసమ్మేళన కార్యక్రమాలను అభినందించారు. హస్తినలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడాన్నీ మంచి ప్రక్రియగా తెలిపారు. రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్రావు మాట్లాడుతూ తనకు తెలుగు భాష అంటే చాలా ఇష్టం అని భీమవరంతో ప్రాంతంతో తన అనుబంధాన్ని వివరించారు తెలుగు భాష కార్యక్రమాలు ఎక్కడ జరిగినా కానీ హాజరవుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ వాగ్దేవి జీవిత సాఫల్య పురస్కారాలను ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, ఆక్వా పితామహులు ఉద్ధరాజు కాశీ విశ్వనాథరాజు , గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, తిరుమల తిరుపతి దేవస్థానం కి చెందిన ఆకెళ్ల విభీషణ శర్మ,తెలంగాణా సాహిత్య అకాడమీ కార్యదర్శి, ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు కసిరెడ్డి వెంకటరెడ్డి ల ను కలిసి సన్మానించారు. ఆ తర్వాత జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభా పురస్కారాలను గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు కంతేటి వెంకట్ రాజు, ముత్యాల శ్రీనివాస్, ఈతకోట భీమ శంకరరావు, జక్కంపూడి లక్ష్మీ నరసింహ నాగేంద్ర కుమార్, సుమన్ మచ్చ, పద్మ వర్మ అల్లూరి, బడే సాబ్, కొట్టే సాయిప్రసాద్, ఆరేటి ప్రకాష్ పి,ఢిల్లీ వసంత్, కాగిత వెంకటరమణా రావు, పెనుమట్స అర్జున్ రాజు, కే సురేంద్ర, మంగళంపల్లి సూర్యనారాయణ మూర్తి, అల్లూరి రవివర్మ,డా.కే సుధీర రమణ, ఎస్ రాజశేఖర్ రెడ్డి, చంద్రభట్ల శ్రీనివాస్, బొల్లు రామ్మోహన్, డాక్టర్ ఆది నారాయణ లకు ఈ పురస్కారాలను అందజేశారు. 70 మంది కళాకారులు ఆద్యంతం ఆసక్తికరంగా ప్రదర్శనలను నిర్వహించారు. శాలువాతోను మెమెంటోను సత్కరించారు నిర్వాహకులు. తెలుగు సారస్వత పరిషత్ కార్య నిర్వాహక అధ్యక్షులు కేశిరాజు రాంప్రసాద్ సేవలను భక్తులందరూ అభినందించి అభినందన సత్కారం అందజేశారు. రాంప్రసాద్ మాట్లాడుతూ కార్యక్రమానికి సహకరించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాల తెలియజేశారు.

అక్షరానికి పదునెంతో శ్రీశ్రీ కవిత్వం చెబితే... అక్షరానికి అమృతబంధమేంటో తిలక్ కవిత్వం చూపితే... అదే అక్షరానికి జ్ఞానపీఠ మకుటాన్ని తొడిగి హస్తినలో తెలుగు జెండా ఎగరేసింది మన డాక్టర్ సి. నారాయణరెడ్డి గారు! అటువంటి మహాకవి జయంతి వేడుకల్లో తెలుగు వెలుగు సంబరాలు ఢిల్లీలో చేయడం చాలా గొప్పగా ఉందని వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ వర్మ ను ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచం లో మొత్తం 7159 భాషలు ఉండగా తెలుగు భాష 15వ అతి పెద్ద భాషగా ఉందన్నారు. దేశంలో గుర్తించ బడిన 22 భాషలలో తెలుగు భాషకు 2008 లో శాస్త్రీయ హోదా వచ్చిందని, నేడు మాతృ భాషను కాపాడుకోవలసిన ఆవశ్యకత ఉందని ఆయన వ్యాఖ్యనించారు .ఈ కార్యక్రమాన్ని జాతీయ తెలుగు సాదస్వత పరిషత్ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేశిరాజు రాంప్రసాద్, ట్రెజరర్ సుధీర్ రమణ , పద్మా వర్మ అల్లూరి, అల్లూరి రవివర్మ చంద్రభట్ల శ్రీనివాస్, చెరుకు మహేశ్వర శర్మ ,పరశురాం అందరూ ఈ కార్యక్రమ నిర్వహణ లో సహకరించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా అల్లూరి రవివర్మ వ్యవహరించారు.

# ఏలూరు నగరంలో వాయుకాలుష్య నియంత్రణకు పక్కాచర్యలు చేపట్టాలి

- **కాలం చెల్లిన వాహనాలపై కేసులు నమోదు చెయ్యాలి.**
- **జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి.**

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.



ఏలూరు నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు పటిష్టమైన ప్రణాళిక అమలుచేసి, లక్ష్యాలను అధిగమించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేటు గౌతమీ సమావేశమందిరంలో కాలుష్య నియంత్రణా మండలి, నగరపాలక సంస్థ, రవాణా, పోలీసు, అటవీ, పరిశ్రమలు, సంబంధిత అధికారులతో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్ సి ఏపి) జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. కేంద్రప్రభుత్వం (ఎన్ సి ఏపి) 2024 -25, 2025 -26 నిధులతో చేపట్టిన పనులు, చేపట్టబోయే పనులుపై సమీక్షించి, మిగిలిన పనులు త్వరగా పూర్తిచెయ్యాలని నగరపాలక సంస్థ, పోలీసు శాఖలు అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు నగరవాసులకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని అన్నారు. చెత్తకుప్పలు లేకుండా నగరాన్ని పరిశుభ్రంగా ఉండేలా, పొడి,తడి చెత్త వేరువేరుగా ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మొక్కలు నాటి సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని అన్నారు. చెత్తను, వ్యర్థపదార్థాలను తగలబెట్టకుండా పక్కాచర్యలు చేపట్టాలని అన్నారు. నగరంతో పాటు రూరల్ ప్రాంతాల్లో గల ప్రైవేటు బంకులను తనిఖీచేసి పెట్రోల్, డిజిల్ నాణ్యతను పరీక్షించాలని, నాణ్యత లోపిస్తే సీజ్ చేసి, పోలీసు కేసులు పెట్టాలని అన్నారు. నగరపాలక సంస్థలో గ్రీన్ వాహనాలు ఏర్పాటు చెయ్యాలని, అదేవిధంగా బ్యాటరీ వాహనాలు, తక్కువ దూరంలో సైకిల్ మీద ప్రయాణించేలా ప్రజలకు రవాణా శాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. గాలిలో దుమ్ము, ధూళి శాతాన్ని మిషన్ ద్వారా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి, అందుకు అనుగుణంగా చర్యలు చేపటాలన్నారు. కాలం చెల్లిన వాహనాలను గుర్తించి సీజ్ చెయ్యాలని, అటువంటి కేసులు పట్ల క్షేత్రస్థాయిలో పరిశీలన చేసుకుని, అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలు కండిషన్లో, నడిపే డ్రైవర్లకు తప్పనిసరిగ్గా లైసెన్సులు కలిగి ఉండాలని వారికి క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు, వైద్యపరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రాంతీయ కాలుష్య నియంత్రణా మండలి ఇఇ ఏ.శ్రీరామచంద్ర మూర్తి, నగర పాలక సంస్థ కమీషనరు ఏ.భానుప్రతాఫ్, జిల్లా పరిశ్రమలు కేంద్రం జియం ఆర్.వెంకటరావు, జిల్లా రోడ్డు ట్రాన్సుపోర్టు అధికారి యస్.బి. శేఖరు, సిపిసిబి కన్సాల్టెంటు ఏ.కోమలి, రవాణా, పోలీసు, వ్యవసాయ, కాలుష్య నియంత్ర మండలి, పౌరసరఫరాలు, అటవీ, సంబంధిత శాఖలు అధికారులు పాల్గొన్నారు.

# ఆక్వా రైతుల విద్యుత్ సబ్సిడీ జీవో తక్షణమే అమలు చేయాలి

## ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆక్వా రైతుల సబ్సిడీ కోసం విడుదల చేసిన జీవోను తక్షణమే యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం డిమాండ్ చేసింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం సమావేశం రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ ఆక్వా రైతులకు ఆక్వా జోన్, నానా ఆక్వా జూన్ పరిధి ఆంక్షలు లేకుండా యూనిట్కు రూ. 1.50 రాయితీ అందించే జీవోను వెంటనే అమలు చేయాలని ఏపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, వ్యవసాయ మంత్రి అచ్చం నాయుడు,విద్యుత్ మంత్రి గొట్టి పాటి రవి కుమార్,మంత్రి నారా లోకేష్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రొయ్యల్ని కొనుగోలు చేసే ప్రాసెసింగ్ యూనిట్లు యజమాన్యం 100 అకౌంట్ లెక్క కాకుండా 30 ఎకౌంటు రూ. 550, 40 కౌంటు రూ. 490 ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రొయ్యల దాణా కంపెనీ యాజమాన్యం ఫార్ములా బేస్ దేనికి ప్రకారం ఫీడ్ రేట్లు పెంచితే, ఫార్ములా బేస్ ప్రకారంమే ధర నిర్ణయించి రొయ్యలు కొనుగోలు చేయాలని, దీనికి మధ్యవర్తిత్వం ప్రభుత్వమే ఉండాలని గాంధీ భగవాన్ రాజు కోరారు. రాష్ట్ర మంత్రులనే కాకుండా కేంద్ర మంత్రులను కూడా ఢిల్లీ వెళ్లి కలిసి సమస్యను వివరించడం జరిగిందని తెలిపారు. ఆక్వా రైతుల కోసం రాష్ట్ర సంఘం ఎంత దూరమైనా వెళ్లి నిలబడి పోరాటానికి సిద్ధంగా ఉన్నాము అని తెలిపారు. ఏ సమస్య అయినా సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవడానికి రాష్ట్ర ఆక్వా రైతు సంఘం తరపున తాము సిద్ధంగా ఉన్నామని, అదేవిధంగా ఫీడ్, ప్రాసెసింగ్ యాజమాన్యాలు కూడా ముందుకు వచ్చి రాష్ట్ర ప్రభుత్వం సమక్షంలో పరిష్కారం జరపాలని ఆయన కోరారు. ఆక్వా రైతులకు ఎమాత్రం న్యాయం జరగకపోయినా వేలాది మంది రైతులు తో అమరావతి వద్ద, అవసరమైతే ఢిల్లీ లో జంతర్ మంతర్ వద్ద సమస్యలు పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నామని గాంధీ భగవాన్ రాజు హెచ్చరించారు. ఏపీ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి త్సవటపల్లి నాగభూషణం మాట్లాడుతూ 99 పైసలకి ఎకరాల భూమిని పరిశ్రమలకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం కట్టబెడుతున్న తరుణంలో వేలాది కోట్ల విదేశీ మారకద్రవ్యం ఆదాయం తెచ్చిపెడుతున్న ఆక్వా రంగాన్ని కూడా పరిశ్రమగా గుర్తించి ఈ రంగానికి కావాల్సిన యంత్రాల సబ్సిడీలు, విద్యుత్ రాయితీ, సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. సంఘ ఉపాధ్యక్షులు యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ ఫార్ములా ప్రకారం పెరిగినప్పుడు పెంచడం, తగ్గినప్పుడు తగ్గించడం సమంజసంగా లేదన్నారు. ఆక్వా రంగానికి 5% జిఎస్టిని తక్షణమే అమలు చేయాలని కోరారు. సమావేశంలో బోనం వెంకట నర్సయ్య,మంతెన ఆనంద్ గజపతిరాజు, రాష్ట్ర సంఘ మహిళ ప్రతినిధి కె కృష్ణ శ్రీ, యాల్ల వెంకటానందం, శ్రీహరి వర్మ, దెందుకూరు సత్యనారాయణ రాజు, కాకర్ల వినాయక, సత్తినేడు వెంకటేశ్వరరావు, మేడిది జాన్ డేవిడ్ రాజు పి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

### కుయ్యేరు గ్రామ ప్రజల ఇలవేల్పు

# మహాలక్ష్మి అమ్మవారికి ఆషాడం సారె సమర్పణ...!

- అమ్మవారికి సారి ఇచ్చేందుకు భారీఎత్తున పోటెత్తిన ఆడపడుచులు.
- సాంప్రదాయ దుస్తులతో అమ్మవారికి సారే సమర్పించిన మహిళా మూర్తులు.
- అంగరంగ వైభవంగా జరిగిన సారే సమర్పణ కార్యక్రమం.
- వివిధ రకాల కూరగాయలతో మహాలక్ష్మి అమ్మవారిని సుందరంగా తీర్చిదిద్దిన వైనం .
- మహిళా మూర్తులు లలిత సహస్ర, భక్తి గీతాలతో మార్మోగిన ఆలయం.





ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు

కుయ్యేరు గ్రామ ప్రజల ఇలవేల్పు అయిన శ్రీ శ్రీ శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి ఆషాడమాసం పురస్కరించుకుని గ్రామంలో అమ్మవారికి ఆడపడుచులు సారె ఇచ్చేందుకు పోటీపడ్డారు. ఈమేరకు గురువారం కాజులూరు మండలం కుయ్యేరు గ్రామంలో ఆలయం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వందలాది మంది భక్తుల నడుమ కన్నుల పండుగగా ఈకార్యక్రమం కొనసాగింది. గ్రామంలో పెద్దలు, పిల్లలు, మహిళలు కావిళ్ళతో చలిమిడి, పలురకాల పిండి వంటలతో పాటు. వివిధ రకాల స్వీట్లు అమ్మవారికి హిందూ సాంప్రదాయ దుస్తులతో భక్తిశ్రద్ధలతో మహిళామూర్తులు వారి వారి స్తోమతకు తగ్గట్టుగా సారే సమర్పించారు. కుయ్యేరు గ్రామంలో ఏర్పాటు చేసుకున్న ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ మహాలక్ష్మి తల్లితో పాటు ఇరు వైపులు గల, తాళ్లమ్మ, గొడ్లమ్మ తల్లుల నిలయమైన ఆలయంలో ఆషాఢ మాసం సారే సమర్పించే కార్యక్రమం సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. తొలుత గ్రామంలో గల అంగర గుడి వద్ద గల పెద్దవీధి రామాలయం సెంటర్ నుండి భారీఎత్తున ఆడపడుచులు వివిధ రకాలైన సారె తీసుకుని శోభాయాత్రగా బయలుదేరి గ్రామం అంతా తిరిగి చివరగా యానం-ద్రాక్షారామం ప్రధాన రహదారికి చేరుకుని సమీపంలో గల మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి పసుపు నీళ్ల అభిషేకం, పసుపు కుంకుమ పూజలలో నిర్వహించి పలు రకాల పుష్పాలుతో అమ్మవారిని పూజించారు. అలాగే ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం ఇక్కడకు చేరుకున్న వందలాది మహిళా మూర్తులు లలితా సహస్ర ప్రారాయణం తోపాటు, అమ్మవార్లకు ప్రీతి పాత్రమైన వివిధ రకాల భక్తి గీతాలతో ఆలయం మార్మోగింది. దీంతో గ్రామానికి చెందిన పలువురు ఆడపడుచులు వివిధ గ్రామాల నుండి బుధవారం సాయంత్రానికి గ్రామం చేరుకుని గురువారం అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమం గ్రామంలో రెండవసారి చేసినా అనూహ్యంగా భక్తులందరూ తరలిరావడం అందరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారి సమర్పించడం ఆనంద దాయకంగా ఉందని ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే సూమారు రెండు వేల కేజీల వరకూ వివిధ రకాల స్వీట్లుతో పాటు,సలివిడి వడపప్పు భారీ ఎత్తున భక్తులు సమర్పించారు .వీటికి తోడు పలురకాల ఫ్రూట్స్, అరటి గెలలు భక్తులు సమర్పించారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం వరకు గ్రామంలో మహిళ మూర్తులుచే భక్తులు సమర్పించిన సారెను ఆటోల ద్వారా ఇంటింటికి అమ్మవారి పంపిణీ చేశారు. అలాగే ఇక్కడికి విచ్చేసిన భక్తులకు మజ్జిగ,పానకం పులిహోర, వంటి పలురకాల ప్రసాదాలను వితరణ చేశారు. దూరప్రాంతాలనుండి వచ్చిన భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. ఇది ఇలాఉండగా అమ్మవారికి పుట్టింటి, అత్తింటి వారు, వేరువేరుగా ఆషాడం సారి సమర్పించడం జరిగింది. అలాగే గ్రామంలో పలు కుటుంబాలు అమ్మవారికి ఈ సారెను స్వచ్ఛందంగా తీసుకువచ్చి సమర్పించుకున్నారు. ఈ మహోన్నతమైన కార్యక్రమంతో అమ్మ అనుగ్రహం గ్రామంలో పాడి పంటలు, పశుపక్షాదులు ఆయురారోగ్యాలతో గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉంటారని అందరూ ఆయురారోగ్యంగా వర్ధిల్లాలని గ్రామాన్ని అన్నివిధాలాగా ఇలవేల్పు అయిన మహాలక్ష్మి అమ్మవారు కాపాడుతుందని, ఇక్కడికి చేరుకున్న వందలాదిమంది గ్రామస్తుల్లో పలువురు తమ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి గ్రామస్థులు తోపాటు, వారి బంధువులు సైతం వివిధ ప్రాంతాలనుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసారు.

ఇక్కడ ప్రతి ఏడాది నిర్వహిచే మహాలక్ష్మి అమ్మవారి జాతర తీర్థం మహోత్సవాలు గత జూన్ నెలలో అత్యంత వైభవంగా నిర్వహించి అమ్మవారిని అంగర గుడి నుండి ఆలయంలోకి తీసుకు రావడం జరిగింది దీంతో గురువారం అమ్మ వారికి మరోసారి భక్తి శ్రద్ధలతో ఆషాడం సారె సమర్పించి గ్రామస్తులు తమ తమ మొక్కలను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కొర్ల రాంబాబు, నంది కోళ్ళ శ్రీనివాసు, నందికోళ్ళ మల్లేశ్వరరావు, నందికోళ్ళ హరీష్, నందికోళ్ళ నాగేశ్వరరావు, నందికోళ్ళ వీర పద్దయ్య, నందికోళ్ళ సతీష్ (భాను)నందికోళ్ళ అత్యుత్, పలువురు గ్రామస్తులు , గ్రామానికి చెందిన ఆడపడుచులు, తదితరులు భారీ ఎత్తున తరలివచ్చారు.

## అరటి బొంతలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై డ్వాక్రా మహిళలకు అవగాహన



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో డ్వాక్రా మహిళలకు అరటి బొంతల నుంచి నార వెలికితీత, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏపీఎం మంగాయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఏ పథక సంచాలకులు (పీడీ) నగేష్, ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్, జిల్లా హార్టికల్చర్ అధికారి మల్లికార్జునరావు హాజరై క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, సాధారణంగా వృథాగా పారేసే అరటి బొంతల నుంచి నాణ్యమైన నారను వెలికితీసి, దానితో బ్యాగులు, హస్తకళ ఉత్పత్తులు తదితర విలువ ఆధారిత వస్తువులు తయారు చేసి మహిళలు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రతి డ్వాక్రా సభ్యురాలు మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ రంగంపై ఆసక్తి ఉన్న మహిళలకు ప్రభుత్వం ద్వారా ఉచిత శిక్షణతో పాటు యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్, విక్రయాల్లో పూర్తి సహకారం అందించి మార్కెట్ హామీ కూడా కల్పిస్తామని అధికారులు భరోసా ఇచ్చారు. ఈ అవగాహన సదస్సులో వీవోఏలు, డ్వాక్రా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు నిరాధారం

- నారా లోకేష్‌పై అక్కసుతోనే విమర్శలు
- యువతకు ఉద్యోగాల కల్పనలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది
- జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేకే వైసీపీ నేతలు డీఎస్సీ నియామకాలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి విమర్శించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వైసీపీ జీర్ణించుకోలేక ధర్నాలు, ప్రెస్‌మీట్లు నిర్వహిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి తొలి సంతకాన్ని డీఎస్సీ ఫైల్‌పై చేసి, రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టిందని తెలిపారు. దీంతో వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటా అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వైసీపీ వక్రీకరిస్తోందని ముత్యాల బాబ్జి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.74 ప్రకారం స్పోర్ట్స్ కోటా అమల్లో ఉండగా, అనంతరం జగన్ ప్రభుత్వం ఆ నిబంధనల్లో మార్పులు చేసి కోటాను తగ్గించిందన్నారు. ప్రస్తుతం అదే జీవో ప్రకారం స్పోర్ట్స్ కోటాలో డీఎస్సీ ఉద్యోగాలను భర్తీ చేస్తుంటే, దానిని వ్యతిరేకిస్తూ వైసీపీ నేతలు ధర్నాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపడుతున్న కూటమి ప్రభుత్వంపై నిరాధార విమర్శలు చేయడం మానుకుని, నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని వైసీపీ నేతలకు ముత్యాల బాబ్జి సూచించారు. రాష్ట్ర ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, ఉద్యోగాల కల్పన విషయంలో కూటమి ప్రభుత్వానికి ప్రజల పూర్తి మద్దతు ఉందని ఆయన పేర్కొన్నారు.

## వెదిరేశ్వరం జెడ్పీ హైస్కూల్‌లో మండల అభివృద్ధి అధికారి ఆకస్మిక తనిఖీ

- విద్యార్థుల భద్రత, పాఠశాల ఆస్తుల పరిరక్షణపై అధికారుల దృష్టి.
- ప్రహరీ గోడ, కొబ్బరి చెట్ల ఆదాయం, సర్వేపై చర్యలకు హామీ.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

రావులపాలెం మండలం వెదిరేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల అభివృద్ధి అధికారి సీహెచ్.వి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం గురువారం పరిశీలించారు. జూలై 24న నిర్వహించిన మెగా పేరెంట్స్ డే సందర్భంగా ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదులపై స్పందిస్తూ ఈ తనిఖీ చేపట్టారు. పరిశీలనలో భాగంగా పాఠశాల వెనుక భాగంలో ప్రహరీ గోడ లేకపోవడం, ఆటస్థలంలో విద్యుత్ స్తంభం ఉండడం వల్ల విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. అలాగే పాఠశాల ఆవరణంలోని కొబ్బరి చెట్ల ద్వారా వచ్చే ఆదాయం పాఠశాలకు కాకుండా గతంలో పంచాయతీ వేలం ద్వారా ఇతరులు పొందుతున్న అంశాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ, పాఠశాల ఆస్తుల పరిరక్షణ, విద్యార్థుల భద్రత వంటి కీలక అంశాలపై ఇన్నేళ్లుగా స్పందించకపోవడం ఉపాధ్యాయుల నిర్లక్ష్యాన్ని సూచిస్తోందన్నారు. పాఠశాల భూమికి సంబంధించిన సర్వే నిర్వహించి, కొబ్బరి చెట్ల ఆదాయంపై సంబంధిత అధికారులతో వెంటనే సంప్రదించాలని సూచించారు. ఈ అంశాలపై జిల్లా పరిషత్ అధికారులకు లేఖ రాసి తగిన చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎస్ఎంసీ చైర్మన్ మారే సుబ్బాయమ్మ మాట్లాడుతూ, ఇంతకాలం రాజకీయ నాయకులు, గత ఎస్ఎంసీ కమిటీలు ఈ సమస్యలపై దృష్టి సారించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుతం అధికారులు స్పందించి చర్యలు చేపట్టడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండల అభివృద్ధి అధికారి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజనం నాణ్యత, రుచి, నిర్వహణపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఎంఈఓ-2 శ్రీనివాసరాజు, పంచాయతీ కార్యదర్శి వి. సబిత, వ్యవసాయ ప్రత్యేక అధికారి లావణ్య, ఎంపీటీసీ గంట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం, జీలుగుమిల్లి పశుసంవర్ధక విభాగాలను ఏలూరు డివిజన్‌కు మార్చాలని ప్రభుత్వం నిర్ణయం

### ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కృషికి ఫలితం



ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

పోలవరం నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడే మరో కీలక నిర్ణయం వెలువడింది. పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్, విజయవాడ జారీ చేసిన మెమో ప్రకారం, పోలవరం మరియు జీలుగుమిల్లి మండలాల పశుసంవర్ధక సేవల పరిపాలనా పరిధిని నూజివీడు డివిజన్ నుంచి ఏలూరు పశుసంవర్ధక డివిజన్‌కు మార్చే ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోద ప్రక్రియను పూర్తి చేసింది. ఈ మార్పు కోసం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఏపీఎస్టీసీఎఫ్‌సీఎల్ (ట్రికర్) ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. వారి ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్న జిల్లా పశుసంవర్ధక అధికారి ( డి ఏ హెచ్ ఓ ), అనంతరం పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్ ఈ అంశంపై తుది చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయంతో పోలవరం, జీలుగుమిల్లి ప్రాంతాల పశుసంవర్ధక సేవల నిర్వహణ మరింత సులభతరం కానుండగా, రైతులు, పశుపోషకులకు పరిపాలనా సేవలు వేగంగా అందే అవకాశం ఏర్పడనుంది. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తమ విజ్ఞప్తిని ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## పదోన్నతి పొందిన (ఎంపిడిఓ) వెంకట రామన్‌కు ఘన సత్కారం



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

ఆత్రేయపురం మండలంలో ఎంపీడీఓగా సేవలందించి పదోన్నతిపై ప్రస్తుతం నరసాపురం డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ కు గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, వాడపల్లి దేవస్థాన కమిటీ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ అధ్యక్షుడు ముదునూరి రామబద్రరాజు, తహసీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి ఎంపీడీఓ పి.వి.ఆర్.కె. రాజు అధ్యక్షత వహించారు. వక్తలు మాట్లాడుతూ వెంకట రామన్ ఆత్రేయపురంలో ప్రజాప్రతినిధులతో సమన్వయంగా పనిచేస్తూ గ్రామాభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలు, ఉపాధి హామీ పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో విశేష సేవలందించారని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన నిబద్ధత ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. వెంకట రామన్ మాట్లాడుతూ తనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె. రమేష్‌బాబు, మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామస్వరూప్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు... ఏ విచారణకైనా నేను సిద్ధం..

### -మాజీ సర్పంచ్ నాగమణి సవాల్..

ప్రజాభూమి ప్రతినిధి -కూనవరం..



మండలంలో మీ బెదిరింపులకు, తాటాకు చప్పుళ్లకు ఇక్కడ భయపడేవారు ఎవరూ లేరు. నిజం గా నీకు, దమ్ముంటే ఏ విచారణ అయినా చేయించుకోండి... దేనికైనా నేను సిద్ధం! అని మాజీ సర్పంచ్ నాగమణి, నాయకుడు పాయం సుందరయ్య వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆరోపణలు చేసే ముందు తమ సొంత చరిత్ర ఏమిటో తెలుసుకుంటే మంచిదని హెచ్చరిస్తూ ఆమె ప్రకటన విడుదల చేశారు. రాజకీయ బ్లాక్ మెయిలింగ్ మాకు రాదు నీ తండ్రి లాగా ప్రజలను, అధికారులను బ్లాక్ మెయిల్ చేసి బ్రతకడం మా రక్తం లోనే లేదు. ఆదివాసీల ఆస్తులను, భూములను అక్రమంగా ఆక్రమించడం మాకు చేతకాదు. నీతిగా, నిజాయితీగా గ్రామాభివృద్ధి కోసం పనిచేశాం కాబట్టే ప్రజల్లో గౌరవంగా నిలబడ్డాం.?విచారణ నా మీద కాదు. మీ తండ్రి చిట్టా విప్పుతాంమా పాలనపై విచారణ కాదు ముందు మీ తండ్రి పాయం వెంకయ్య ఎక్కడెక్కడ ఏ రకంగా బ్లాక్ మెయిల్ చేశాడు? ఎవరెవరి దగ్గర ఎంతెంత వసూళ్లు చేశాడో? ఆదివాసీల భూములను ఎలా సొంతం చేసుకున్నాడో త్వరలోనే ఆధారాలతో సహా బయట పెడతాం. మీ సొంత పార్టీయే మీ అక్రమాలపై విచారణ జరిపే రోజు అతి దగ్గరలోనే ఉంది. నిజాలు త్వరలోనే తెలుతాయి గ్రామంలో ఏ నిధులు ఎక్కడ దుర్వినియోగం అయ్యాయో, ఎవరు అవినీతికి పాలు పడ్డారో ప్రజలందరికీ తెలుసు. త్వరలోనే మీ పార్టీ లోనే మీ అవినీతి చిట్టా పై సమగ్ర విచారణ జరుగుతుంది. అప్పుడు తేలుతుంది ఎవరు సుద్ద పూసలో, ఎవరు అవినీతి పరులో! చేతనైతే గ్రామాభివృద్ధికి తోడ్పడాలి తప్ప, స్వార్థ రాజకీయాల కోసం తప్పుడు ప్రకటనలు ఇస్తే ఊరుకునేది లేదని మాజీ సర్పంచ్ నాగమణి హెచ్చరించారు.

## ఆధారాలు లేని అబద్ధాల ఆరోపణలు చేస్తే ఖబర్దార్ జాగ్రత్త.

### -ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు మడకం రమేష్

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం



మండలంలోని కొంతమంది వ్యక్తులు తాము ఇచ్చిన స్టేట్‌మెంట్‌కు సంబంధం లేకుండా గతం లో జరిగిన విషయాలను ప్రస్తావిస్తూ మాట్లాడుతున్నారని ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు మడకం రమేష్ విమర్శించారు. స్థానిక ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ ఉన్నతాధికారులను కలిసి పంచాయతీ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తే కొంతమందికి ఎందుకు నొప్పి అని ఆయన ప్రశ్నించారు. పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించిన తర్వాత ప్రోటోకాల్ పాటించ కుండా పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలపై ప్రశ్నిస్తే దానిని తప్పుప ట్టడం ఎందుకని అన్నారు. గత ఏడు సంవత్సరాల క్రితం జరిగిన అవినీతి గురించి మిమ్మల్ని ఎవరు ప్రశ్నించారని, ఎవరూ అడగకపోయినా మీకు మీరే ఆ విషయాన్ని తెరపైకి తీసుకువచ్చి, అప్పట్లో పాయం మధు సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఎలాంటి అవినీతి జరగలేదని చెప్పడం ఎందుకని రమేష్ ప్రశ్నించారు. డీఎల్‌పీఓ అధికారి పేరును ప్రస్తావిస్తూ అవినీతి జరగలేదని మీకు మీరే క్లియరెన్స్ ఇచ్చుకుంటే పెద్దార్కూరు గ్రామ పంచాయతీ ప్రజలు దాన్ని నమ్ముతారా? అని ఆయన అన్నారు. అవినీతి జరగలేదని చెబుతున్న వారు అప్పుడే దానికి సంబంధించిన ఆధారాలతో ఎందుకు నిరూపించలేకపోయారని ప్రశ్నించారు. ఒకవైపు గ్రామ సభల్లో పంచా యతీ నిధుల వినియోగంపై ప్రజలు పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న సమయంలో, ఆ కార్యదర్శిని తమ వెంట తీసుకెళ్లింది ఎవరు? అని రమేష్ ప్రశ్నించారు. "ఆ రోజు జరిగిన ఘటనలను ప్రజలు మర్చిపోయారని అనుకుంటున్నారా? అని ఆయన నిలదీశారు. అప్పటి వ్యవహారాలపై ఇప్పుడు వివరణలు ఇవ్వడం కంటే, అవినీతి జరగలేదని చెబుతున్న వారు అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు ఉంటే బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

## వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో మోడరన్ విద్యార్థిని శ్రీజ శార్వాణి .

### -పలువురు ప్రశంసలు అభినందనలు.

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం



రామచంద్రపురం మోడరన్ జి.ఆర్.సి జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపీసీ గ్రూపు ద్వితీయ సంవత్సరం చదువుతున్న టి. శ్రీజ శార్వాణి ప్రతిష్టాత్మక వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో పేరు దక్కించుకుంది. మే నెల రెండవ తేదీన రాజమహేంద్రవరం ఆనం కళాక్షేత్రంలో జరిగిన కూచిపూడి నాట్య కార్యక్రమంలో పాల్గొని శ్రీజ ఈ ఘనత సాధించినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయిన్ జి. వి.రావు గురువారం తెలిపారు. ఆ కార్యక్రమంలో నిర్విరామంగా 12 గంటల పాటు అన్నమాచార్యుల 108 శ్లోకాలకు 200 మంది కూచిపూడి కళాకారులు నాట్యం చేసారని, ఆ బృందంలో శ్రీజ శార్వాణి ఒకరని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీజని అధినేత జి.వి.రావు,ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సి. హెచ్. రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పి. ఎస్. ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సి. హెచ్. శ్రీనివాస్, ఇంటర్మీడియట్ స్టాప్ అభినందించారు. శ్రీజ తండ్రి కృష్ణ మోహన్ స్థానికంగా వ్యాపారవేత్త కాగా శ్రీజ తల్లి సుధామణి గృహిణి. కాగా భవిష్యత్తులో శ్రీజ మరిన్ని విజయాలు అందుకోవాలని మోడరన్ అధినేత జి.వి. రావు ఆకాంక్షించారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
శుక్రవారం 31 జూలై 2026

## ప్రతి రైతు కూడా వాతావరణ భీమా పథకాన్ని వినియోగించుకోవాలి

### - : జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

జిల్లాలోని ప్రతి ఉద్యాన రైతు కూడా వాతావరణ భీమా పథకాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి పేర్కొన్నారు. గురువారం క్రాప్ ఇన్సూరెన్స్ స్కీమ్ లో ఐదు ఉద్యాన పంటలు కవర్ అవుతున్నాయని, రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని బీమా ప్రీమియం కట్టాలని కోరుతున్నామన్నారు. ఎండుమిరపకి ఇన్సూరెన్స్ ఉందని, తర్వాత వెదర్ బేస్డ్ ఇన్సూరెన్స్ కింద మనకి దానిమ్మ, బత్తాయి, అరటి, టమాటా ఈ నాలుగు పంటలకి వాతావరణ బీమా పథకము అమలవుతోందన్నారు. దయచేసి ప్రతి రైతు ప్రీమియం కట్టాలని, ఇంకా రెండు రోజులు మాత్రమే సమయం ఉందని, ఈనెల 31లోపు బీమా ప్రీమియం కట్టాలని కోరారు. దానిమ్మకు చూస్తే ప్రీమియం 3,750 రూపాయలు ఒక ఎకరాకి, అలానే బత్తాయికి 2,750 రూపాయలు, టమాటాకి 1,600 రూపాయలు అని, అరటికి 3,000 రూపాయలు ఒక ఎకరాకి ప్రీమియం చెల్లించాలన్నారు. ఎందుకంటే ఈ ఏడాది మనకి వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నాయని, ఇప్పటిదాకా పడాల్సిన వర్షపాతం కూడా పడలేదని, ప్రతి రైతు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వర్షపాతం, రిలేటివ్ హ్యూమిడిటీ, టెంపరేచర్ ఈ మూడు కండిషన్స్ లో ఏదైనా అడ్వర్స్ గా ఉందంటే మాత్రం ఇన్సూరెన్స్ క్లైమ్ రావడానికి అవకాశం ఉందన్నారు. ఈ సంవత్సరం ప్రతికూల వాతావరణం ఉంది కాబట్టి ప్రతి రైతు కూడా ఈ వాతావరణ భీమా పథకాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నామన్నారు.

## ఈ నెల 31 తేదీన పంటల బీమా గడువు ముగింపు

### -ఏవో కాత్యాయని



ప్రజాభూమి, పుట్లూరు.

ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున పంటల బీమా పొందే అవకాశాలు అధికంగా ఉన్నాయి. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద కంది, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ పంటలు ఉన్నాయి. వర్షాభావ పరిస్థిలు ఏర్పడితే రైతులు బీమా ప్రయోజనం లభించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలియజేయడమైనది. అందువలన పుట్లూరు మండలంలోని రైతులందరూ ఆలస్యం చెయ్యకుండా జూలై 31 లోపు పంటల బీమా నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేయడమైనది. గురువారం పుట్లూరు మండలంలోని కోమటికుంట్ల గ్రామం నందు పంటల బీమా గురించి రైతులకు తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. కాత్యాయని, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారైనా బాల ప్రసాద్, సునీత విహెచ్ఏ మరియు రైతులు పాల్గొనడం జరిగినది.

## స్మశాన వాటికలో కంప చెట్లను తొలగించండి-సిపిఎం జిల్లా అధ్యక్షులు సూరి



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలం కెవిపిఎస్ ఆధ్వర్యంలో కడవకల్లు, చెర్లోపల్లి సచివాలయంలో గురువారం వినతిపత్రం ఇవ్వడం జరిగింది. స్మశాన వాటికలో కంపను తొలగించాలనీ అదేవిధంగా కంపౌండ్ వాళ్ళు, బోరు వేసి నీటి సౌకర్యం కూడా కల్పించాలని మండల వ్యాప్తంగా అన్ని దళిత కాలనీలలో సిసి రోడ్లు, సైడు కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. కావున ఆ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఇండ్లులేని వారికి ఇంటి స్థలాలు ఇండ్లు మంజూరు చేయాలని కోరుతున్నాం జిల్లా ఉపాధ్యక్షులు సూరి కెవిపిఎస్ కే నాగభూషణం మాట్లాడుతూ మండల వ్యాప్తంగా కూడా ఈ సమస్యలన్నీ. పరిష్కరించాలని పరిష్కరించకపోతే అన్ని గ్రామాలు కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, స్మశానం కోసం భూమిని కేటాయించాలి ప్రస్తుతం ఉన్న స్మశానంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నాము ఈ కార్యక్రమంలో నాయకులు బి భాస్కర్ రెడ్డి, పి ఆదినారాయణ, రాము, నారాయణస్వామి, పెద్దయ్య కులాయప్ప, ఓబులేసు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బకాయిల వసూలు, పెండింగ్ ఫైళ్లపై ప్రత్యేక దృష్టి

### -నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు

### -విభాగాల ఆకస్మిక తనిఖీలో కమిషనర్ మల్లికార్జున



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మున్సిపల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు, నీటి పన్నులు, వాణిజ్య సముదాయాల అద్దె బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. అదే సమయంలో అన్ని శాఖల్లో పెండింగ్ ఫైళ్లు లేకుండా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని అన్ని విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. ముందుగా రెవెన్యూ విభాగాన్ని తనిఖీ చేసిన కమిషనర్, రెవెన్యూ అధికారి విజయభారతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు షావలీ, అశోక్‌లతో బకాయిల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఇంటి పన్నులు, నీటి పన్నులు, వాణిజ్య సముదాయాల అద్దె బకాయిల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. అత్యధిక బకాయిలు ఉన్న వారి వివరాలతో పాటు ప్రస్తుతం పన్నులు చెల్లించాల్సిన వారి జాబితాను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం పరిపాలన విభాగాన్ని పరిశీలించి పెండింగ్ ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు. జనన--మరణాల నమోదు విభాగంలో సేవలు పొందేందుకు వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అకౌంట్స్ విభాగం పనితీరును కూడా సమీక్షించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీఓ అబ్దుల్ సత్తార్‌తో పెండింగ్ ఫైళ్లపై చర్చించారు. గృహ నిర్మాణ అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను నిబంధనల మేరకు ఆలస్యం లేకుండా మంజూరు చేయాలని, అక్రమ నిర్మాణాలను గుర్తించి సచివాలయాల వారీగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులపై ప్రణాళిక విభాగం సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని, ప్లానింగ్ సెక్రటరీలు డిజిటల్ ఇంటి నంబర్ల కేటాయింపులో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చివరగా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ మల్లికార్జున స్పష్టం చేశారు.

# ఆగస్టు 17,18 వ తేదీలలో జరిగే అండర్ 14 బాల, బాలికల క్రీడా పోటీలు విజయవంతం చేయాలి

### : క్రీడా పోటీలలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్





ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ఆగస్టు 17, 18వ తేదీలలో జరిగే అండర్-14, నియోజక వర్గస్థాయి బాల, బాలికల క్రీడా పోటీలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అనంతపురం స్పోర్ట్స్ ఛాంపియన్షిప్-2026, అండర్-14, బాల, బాలికల క్రీడా పోటీల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 29వ తేదీకి మండల స్థాయిలో క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడ కారులకు ఆగస్టు 17, 18వ తేదీలలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలలో ఎటువంటి సమస్యలు తలెత్త కుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని డిఎస్డివో, వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. ఇందులో వాలీబాల్, కో-కో, కబడ్డీ, ఫుట్ బాల్, బాస్కెట్ బాల్, హాకీ, స్పోర్ట్స్ విభాగంలో రన్నింగ్ రేస్, షాట్ పుట్, డిస్కస్ త్రో, హై జంప్, లాంగ్ జంప్ వంటి పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గస్థాయి నియోజకవర్గస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లాస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించి గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారుల క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని వ్యాయామ ఉపాధ్యాయులు కలెక్టర్ కి తెలిపారు. ఈ క్రీడా పోటీలలో దాదాపు 10, వేల మంది క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఆగస్టు 29వ తేదీ నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు కలెక్టర్ చేతుల మీదుగా గెలుపొందని విజేతలకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని డిఎస్డివో తెలిపారు. క్రీడాకారులు మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి క్రీడా పోటీలలో పాల్గొనేందుకు జిల్లా కలెక్టర్ ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్ డి టి) వారు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డి.ఎస్.డి.ఓ కు క్రీడా సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో, డి ఎస్ డి ఓ మంజుల, ఆర్డిటి స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి, డీఈవో, ఆర్టీసీ ఆర్ఎం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# హ్యూమన్ ట్రాఫికింగ్ అరికట్టాలంటే అన్ని వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలి

### - జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్







ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశాల మేరకు, అనంతపురము జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ భీమారావు ఆదేశాలతో గురువారం అనంతపురం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవ సదన్ నందు వ్యక్తుల అక్రమ రవాణాకు వ్యతిరేక ప్రపంచ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రెడ్స్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్పర్సన్ శైలజదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పై అవగాహన కల్పిస్తూ గోడపత్రికలు విడుదల చేశారు. మహిళలు, బాలికలు ఏ విధంగా హ్యూమన్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారో, బాండెడ్ లేబర్‌గా ఎలా మారుతున్నారో, వాటిని అరికట్టడంలో సమాజం పోషించాల్సిన బాధ్యతపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 1.24 లక్షల మంది హ్యూమన్ ట్రాఫికింగ్ బారిన పడినట్లు పేర్కొన్నారు. హ్యూమన్ ట్రాఫికింగ్ కేవలం మహిళలు, చిన్నారులకే పరిమితం కాకుండా బాండెడ్ లేబర్ రూపంలో కూడా కొనసాగుతుండటం ఆందోళనకరమన్నారు. ఇటీవల ఆధ్వర్యంలో బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లిలో నలుగురు బాండెడ్ లేబర్లను గుర్తించి రక్షించామని, ఇందులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ సహకారం ఎంతో కీలకంగా నిలిచిందన్నారు. బాధితులకు పునరావాసం కల్పించడంతో పాటు వారి జీవనోపాధి మెరుగుపడేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. హ్యూమన్ ట్రాఫికింగ్, బాండెడ్ లేబర్, చైల్డ్ లేబర్ వంటి సామాజిక సమస్యలను అరికట్టాలంటే ప్రభుత్వ శాఖలు, న్యాయ వ్యవస్థ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని రాజశేఖర్ అన్నారు. రెడ్స్ సంస్థ అందించిన సమాచారం ఆధారంగా అనేక కేసుల్లో బాధితులను రక్షించి సమస్యలను పరిష్కరించగలిగామని, ప్రతి సంస్థ బాధ్యతాయుతంగా పనిచేస్తే సమాజంలో ఇటువంటి నేరాలను సమర్ధవంతంగా అరికట్టవచ్చని ఆయన పిలుపునిచ్చారు.

శాశ్వత లోక్ అదాలత్ ఛైర్పర్సన్ శైలజదేవి మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్ లో ఉచిత ప్రజా ప్రయోజన న్యాయ సేవలు వినియోగించు కోవాలని మరియు జూశ్రీఖజూబం గురుంచి వివరించారు. కార్యక్రమంలో రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సుశీల మాట్లాడుతూ అనంతపురం డివిజన్లలో హ్యూమన్ ట్రాఫికింగ్‌ను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తూ ఇప్పటివరకు 400 మంది బాలికలను రక్షించామని తెలిపారు. ముంబై, పూణే వంటి ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న బాలికలను గుర్తించి కాపాడటమే కాకుండా, వారికి భరోసా కల్పించి నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా శిక్షణలు అందించామని చెప్పారు. బాండెడ్ లేబర్ ద్వారా కూడా చిన్నారులు ట్రాఫికింగ్‌కు గురవుతున్నారని, కొందరు లైంగిక వేధింపులకు గురై విదేశాలకు కూడా అక్రమంగా తరలించబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ఉద్యోగాల పేరుతో విదేశాలకు పంపించి మోసాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీలత, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అడ్వైజర్ గోవిందరాజులు, జిల్లా వైద్యారోగ్య శాఖ లీగల్ అడ్వైజర్ ఆషారాణి, ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ నుంచి సంధ్యారాణి, డిఆర్డిఏ నుంచి భాస్కర్ నాయుడు, 1098 ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమాచారి, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుంచి రామ్ నాయక్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### -అమ్మాయిల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు -అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ హారిక కోట



ప్రజాభూమి, హిందూపురం టౌన్

యువత, విద్యార్థులు సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి హారిక కోట సూచించారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని గురువారం సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. కళాశాల కార్యదర్శి అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా చట్ట విరుద్ధమన్నారు. ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. చిన్నపిల్లలను కొనుగోలు చేసి వారితో ప్రమాదకరమైన పనులు చేయించడం, బిక్షాటన చేయించడం, శారీరకంగా మానసికంగా ఇబ్బందులకు గురి చేయడం చట్టరీత్యా నిషేధమన్నారు. ఇలాంటి చర్యలను ఎక్కడైనా జరుగుతుంటే వెంటనే పోలీసులు దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాహాలు చేయరాదన్నారు. అదే విధంగా 18 ఏళ్లలోపు ఉన్న వారు లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం చట్టపరంగా తప్పన్నారు. 18 ఏళ్లలోపు వ్యక్తులు వాహనాలను నడిపి ప్రమాదాలకు గురైతే నడిపిన వ్యక్తులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా చట్టపరంగా శిక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రధానంగా సామాజిక మాధ్యమాల్లో గుర్తుతెలియని వ్యక్తులు ప్రలోభాలకు గురిచేసి తప్పులు చేయించేందుకు ప్రయత్నాలు చేస్తుంటారని, అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్త వ్యక్తులకు తెలియ చేయకూడదన్నారు. కళాశాల కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ, నేటి ఆధునిక సమాజంలో విద్యార్థులు చదువుతోపాటు సంస్కారం, చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, చట్ట పరిధిలో ఎవరికి మినహాయింపు ఉండదన్నారు. తప్పు చేసిన వ్యక్తులు ఖచ్చితంగా శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి చట్టాల పట్ల అవగాహన కల్పించడం విద్యార్థులకు ఎంతో ప్రయోజకరంగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో న్యాయవాదులు అభిలాష్, దివ్య, ఆశ, అధ్యాపకులు అఖిలాభాను, లోక్ అదాలత్ సిబ్బంది రాజా, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ సేవా పరివార్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

గురు పూర్ణిమ సంధర్భంగా హిందూపుర్ బ్రాహ్మణ సంఘ్ సేవా పరివార్ ఆధ్వర్యంలో ఈ ఏడాదిలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. స్థానిక గాయత్రి దేవాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి హిందూపురం, పరిసర ప్రాంతాల్లో ఇటీవల పదవీ విరమణ పొందిన వారు కుటుంబ సభ్యులతో సహా హాజరు కాగా ఘనంగా సన్మానం చేశారు. సమాజ సేవ కోసం ఎన్నో ఏళ్ల పాటు సేవ చేసిన మహనీయులను సన్మానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని పరివార్ ప్రతినిధులు బిఎస్ కాశీ విశ్వనాధ్,అనిల్ కుమార్, ప్రభాకర్ రావు, చక్రపాణి, చంద్రశేఖర్ తదితరులు పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన స్థానిక బ్రాహ్మణ సంఘ్ సేవా పరివార్ సమాజ సేవకు, బ్రాహ్మణుల సమస్యల పరిస్కారం కోసం పనిచేయడం జరుగుతుందన్నారు. బ్రాహ్మణు లందరూ ఐకమత్యంతో మెలిగి సమస్యల పరిస్కారం కోసం కృషి చేద్దామని కోరారు. సన్మాన గ్రహీత కరణం గురురాజారావు మాట్లాడుతూ, గురు పూర్ణిమ సందర్భంగా తమను సన్మానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సంఘ్ పరివార్ భవిష్యత్ లో చేపట్టే సామజిక సేవా కార్యక్రమాలకు తమవంతు సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బిఎస్ విద్యాసాగర్, వేణుగోపాల్ రావు, ఇంజనీర్ ప్రసాద్, సంపత్ కుమార్, సురేషబాబు, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# 37 మందికి రూ.49.69 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

### - : రెండేళ్లలో 692 మందికి రూ.6.90 కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ సాయం



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే కార్యాలయంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 33వ విడుతలో 37మందికి రూ. 49.69లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ నాయకులు, లబ్ధిదారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యే దగ్గుపాటికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 692మందికి రూ. 6.90కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేశామన్నారు. 692మందిలో 450 మంది ముస్లిం మైనార్టీలు ఉన్నారని.. మైనార్టీల పట్ల మా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం ఇది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7

శుక్రవారం 31 జూలై 2026

# సగిలేరు డ్యాం కు పొంచి ఉన్న ప్రమాదం - సిపిఐ

### నీటిపారుదల శాఖ కొరవడిన పర్యవేక్షణ లోపం, సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ ఆగ్రహం

ప్రజాభూమి పోరుమామిళ్ల :

పోరుమామిళ్ల సగిలేరు, రంగసముద్రం చెరువును పరిశీలన చేసిన సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల సహాయ కార్యదర్శి కేశవ, ఏఐటియుసి ఏరియా అధ్యక్షులు సఫా , డి హెచ్ పి ఎస్ ఏరియా అధ్యక్షులు ప్రసాద్ లు గురువారం సిపిఐ పోరుమామిళ్ల మండల సమితి ఆధ్వర్యంలో చెరువును, డ్యామును పరిశీలించడం జరిగింది. సగిరేరు డ్యాము కు షట్టర్లు పైకి లేవాలంటే, విద్యుత్ లైన్లు లేవు, పైకి ఎక్కే దారి కి మట్టితో గేట్లు కూడా పుడిపోయిన పరిస్థితి, బద్వేల్ చెరువుకు నీరు వెళ్లాలంటే తూము వద్ద పూర్తిగా కంపతో అల్లుకుపోయి తూములు కూడా కనబడని పరిస్థితి, అలాగే డ్యాములో బ్రహ్మ సాగర్ నుండి నీరు విడుదల అయినప్పటి నుండి ప్రతిరోజు డ్యాములో నీళ్లు పెరుగుతున్నప్పటికీ, ఇరిగేషన్ అధికారులు డ్యామ్ వైపు కూడా చూడని పరిస్థితి,, నెల నెల ప్రభుత్వము నుండి జీతం తీసుకున్న రోజైనా అధికారులకు డ్యాము గుర్తుకు వస్తాదో లేదో తెలియని పరిస్థితి, ఈ విధంగా గతంలో మొద్దు నిద్రలో అధికారులు ఉండడం వలన, ఉన్నట్టుండి నీటి ప్రవాహం ఎక్కువైతే, గతంలో జరిగిన విధంగానే షట్టర్ కొట్టుకొని పోయే పరిస్థితి



నెలకొన్నది. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని వారన్నారు అలాగే రంగసముద్రం చెరువు లో కంప చెట్లు పూర్తిగా నిండిపోయి, అడుగు తీసి అడుగు పెట్టలేని విధంగా కంప చెట్లు అల్లుకుపోవడం జరిగింది అలాగే 25 సంవత్సరాల నుండి రంగసముద్రం చెరువుకు నీరు రాలేదు పంట పొలాలలో పంట పండలేదు, పంట పొలాల్లో కంప చెట్లు పెద్ద పెద్ద చెట్ల ఉన్నాయి. ఇవి తొలగించాలంటే రైతుకు ఎకరాకు కనీసం 30 వేల రూపాయలు ఖర్చు వచ్చే పరిస్థితి. జూన్ నెలలో పోరుమామిళ్ల పెద్ద చెరువు నుండి పంట కాలువలను పూడిక తీయడం రంగసముద్రం చెరువుకు సరాసరిగా నీళ్లు వెళ్లే విధంగా పూడిక తీయడం జరిగింది. కొన్నిచోట్ల పంట కాలువను పూడ్చి ప్లాట్లు వేసుకుని అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని కొంతమంది వ్యక్తులు వ్యవహరించడం జరిగింది. ఇరిగేషన్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, చెరువు ఆయకట్ట చైర్మన్లు చొరవ చేసి చెరువులు కేవలం చేపలకు మాత్రమే ఉపయోగపడేదం తప్ప, రైతులకు ఉపయోగపడే పరిస్థితి కనపడటం లేదు అధికారుల పర్యవేక్షణ లోపం, పంట కాలవలు ఆక్రమణ, చెరువుల ఆక్రమణ, పోరుమామిళ్ల పెద్ద చెరువుకు తూములకు షట్టర్లు పనిచేయకపోవడం ఈ సమస్యలన్నిటిని వెంటనే అధికారుల పర్యవేక్షణ చేసి పరిష్కరించే తప్ప, బ్రహ్మ సాగర్ నుండి వచ్చిన నీరు రైతుల ఉపయోగపడతాయి లేకపోతే చేపల కోసం, ఉన్న నీళ్ళు వదిలేయడం, మళ్లీ నీళ్లు బ్రహ్మ సాగర్ లో వదలడం మళ్లీ పిల్ల చేపలను వదలడం చెరువులు వదలడం ఈ విధంగా తంతు జరుగుతా ఉంది అధికారులు జాగ్రత్త వహించకపోతే భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ) దశల వారి పోరాటాలకు సిద్ధమవుతామని వారన్నారు

# మానవత సేవే లక్ష్యంగా మరింత కృషి చేస్తా

- మానవత జిల్లా సంయుక్త కార్యదర్శిగా డా. యోగీశ్వర బాబు ఏకగ్రీవ ఎన్నిక
- ఆరోగ్య అవగాహన, రక్తదాన శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తా

ప్రజాభూమి, వేంపల్లె

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి కడప జిల్లా సంయుక్త కార్యదర్శిగా, అలాగే ఆరోగ్య, రక్తదాన జిల్లా కమిటీ సభ్యునిగా వేంపల్లెకు చెందిన డాక్టర్ యోగీశ్వర బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రా రెడ్డి తెలిపారు. స్థానిక మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో డా. యోగీశ్వర బాబును ఆ సంస్థ మండల శాఖ చైర్మన్ చక్రపాణి రెడ్డి, మండలాధ్యక్షుడు సుబాష్, కావలి కృష్ణతేజ, రంగారెడ్డి తదితరులు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ యోగీశ్వర బాబు సేవా




దృక్పథంతో ఆరోగ్య అవగాహన, రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు పొందారని తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ అధ్యక్షుడిగా రెండు సంవత్సరాలపాటు సమర్థవంతంగా సేవలందించి సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయనకు అప్పగించిన కొత్త బాధ్యతలతో సంస్థ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం డా. యోగీశ్వర బాబు మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన మానవత సంస్థ జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలకు నిరంతరం సేవలందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అలాగే సంస్థ అభివృద్ధికి సభ్యులందరి సహకారంతో సమర్థవంతంగా పనిచేస్తానని యోగీశ్వర బాబు తెలిపారు.

## ఇంటి ఇంటి ప్రచారంలో తెలుగుదేశం నాయకులు

ప్రజాభూమి పోరుమామిళ్ల :



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ ఆదేశాల మేరకు మడకశిర శాసనసభ్యులు, టి.టి.డి బోర్డు సభ్యులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు, మరియు మాజీ శాసన మండలి సభ్యులు, రాష్ట్ర టి.డి.పి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పిలుపు మేరకు రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం పేరిట డోర్ టు డోర్ కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేసిన ఇచ్చిన సంక్షేమ అభివృద్ధి ప్రజలు తెలియజేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మడకశిర అబ్జర్వర్ సుధాకర్, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, సత్యసాయి జిల్లా లీగల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, రాష్ట్ర వక్కలిన కార్పొరేషన్ చెర్మన్ లక్ష్మీ నారాయణ, మండల పార్టీ అధ్యక్షులు కల్లుమర్రి నాగరాజు, సింగల్ విండో అధ్యక్షులు నరేష్ కన్నా కస్టర్ కన్వీనర్ రంగే గౌడ్, మురళి బాబు గౌడనహల్లి పంచాయతీ అధ్యక్షులు యూనిట్,బూత్ కన్వీనర్ ఫీల్డ్ అసిస్టెంట్ డీలర్ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## జాతీయ బ్యాడ్మింటనులో పులివెందుల దివ్యశ్రీకి బంగారు పతకం

ప్రజాభూమి,పులివెందుల



జాతీయ స్థాయి క్రీడల పోటీలలో పులివెందుల విద్యార్థిని వై. దివ్యశ్రీ అద్భుత ప్రతిభ కనబరిచింది.జమ్మూ కాశ్మీరు రాష్ట్రం, జమ్మూలో ఈ నెల 24 నుంచి 26 వరకు జాతీయ క్రీడా మరియు విద్యా మండలి ఆధ్వర్యంలో జాతీయ క్రీడా పోటీలు జరిగాయి.ఈ పోటీలలో బ్యాడ్మింటను 14 సంవత్సరముల లోపు బాలికల ఒంటరి విభాగములో పులివెందుల ఎక్సలెంట్ నాగార్జున పాఠశాల విద్యార్థినివై. దివ్యశ్రీ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని పాఠశాల యాజమాన్యము సన్మాన కార్యక్రము నిర్వహించింది. కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా శ్రీమతి భూమిరెడ్డి ఉమాదేవి హాజరై దివ్యశ్రీని ఘనముగా సన్మానించారు.ఈ సందర్భముగా ఉమాదేవి మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, దివ్యశ్రీ లాంటి విద్యార్థులు రాష్ట్రమునకు, దేశమునకు పేరు తెస్తారని ప్రశంసించారు.ఈ కార్యక్రమములో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్లోబల్ టైగర్స్ డే సందర్భంగా జడ్పీ హైస్కూల్లో మొక్కలు నాటిన ఫారెస్ట్ ఆఫీసర్

ప్రజాభూమి,పులివెందుల



గ్లోబల్ టైగర్ డే సందర్భంగా గురువారం పులివెందుల పట్టణంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పులులపైన , మొక్కలు నాటి వాటి గురించి అవగాహన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గోపాలకృష్ణయ్య కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోల్డెన్ టైగర్ అనేది వేరే జాతి కాదు. ఇది బెంగాల్ టైగర్ యొక్క రంగు వైవిధ్యం మాత్రమే అన్నారు.దీనిని గోల్డెన్ టాబీ టైగర్ లేదా స్ట్రాబెర్రీ టైగర్ అని కూడా అంటారు అని తెలిపారు. సాధారణ పులుల లాగా నారింజ , నల్ల చారలకు బదులు, వీటికి లేత బంగారు స్ట్రాబెర్రీ-బ్లాండ్ రంగు కోటు , లేత ఎరుపు-గోధుమ చారలు ఉంటాయి అని తెలిపారు. వీటిలో మూడు ప్రత్యేకతలు ఉన్నాయనిపెద్దవిగా ఉంటాయిమగవి 270--310 సెం.మీ, ఆడవి 240-265 సెం.మీ వరకు ఉంటాయి అని తెలిపారు.సాధారణ పులుల కంటే వీటి బొచ్చు మెత్తగా, దట్టంగా ఉంటుంది అని తెలిపారు. మొక్కల గురించి స్కంద పురాణంలో ఒక రావి చెట్టు, ఒక వేప చెట్టు, ఒక మర్రిచెట్టు మూడు వెలగా మారేడు ఉసిరి ఐదు మామిడి చెట్లు 10 చింత చెట్లు నాటిన సంరక్షించినవారు స్వర్గలోకానికి పోదురని మన స్కంద పురాణం తెలియజేస్తున్నది ఆయన తెలిపారు.మన జాతీయ జంతువు అడవిలో పులి ఉండడం వల్ల ఎకలాజికల్ బ్యాలెన్స్ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేక్ క్యాచర్ మధుసూదన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టొమాటోతో ఆదాయం - రైతులకు, మహిళలకు నైపుణ్య శిక్షణ

### సౌర శక్తి కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్‌పై అవగాహన

ప్రజాభూమి,పులివెందుల




ఆహార సాంకేతిక కళాశాలలో టొమాటో ప్రాసెసింగ్, విలువ జోడింపుపై నైపుణ్య అభివృద్ధి అనే అంశంపై నాల్గవ శిక్షణా కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమం ఐ.సి.ఏ.ఆర్ షెడ్యూల్డ్ కుల ఉప ప్రణాళిక ప్రాజెక్ట్ లో భాగంగా నిర్వహించారు. వేముల, పులివెందుల మండలాల పరిసర ప్రాంతాలకు చెందిన షెడ్యూల్డ్ కులాలకు చెందిన మహిళలు, యువత, రైతులు ఈ శిక్షణకు హాజరయ్యారు.కార్యక్రమానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. మాధవ అధ్యక్షత వహించారు. వేముల మండల డి.ఆర్.డి.ఏ అధికారి ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎం. మాధవ మాట్లాడుతూ టొమాటో ధర తక్కువగా ఉన్నప్పుడు దానిని ప్రాసెస్ చేసి టొమాటో సాస్, కెచప్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి అమ్మడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు.కళాశాల ప్రాజెక్టు ఇంచార్జ్ ఇంజినీర్ నజ్మా మాట్లాడుతూ గ్రామీణ యువత, మహిళలు ఆహార ప్రాసెసింగ్ రంగంలో వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. టొమాటోను సన్నని ముక్కలుగా కోసి ట్రే-డ్రయర్ యంత్రంతో ఎండబెట్టి పొడి తయారు చేసే విధానాన్ని వివరించారు.ప్రాజెక్ట్ సభ్యురాలు డాక్టర్ కీర్తి రెడ్డిటొమాటో సాస్, కెచప్ తయారీని ప్రత్యక్షంగా చేసి చూపించారు. డాక్టర్ రాజేష్ టొమాటో గుజ్జు తయారీ విధానాన్ని వివరించారు.కళాశాలలోని సౌర శక్తితో నడిచే కోల్డ్ స్టోరేజ్ గదిలో టొమాటో, ఇతర పండ్లను నిల్వ చేసే విధానాన్ని అధ్యాపకుడు డాక్టర్ సాయి శ్రీనివాస్ వివరించారు. ఇలాంటి నిల్వ గదులు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని, పంటను ఎక్కువ రోజులు భద్రపరచుకోవచ్చని అన్నారు.ఈ సందర్భంగా కళాశాల నిపుణులు రూపొందించిన శిక్షణా మాన్యువల్ పుస్తకాలను హాజరైన అభ్యర్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ సభ్యుడు డాక్టర్ జాకీర్ భాషా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పులివెందుల మున్సిపాలిటీలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

### మున్సిపల్ కమిషనర్‌కు వైఎస్ మనోహర్ రెడ్డి వినతి

ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో కౌన్సిల్ ఆమోదం పొందిన పెండింగ్ పనులకు వెంటనే టెండర్లు పిలిచి, టెండర్లు పూర్తయిన పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించి పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ లు కలిసి గురువారం కమిషనర్ తనూజ ను కోరారు.ఈ సందర్భంగా వైఎస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, గత కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందిన అనేక పనులు ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ముఖ్యంగా రోటరీపురం రోడ్లు, యూజీడీ పనులకు ఇప్పటి వరకు టెండర్లు పిలవకపోవడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆమెను కోరారు.అదేవిధంగా చెన్నారెడ్డి కాలనీలో యూజీడీ పనులను తక్షణమే చేపట్టడంతో పాటు, సియోన్‌పురం స్టోర్మ్ వాటర్ డ్రెయిన్ టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో వీధి దీపాల కొరత కారణంగా రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అవసరమైన చోట్ల వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు.ప్రజా అవసరాలకు సంబంధించిన ఈ పనులను అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్ మనోహర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఆమె స్పందిస్తూ పనులు మొదలు పెట్టేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె వారికి తెలిపారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతున్నది: మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి

ప్రజాభూమి పోరుమామిళ్ల :



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అవినీతి రహిత పాలన అందిస్తామని ఎలక్షన్లకు ముందు ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది కానీ నేడు రాష్ట్రంలో అవినీతి లంచగొండితనం రాజ్యమేలుతున్నదని. రెవెన్యూ .పోలీస్. ఇంకా కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో. అధికారుల వద్దకు ప్రభుత్వ పనుల కోసం వెళ్లిన ప్రతి ఒక్కరూ డబ్బులు చెల్లించుకోవలసి వస్తున్నది. అధికార పార్టీ ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి గారే విమర్శించడం. చూస్తుంటే ఇప్పుడు రాష్ట్రంలో ఏ విధంగా అవినీతి రాజ్యమేలుతుందో ప్రజలకు అర్థమవుతుందని. చాలామంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు నాయకులు బహిరంగంగానే ప్రతి పనికి. మరియు ఇసుక. గ్రావెల్. కాంట్రాక్టర్ల దగ్గర. వ్యాపారస్తులు దగ్గర.బెల్ట్ షాపులు దగ్గర. డబ్బులు వసూలు చేస్తున్నారని. వారిని చూసి . పై అధికారుల నుండి కింద స్థాయి.అధికారుల వరకు. లంచం ఇస్తే కానీ పనులు చేయడం లేదని. ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గర పడ్డాయని. చంద్రబాబు ప్రభుత్వం లో గతంలో ఎన్నడూ లేని విధంగా. మట్కా .జూదం. అసాంఘిక కార్యక్రమాలు అక్రమాలు. దౌర్జన్యాలు. దోపిడీలు. ఎక్కువ అయ్యాయని. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అవినీతి అక్రమాలు దౌర్జన్యాలకు నెంబర్ వన్ గా నిలుస్తుందని నాగార్జున రెడ్డి గారు విమర్శించారు గత ప్రభుత్వంలో ప్రతి సంక్షేమ పథకం నేరుగా లబ్ధిదారుల అకౌంట్లో పడేదని ఇప్పుడు అపరిస్థితి లేదని.ఇలాగే కొనసాగితే రాష్ట్రం లో అన్ని రంగాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని. అన్నారు.

## బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయడంలో ఇంత నిర్లక్ష్యమా?

### ఏఐఎఫ్ఇటివో జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి

ప్రజాభూమి పోరుమామిళ్ల :



ఏడాది క్రితం బదిలీ కాబడిన టీచర్లను రిలీవ్ చేయడంలో విద్యాశాఖ నిర్లక్ష్యం వహించడం తగదని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్ ఏఐఎఫ్ఇటిఓ జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం రమణారెడ్డి కలసపాడులో మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల కోసం ప్రత్యేక చట్టం చేసి,కేవలం బదిలీలు మాత్రమే నిర్వహించి చేతులు దులుపు కోవడం సమంజసం కాదన్నారు. బదిలీల ప్రక్రియను పూర్తి చేయాల్సిన బాధ్యతను విస్మరించడం సరికాదన్నారు.దూర ప్రాంతాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ ప్రాంతాలకు దగ్గరలోని పాఠశాలలకు బదిలీ కాబడి, నూతన పాఠశాలలకు ఎప్పుడు పంపిస్తారా! అని వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారన్నారు. కానీ విద్యాశాఖ ఉన్నతాధికారులు మాత్రం ఇదిగో ఈ నెలలో పంపిస్తాం, అదిగో వచ్చే నెలలో పంపిస్తాం అని చెప్పడం తప్ప, రిలీవ్ చేసింది మాత్రం లేదన్నారు.అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించి రిలీవింగ్ చేస్తామని గత రెండు నెలలుగా చెబుతున్నప్పటికీ,ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విద్యాశాఖ నిర్లక్ష్య వైఖరికి నిలువెత్తు నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి, అర్హులైన అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించి, బదిలీలు పొంది పాత స్థానాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరినీ తక్షణమే రిలీవ్ చేసి,వారు కోరుకున్న నూతన పాఠశాలలకు పంపించాలని డిమాండ్ చేశారు.

## రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన -- పంటల బీమా పథకం ను సద్వినియోగం చేసుకోండి : బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ నారిశెట్టి సుప్రజ

ప్రజాభూమి పోరుమామిళ్ల :



ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన అనేది రైతులు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే ఆర్థిక రక్షణ కల్పించేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల బీమా పథకం. దీని ప్రధాన లక్ష్యం రైతుల ఆదాయాన్ని స్థిరంగా ఉంచడం మరియు వ్యవసాయాన్ని కొనసాగించేందుకు భరోసా కల్పించడం. ఖరీఫ్ సీజన్ పంటల భీమా నమోదు కు ఈ నెల 31 వ తేదియే చివరి గడువు .వరి పంటకు చివరి తేదీ ఆగష్టు 15 –వరదలు, కరువు, తుఫానులు, వడగళ్ల వాన, పిడుగు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే బీమా పరిహారం లభిస్తుంది.చీడపీడలు మరియు వ్యాధుల వల్ల పంట దిగుబడి తగ్గిన సందర్భాల్లో కూడా రక్షణ అందుతుంది. రైతుల ఆర్థిక నష్టాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని కొనసాగించేందుకు సహాయపడుతుంది ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించేందుకు రైతులకు భరోసా కల్పిస్తుంది. వ్యవసాయ రుణాలు పొందడంలో రైతులకు తోడ్పడుతుంది. ప్రతికూల వాతావరణం వల్ల విత్తనం వేయలేని పరిస్థితుల్లో కూడా నిబంధనల ప్రకారం పరిహారం అందే అవకాశం ఉంది. రైతులు త్వరపడి అగ్రికల్చర్ అసిస్టెంట్ ను /కామన్ సర్వీస్ సెంటర్ లో నమోదు చేసుకొని , మీ పంటలకు భీమా పొందండి .

## ఆధ్యాత్మిక విద్యా శిక్షణ ముగింపు

### - విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యం

### - పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక శ్రీ చైతన్య హైస్కూల్‌లో గురు పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన రెండు రోజుల ఆధ్యాత్మిక విద్యా శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. విద్యార్థుల్లో నైతిక విలువలు, ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా రిటైర్డ్ సీనియర్ మేనేజర్, పిరమిడ్ జ్ఞాన దీప్తి స్పిరిచువల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కె. శ్రీనివాసరావు ధ్యానం, ఆధ్యాత్మికత, నైతిక విలువలు, సమయపాలన, వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ప్రతిరోజూ ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరిగి జీవితంలో ఉన్నత విజయాలు సాధించవచ్చని వివరించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ, విలువలతో కూడిన విద్యనే నిజమైన విద్య అని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర వికాసం కోసం ఇలాంటి విలువల ఆధారిత కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని, అలాగే కె. శ్రీనివాసరావు, ఇంద్రమ్మ, ఇంద్రాణిలను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్స్ లక్కు ప్రేమానందరెడ్డి, మనోహర్ రెడ్డి, కిషోర్, నాయుడు, దస్తగిరి భాష, రామయ్య, వేణుతో పాటు పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శుక్రవారం 31 జూలై 2026


## పోలీసులు సమాజానికి రక్షణ కవచాలు -- వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలి: ధర్మచందు



ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు వ్యవస్థే ప్రధాన ఆధారమని, పోలీసులు సమాజానికి నిజమైన రక్షణ కవచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక పోలీసు అధికారుల ప్రధాన కార్యదర్శి ధర్మచందు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు శాఖలో సేవా ప్రస్థానం కానిస్టేబుల్ స్థాయి నుంచే ప్రారంభమవుతుందని, ఒక కానిస్టేబుల్ పోలీసు వ్యవస్థకు వెన్నెముక వంటివాడని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించడం వంటి కీలక బాధ్యతలను కానిస్టేబుళ్లు సమర్థవంతంగా నిర్వహిస్తారని తెలిపారు. పోలీసు వృత్తి విశ్రాంతి లేని సేవా బాధ్యత అని పేర్కొన్న ఆయన, రాత్రి, పగలు అనే తేడా లేకుండా కుటుంబాలకు దూరంగా ఉంటూ, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం శ్రమిస్తారని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రతి క్షణం అప్రమత్తంగా పనిచేసే పోలీసుల సేవలను సమాజం గౌరవించాలని కోరారు. సమాజంలో కొందరు పోలీసుల పట్ల సరైన గౌరవం చూపకపోవడం బాధాకరమని పేర్కొన్న ఆయన, రాత్రివేళల్లో పోలీసులు గస్తీ నిర్వహించకపోతే, అత్యవసర సమయంలో కానిస్టేబుల్ స్పందించకపోతే పరిస్థితులు ఎలా ఉంటాయో ఒక్కసారి ఆలోచించాలని అన్నారు. పోలీసు వ్యవస్థ ఒక్క గంటపాటు పనిచేయకపోయినా దొంగతనాలు, దోపిడీలు, హత్యలు, ఇతర నేరాలు పెరిగి ప్రజల భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. కుటుంబంలో వ్యక్తిగత సమస్యలు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి సమాజ రక్షణ కోసం అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలు ప్రశంసనీయమని ధర్మచందు అన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీసు సిబ్బందికి ప్రభుత్వం అందించాల్సిన సేవా భత్యాలు, ప్రయాణ భత్యాలు సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు.పోలీసు బాగుంటేనే సమాజం బాగుంటుంది. పోలీసుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలి. వారి త్యాగం, సేవాభావం సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తాయి అని ధర్మచందు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సేవలకు గుర్తింపు -జిల్లా కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ కరీముల్లా నియామకం



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్

కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ఎస్. కరీముల్లాకు పార్టీ సేవలకు గుర్తింపుగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) వైస్ ప్రెసిడెంట్ పదవిని అప్పగించారు. గతంలో మైనారిటీ విభాగంలో జిల్లా జనరల్ సెక్రటరీగా సమర్థవంతంగా పనిచేసిన షేక్.కరీముల్లా సేవలను గుర్తించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బాలగురవం బాబు ఈ బాధ్యతను అప్పగించడం అభినందనీయమని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా షేక్. కరీముల్లా మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి జిల్లా కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ పదవిని ఇచ్చిన జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవిని మరింత బాధ్యతగా భావిస్తూ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ ఎదుగుదలే తన లక్ష్యమని, జిల్లా అధ్యక్షుల నాయకత్వంలో పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన తెలిపారు.

## జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడిని పరామర్శించిన కొట్టే సాయి ప్రసాద్



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్

జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షులు భవాని ప్రసాద్ తల్లి రామానాయుడు లక్ష్మి ఇటీవల పరమపదించడం అత్యంత విషాదకరం. ఈరోజు నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమానికి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ మరియు జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టెసాయి ప్రసాద్ హాజరై, భవాని ప్రసాద్ ని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా దివంగత రామానాయుడు లక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## చెన్నూరు జగనన్న కాలనీ సమస్యలు పరిష్కరించండి




ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

సామాజిక శంఖారావంలో భాగంగా గూడూరు మండలం, చెన్నూరు గ్రామం లో జగనన్న కాలనీ మరియు శెట్టి బీడులో యాత్ర జరిగినది, అందులో భాగంగా ఈ గ్రామంలోని ముఖ్య సమస్యలు అనగా వర్షాకాలం వస్తే మేము రోడ్లు మీద నడుచుటకు చాలా ఇబ్బంది కలిగి ఉంది, అదేవిధంగా మాకు వీధిలైట్లు లేవు, మురికి కాలవలు కూడా లేవు,ఈ సమస్యలు ఉన్నవి అని తెలిపారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు, కౌల రైతు సంఘం జిల్లా సభ్యులు జోగి శివకుమార్, కెవిపిఎస్ నాయకులు, గుర్రం రమణయ్య, గంట వెంకటేశ్వర్లు జగనన్న కాలనీ నివాసులు, , శ్రీనివాసులు కాలకంది ,భాగ్యలక్ష్మి కారణం, మమత మద్దులేని, పెంచలమ్మ శెట్టిగారి వీడు కాపురస్తులు వాఖ, ఫరీర గుమ్మడి,కిష్టమ్మ గూడూరు,మస్తానమ్మకలిపాక,గురవమ్మ , మస్తాన్ తదితరులు పాల్గొన్నారు,

## ఏర్పేడు మండలం సమాఖ్యకు పి డి డి ఆర్ డి ఏ.ఎన్ శోభన్ బాబు ఆకస్మిక తనిఖీ



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

ఏర్పేడు మండలంలో వెలుగు సంఘాల గురించి పూర్తి వివరాలు బ్యాంకు లింకేజీ, ఎల్ హెచ్ , స్త్రీనిధి, ఉన్నతి ఇంట్రెప్రెనేర్ లోన్స్ గురించి ఆయన సుదీర్ఘంగా అడిగి తెలుసుకోవడం జరిగినది.. మండలం పూర్ ప్రోగ్రెస్ ఉన్నదని ప్రోగ్రెస్ ఇంప్రూవ్ చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించడం జరిగినది.. మరియు పిడిడి ఆర్ డి ఏ వారు శ్రీకాళహస్తి ఆర్ డి ఓ ని కలిసి ఏర్పేడు మండలం లో ఏర్పాటు చేయుచున్న కస్టమ్ హైరింగ్ సెంటర్, ఐ ఎఫ్ సి క్లస్టర్ మరియు క్లస్టర్ యాక్టివిటీస్ కి సంబంధించిన భూమి కల్పించుట గురించి మాట్లాడటం జరిగినది.. మరియు డీపీఎం బి ఎల్ వనజాక్షి , ఉన్నతి ఏపీఎం మండలానికి వచ్చి బ్యాంకు లింకేజీ మరియు ఉన్నతి లోన్స్ గురించి సమీక్ష చేయడం జరిగినది.

# పేదల ప్రజలకు అండగా తెలుగుదేశం పార్టీ

### - ఇంటింటి కార్యక్రమంలో టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి(నాయుడుపేట)

కూటమి ప్రభుత్వ పాలనలో సూపర్ సిక్స్ ఎన్నికల హామీలను విజయవంతంగా అమలు చేసిన తెలుగుదేశం పార్టీ పేద ప్రజలకు అండగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ నాయకులు యూనిట్ ఇన్చార్జ్ కట్టా వెంకటరమణారెడ్డి తెలియజేశారు. గురువారం నాయుడుపేట మండలంలోని చిగురుపాడు,తిమ్మాజీ కండ్రిగ గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా ఇంటింట ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి స్థానిక నాయకులతో కలిసి చిగురుపాడు గ్రామంలో పర్యటించారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో తెలుగుదేశం పార్టీ ప్రవేశపె



ట్టిన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం తోపాటు అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని కొనియాడారు.

సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ల సహకారంతో,ఎమ్మెల్యే మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ప్రోత్సాహంతో వందల కోట్ల రూపాయలతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలియజేశారు.అలాగే అర్హత గల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పాలన సాగిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారని తెలిపారు. ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించి జరగనున్న స్థానిక ఎన్నికల్లో ఘన విజయం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ పాలెల అంకయ్య,టీడీపీ నాయకులు,టీడీపీ నాయకులు పాలెలి సుబ్రహ్మణ్యం, ఇంటి మణి, గురునాథం, వినోద్ కుమార్, వీరయ్య, నరేంద్ర కుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి -- ప్రతి కుటుంబానికి ప్రభుత్వం లక్ష్యంతో వార్డు--30లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్--8, వార్డు--30లో గురువారం "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు డాక్టర్ పనబాక లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరుకాగా, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేబీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ



సందర్భంగా వార్డు ప్రజలు డాక్టర్ పనబాక లక్ష్మి, జేబీ శ్రీనివాస్‌కు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్ని కలిసి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పనబాక లక్ష్మి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం "ప్రతి ఇంటికి -- ప్రతి కుటుంబానికి ప్రభుత్వం" అనే లక్ష్యంతో పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన పాలన అందిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు ప్రజల గడప వద్దకే వెళ్లి అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు.ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకోవడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచడం, సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ దంపూర్ భాస్కర్, క్లస్టర్ నాయకులు, వార్డు నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి దుకాణానికి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి-కమిషనర్ శారదా దేవి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

నగరంలోని అన్ని రకాల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకుని వ్యాపారాలు నిర్వహించుకోవాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్, ప్రత్యేక అధికారి, కమీషనర్ గారి ఆదేశాల మేరకు



బుధవారం రాత్రి పిర్యాదు అందిన జగజీవన్ రాం పార్క్ వద్ద గల బిర్యానీ ఫ్యాక్టరీని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ జగజీవన్ రాం పార్క్ వద్ద గల బిర్యానీ ఫ్యాక్టరీ నందు బిర్యానీ తిని చిన్న అమ్మాయికి ఫుడ్ పాయిజన్ కావడంతో అమ్మాయి ట్రీట్మెంట్ తీసుకుంటున్నదని తెలిపారు. ఈ పిర్యాదు మేరకు తాను, , వెటర్నటి ఆఫీసర్, ఫుడ్ సేఫ్టిఆఫీసర్, సిబ్బంది, శానిటరీ సిబ్బంది తో కలిసి తనిఖీకి చేశామని తెలిపారు. అందులో హోటల్ నడుపుటకు మునిసిపల్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా వ్యాపారం చేయడం, బిర్యానీ తయారు చేయుటకు వినియోగించు చికెన్ సరిఅయిన స్టోరేజ్ లో లేకపోవడం, వాటిపై లేబల్స్, తయారీ గడువు లేబుల్స్ లేకపోవడం గుర్తించామని తెలిపారు. ఫ్రీజర్ సరైన కండిషన్ లో లేకపోవడం, స్టోర్ రూంలో వంటకు వినియోగించు కూరగాయలు పాడాయి ఉండడం, స్టోర్ నందు పనికిరాని వ్యర్థాలు నిలువ చేసి ఎలుకల విసర్జనలు ఉండడం, క్లీనింగ్ ఏరియా వంటరూమ్ కలిసి ఇన్ శానిటరీ కండిషన్ లో ఉండడం, మరియు పనిచేసె వర్కర్సకి పర్సనల్ ప్రొటెక్షన్ కిట్స్ లేకపోవడం వలన సప్లైలో కాంటామినేషన్ రావడానికి ఆస్కారమున్నందున ప్రజరోగ్య దృష్ట్యా బిర్యానీ ఫ్యాక్టరీ హోటలను సీజ్ చేశామని తెలిపారు ఫూడ్ సెఫ్టి ఆఫీసర్ అందుబాటులో ఉన్న బిరియానిని, పెరుగును శాంపుల్స్ తీసి కల్తీ పరీక్ష నిమిత్తం పంపామని తెలిపారు. ప్రతి ట్రేడ్ ఓనర్స్ మునిసిపల్ ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకొని సరైన నాణ్యత ప్రమాణాలతో వ్యాపారం చేయాలనీ హెచ్చరించారు. ప్రజలకుడా తక్కువరేట్లు చూసి మోసపోవద్దని నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలనీ తెలిపారు.

## నాయుడుపేటలో 'ఇంటింటికి టీడీపీ' సైకిల్‌ర్యాలీ

### గోమతి సెంటర్ నుంచి బీడీ కాలనీ వరకు టీడీపీ ప్రచార ర్యాలీ



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

నాయుడుపేట 19, 20 వార్డుల్లో 'ఇంటింటికి టీడీపీ' కార్యక్రమం ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన టీడీపీ నేతలునాయుడుపేటలో భారీగా తరలిన టీడీపీ శ్రేణులు నాయుడుపేటలో 'ఇంటింటికి టీడీపీ' సైకిల్ ర్యాలీ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఇంటింటికి టీడీపీ' కార్యక్రమంలో భాగంగా నాయుడుపేట పట్టణం 19, 20 వార్డుల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గోమతి సెంటర్ నుంచి బీడీ కాలనీ వరకు సాగిన ఈ ర్యాలీకి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యాయి. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు, టీటీడీ బోర్డు సభ్యురాలు డాక్టర్ పనబాక లక్ష్మి, సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయడమే 'ఇంటింటికి టీడీపీ' కార్యక్రమ లక్ష్యమని వారు తెలిపారు. ర్యాలీ మార్గమంతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జెండాలు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. స్థానిక ప్రజలు కూడా ర్యాలీకి విశేష స్పందన వ్యక్తం చేస్తూ నాయకులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చంద్రగిరిలో విషాదం: భార్యకు వీడియో కాల్ చేస్తూ ఉరివేసుకుని ఉద్యోగి ఆత్మహత్య



ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి

చంద్రగిరి పట్టణంలోని ఎంజీ బ్రదర్స్ ప్లాట్స్‌లో గురువారం విషాద ఘటన చోటుచేసుకుంది. తిరుపతికి చెందిన జగదీశ్ (47) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన రంగంపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు, బుధవారం భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు చోటుచేసుకున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన జగదీశ్ చంద్రగిరిలోని తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లాడు. అక్కడ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఉరివేసుకునేందుకు సిద్ధమై, అదే సమయంలో భార్యకు వీడియో కాల్ చేశాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వీడియో కాల్‌లో తెలియజేయడంతో ఆమె తీవ్ర ఆందోళనకు గురైంది. వెంటనే ఆమె స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించింది. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న చంద్రగిరి పోలీసులు ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లగా, జగదీశ్ అప్పటికే ఉరివేసుకుని మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనకు గల పూర్తి కారణాలపై దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణమా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు.

## మల్లిమడుగులో విద్యా సామగ్రి పంపిణీ



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో డా. కె.ఎస్. గుణశేఖర్ జిల్లా నీటి నాణ్యత అధికారి, వారి సతీమణి బి. కవిత వారి ఆర్థిక సహకారంతో మల్లి మడుగు గ్రామంలో ఉన్న 30 మంది పిల్లలకు పలక, బలపం నోట్ పుస్తకాలు, పరీక్ష ఫ్యాడ్లు, పెన్ను,పెన్సిల్, ఎరేజర్, షార్పానర్లు ఇవ్వడం జరిగింది. పుస్తకాల పంపిణీలో భాగంగా దాత డా.కె. ఎస్.గుణశేఖర్



మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకోవాలి చదువుకోవడం వల్ల ఉన్నత స్థాయికి వెళ్లి వాళ్లకి ఉన్న రిజర్వేషన్స్ పొంది ఉన్నతంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రగతి రేణిగుంట మండల కోఆర్డినేటర్ మాట్లాడుతూ విద్య అనేది మనిషి ఎదుగుదలకు చాలా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతున్న వాళ్ళందరికీ మనిషికి 13000 చొప్పున వేస్తున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కింద యూనిఫామ్, బుక్స్, షూ సాక్స్,బెల్టు ఇస్తున్నారు. అదేవిధంగా పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం పథకం కింద రోజువారిగా మెనూ ప్రకారంగా భోజనం ఇస్తున్నారు. అందులో చిక్కి, రాగిజావా, గుడ్లు పెడుతున్నారు. ప్రభుత్వం ఇన్ని సౌకర్యాలు కల్పించింది. మన వంతుగా పాఠశాలకు రెగ్యులర్‌గా వెళ్లాలి. బాగా చదువుకోవడం వల్లే మనం అభివృద్ధి చెందుతాము. మన గ్రామం అభివృద్ధి చెందుతుంది. అందరూ చదువుకుంటే ఆ గ్రామంలో అందరు విద్యావంతులుగా ఉంటారు. అని తెలియజేశారు. ప్రగతి ఎంఐఎస్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ చదువుకోవడం ప్రతి ఒక్కరు హక్కు, చదువుకోవడం వలన మన గ్రామంలో డ్రాప్ అవుట్ లేని గ్రామంగా ఉంటుంది. సమాజం మార్పు చెందే కొద్దీ మనం కూడా మారాలి. పరిస్థితులకు అనుకూలంగా నడుచుకోవాలి. మన పిల్లల్ని బాగా చదివించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు పిల్లలు పాల్గొన్నారు.

## జాబ్ మేళా విజయవంతం




ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

జాబ్ వేళా అంటే విద్యార్థుల జీవితాలను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లే సువర్ణ అవకాశమని, జాబ్ మేళాను నిరుద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఆర్. బి. వాణిశ్రీ అన్నారు. గురువారం ఎస్.వి.ఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఎస్వీఏ ప్రభుత్వ కళాశాల, శ్రీకాళహస్తి లో జాబ్ మేళా జరిగింది. ఈ జాబ్ మేళా ప్రారంభ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. బి. వాణిశ్రీ మాట్లాడుతూ డిగ్రీ సర్టిఫికెట్లతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ స్కిల్స్, మంచి వస్త్రధారణ, ఆత్మవిశ్వాసం తదితర నైపుణ్యాలు పెంచుకుంటే మంచి ఉద్యోగాలను పొందవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి. సహకారంతో జాబ్ మేళా విజయవంతమైందని,వారికి కళాశాల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. జాబ్ మేళాలో 13 కంపెనీ ప్రతినిధులు హాజరై కంపెనీలో పనిచేయడానికి అవసరమైన ఉద్యోగం నైపుణ్యాల గురించి వివరించారు.మొత్తం 383 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా వీరిలో130 మంది వివిధ కంపెనీ ఉద్యోగాలను సాధించారు..ఈ జాబ్ మేళాకు మంచి ప్రతిస్పందన లభించిందని తిరుపతి జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ లోకనాథం తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థిని విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ మరియు లోకనాథం. ఆఫర్ లెటర్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లు డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ గంగారామ్ , డాక్టర్ బాపనయ్య, డాక్టర్ వి. వాసవి, డాక్టర్ పి. గాయత్రి, టీ. నరసింహులు,జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ జి. హన్నా, జే కే సి ఫుల్ టైం మెంటార్ శ్రీమతి పి. గిరిజ, డాక్టర్ కె. శ్రీదేవి, డాక్టర్ రమేష్, డాక్టర్ ఉష మరియు కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాల నుంచి విచ్చేసిన అధ్యాపకులు మరియు నిరుద్యోగ యువతీ యువకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# సంఘాల పనితీరును పారదర్శకంగా ఉంచడానికె "లోకోస్" యాప్

### లోకోస్ యాప్ శిక్షణ కార్యక్రమంలో వెలుగు ఇన్చార్జి ఏపిఎం శివకుమార్.

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

గ్రామీణ స్వయం సహాయక సంఘాల పనితీరును పారదర్శకంగా ఉంచడానికె లోకోస్ యాప్ను తీసుకొచ్చినట్టు తిరుపతి జిల్లా సత్యవేడు గ్రామీణ అభివృద్ధి సంస్థ( వెలుగు) ఇన్చార్జి ఏపిఎం శివకుమార్ చెప్పారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో లోకోస్ యాప్పై సంఘమిత్రలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇన్చార్జి ఏపిఎం శివకుమార్ మాట్లాడుతూ భారతదేశంలోని గ్రామీణ స్వయం సహాయక సంఘాలు,గ్రామ సంఘాలు, సమైక్య ఆర్థిక లావాదేవీలతో పాటు ప్రొఫైల్లను నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నేషనల్ రూరల్ లైవ్లీహుడ్స్ మిషన్ కింద లోకోస్ యాప్ను రూపొందించినట్టు ఆయన గుర్తు చేశారు. ఈ యాప్



ద్వారా సంఘాల పనితీరును పారదర్శకంగా నిర్వహించడంతోపాటు రికార్డు లడిజిటలీకరించడానికి వీలు పడుతుందన్నారు.తద్వారా పొదుపు సంఘాల లెక్కలు,సమావేశాల వివరాలు,రుణాల సమాచారాన్ని ఒకే చోట భద్రపరిచే అవకాశం ఉందన్నారు. పైగా ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలను కూడా అరికట్టవచ్చునన్నారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ ఎన్ఆర్ఎల్ఎం పథకం కింద మంజూరయ్యే నిధులు,రుణాల సమాచారాన్ని సులభంగా ట్రాక్ చేయవచ్చును అన్నారు. అందువల్ల 2026 జూన్ నెల వరకు స్వయం సహాయక సంఘాల పొదుపు,రికవరీ, చెల్లింపు,సంఘాల సభ్యుల వివరాలు తదితర వివరాలను లోకోస్ యాప్లో నమోదు చేయాల్సి ఉందన్నారు.తదుపరి జూలై నెల నుంచి యధావిధిగా వివరాలను లోకోస్ యాప్లో నమోదు చేయాలన్నారు.ముఖ్యంగా స్వయం సహాయక సంఘాలు నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలన్నీ జాతీయస్థాయిలో ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం లోకోస్ యాప్ను ప్రవేశపెట్టిందన్నారు. దీనిపై సంఘమిత్రలు కూడా అవగాహన పెంచుకొని సమర్థవంతంగా యాప్ను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.గతంలో రాష్ట్రస్థాయిలో బుక్కు కీపింగ్ ద్వారా సంఘాల ఆర్థిక లావాదేవీలు జరుగుతుండగా వాటిని మరింత పారదర్శకంగా నిర్వహించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం లోకోస్ యాప్ ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో వెలుగు సీసీలు పుల్లయ్య, శ్రీనివాసులు, మంగయ్య,అకౌంటెంట్ కాంచన, పలువురు సంఘమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ 2 ఏళ్ళ పాలన పై ఇంటింటి ప్రచారం

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు



తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబు నాయడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం తలపెట్టిన ఇంటింటి ప్రచారం కార్యక్రమం గూడూరు ఎమ్మెల్యే మరియు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ పాశిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు మాజీ కౌన్సిలర్ మరియు 15వ యూనిట్ ఇంచార్జ్ తాతపూడి ఇశ్రాయేల్ కుమార్ సూచనల ప్రకారం నేడు గూడూరు పట్టణం లోని 27, 28 వ వార్డుల లోని 10, 11 బూత్ ల ఏరియాలలోని ఎగువ, దిగువ వీరారెడ్డి పల్లి ప్రాంతాల నందు ఇంటింటికికరపత్రాలు పంచుతూ కూటమి ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాలలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గూర్చి ప్రచారం చేస్తూ ప్రజలకు వివరించడం నజరిగింది. ఈ ప్రచార కార్యక్రమం లో 15 వ యూనిట్ కో కన్వీనర్ యదనపర్తి మధు రెడ్డి, 11వ బూత్ కన్వీనర్ నూనె వాసు, టీడీపీ 27 వ వార్డు అధ్యక్షుడు అన్నంగి సుధాకర్, గూడూరు పట్టణ ఎస్సి సెల్ వైస్ ప్రెసిడెంట్ వేల్పుల రమేష్ కుమార్, 10 వ బూత్ కన్వీనర్ మగ్గం రాజేష్, స్థానిక టీడీపీ నాయకులు ఈరిబోయిన జయచంద్రయ్య, ఈరిబోయిన నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి రూరల్.



శ్రీకాళహస్తి రూరల్ మండలం బివి పురం గిరిజన కాలనీలో క్రై సంస్థ బెంగళూరు వారి సహకారం తో ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవం గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ బాలలపై జరుగుచున్న అక్రమ రవాణా గురించి అవగాహన కలిగి ఉండాలని సమస్యలు వస్తే అందరూ కలిసికట్టుగా పనిచేస్తే బాలలపై జరుగుచున్న లైంగిక దాడులు అత్యాచారాలు అరికట్ట వచ్చునని బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు దాడులు అశ్లీలత గురించి క్లుప్తంగా వివరించారు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు దాడులు ఖండించారు ప్రగతి సంస్థ మహిళా కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ , బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ విద్యలో అభివృద్ధి సాధించాలని గ్రామాల్లో సమస్యలు ఏర్పడితే బాలలు మహిళలు 1098 కానీ 112 నెంబర్లకు ఫోన్ చేసి సమస్యలు తెలిపి సమస్య నుండి బయట పడాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు ప్రగతి సంస్థ సిబ్బంది రామచంద్ర మురగయ్యా వెంకటేశు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణి

ప్రజా భూమి ప్రతి నిధి శ్రీకాళహస్తి.



శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎర్రగుడిపాడు ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్, శ్రీకాళహస్తి వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామాగ్రి తో పాటు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ప్రమీల



మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేయుటకు రోటరీ క్లబ్ తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని తెలిపారు కార్యదర్శి మ్యాగీ క్లారా మాట్లాడుతూ పేద విద్యార్థులను విద్యలో అభివృద్ధి సాధించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని విద్యకు పేదరికం అడ్డు కాదని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలు చేరుకోవాలని కోరారు అడ్వకేట్ ఉమా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిగత శుభ్రతను పాటించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్సిల్స్ పెన్స్ భోజనం ప్లేట్స్ పంపిణీ చేశారు కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు ప్రమీల తరుణ్ ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు స్వీట్స్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

## చలో విజయవాడ 'మహా ధర్నా'ను విజయవంతం చేయండి.. 'ఐలు' నాయకులు కేసి.అంకయ్య పిలుపు

ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



రాష్ట్రంలోని జూనియర్ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు ఒకటో తేదీన ఉదయం 10 గంటలకు విజయవాడలోని 'ధర్నా చౌక్'వద్ద నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా 'ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్'(ఐలు) నాయకులు, శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కాకి చిన్న అంకయ్య పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అర్హులైన జూనియర్ న్యాయవాదుల అందరికీ ప్రతినెల పదివేల రూపాయలు స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలో న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే తీసుకురావాలని కోరారు. న్యాయవాదులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం న్యాయవాదుల సమస్యలను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో నిర్వహించే మహా ధర్నా కార్యక్రమానికి సీనియర్, జూనియర్ న్యాయవాదులందరూ హాజరై విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.

## స్వర్గీయ రాజారామరెడ్డి మృతికి ఘన నివాళి.. పెద్దకర్మకు విశేష స్పందన

ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు



తిరుపతి జిల్లా వాకాడు మండలం జమీన్ కొత్తపాలెం గ్రామంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి తండ్రి, స్వర్గీయ పాపారెడ్డి రాజారామరెడ్డి పెద్దకర్మ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు, రాజకీయ ప్రముఖులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వర్గీయ రాజారామరెడ్డి కి ఘన నివాళులు అర్పించారు.కార్యక్రమంలో స్వర్గీయ రాజారామరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులు,బంధువులు, నాయకులు నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు, గ్రామ పెద్దలు,బంధుమిత్రులు,అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.రాజారామరెడ్డి గ్రామంలో మంచి పేరు,గౌరవం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందిన నేపథ్యంలో ఆయనను స్మరించుకుంటూ పలువురు కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన బంధుమిత్రులు, నాయకులు, శ్రేయోభిలాషులు, గ్రామస్తుల కోసం ఆత్మీయ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా స్వర్గీయ రాజారామరెడ్డి కుమారుడు పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి మరియు కుటుంబ సభ్యులు పెద్దకర్మ కార్యక్రమానికి హాజరై నివాళులు అర్పించిన ప్రతి ఒక్కరికీ, అలాగే మీడియా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రేణిగుంట పట్టణంలో "సర్వేశ్ వైన్స్ బి ఆద్య వైన్స్" షాపులను తక్షణమే తొలగించాలి!

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా ) జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ పత్రిక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నాడు తిరుపతి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మరియు డిఆర్ఓ అధికారులకు రేణిగుంట ఐద్వా ఆధ్వర్యంలో "వినతిపత్రం" అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ మాట్లాడుతూ..రేణిగుంట పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని "సర్వేశ్ వైన్"షాప్, వైఎస్ఆర్ విగ్రహం సర్కిల్ సమీపంలోని "ఆద్య వైన్స్" దుకాణాలు నివాస ప్రాంతాలు, పాఠశాలలు, దేవాలయాలు, రైల్వే స్టేషన్, బస్టాండ్కు సమీపంలో ఉండటంతో మహిళలు, విద్యార్థులు, చిన్నారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో 15 సంవత్సరాల క్రితం రేణిగుంట పట్టణంలో మద్యం దుకాణాలు తొలగించాలని మూడు ప్రాంతాల్లో స్థానిక ప్రజలు నిరసనలు వ్యక్తం చేయడంతో ప్రజల అభ్యంతరాల మేరకు ఇదే ప్రాంతంలోని మద్యం దుకాణాలను తొలగించారని గుర్తు చేశారు. అయితే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రస్తుతం మళ్లీ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. మహిళల భద్రత, ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని రెండు మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని జిల్లా ఎక్సైజ్ శాఖ, డిఆర్ఓ, రేణిగుంట పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, రేణిగుంట మండల అధ్యక్షురాలు బి.భారతి, వేణుగోపాలపురం కమిటీ కార్యదర్శి అమ్ములు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు ఓ. వెంకటరమణ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి : ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె. నారాయణ డిమాండ్ -కార్మిక శాఖ అధికారికి వినతి

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,



గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె. నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ నాయకులు, ఏరియా ఆస్పత్రి పారిశుధ్య కార్మికులతో కలిసి కార్మిక శాఖా అధికారి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ సిబ్బందికి గత ఏడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. నిత్యం ప్రజారోగ్య పరిరక్షణ కోసం సేవలందిస్తున్న కార్మికులను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కొత్త కాంట్రాక్టర్ ప్రతి నెల క్రమం తప్పకుండా కార్మికులకు జీతాలు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేయడంతో పాటు, ఎంఓయూ ప్రకారం పూర్తి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు అందకపోవడంతో పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వారి జీవనం అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న అన్ని పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెలా సకాలంలో వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సహాయ కార్మిక అధికారి కార్యాలయ సిబ్బందికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశికుమార్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి జమాలుల్లా, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు సివిఆర్. కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు (సీవీఎల్), మెడికల్ శానిటేషన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాపై అవగాహనే రక్షణకు తొలి అడుగు -- విద్యార్థుల్లో చైతన్యం నింపిన దండి నరేంద్ర

ప్రజాభూమి ప్రతినిధి తొట్టంబేడు



గిరిజన నాయకులు, జనసేన నాయకులు చందమామల కోటయ్య ప్రత్యేక ఆహ్వానం మేరకు తొట్టంబేడు తెలుగు గంగ కాలనీ లోని గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. ఈ సందర్భంగా విద్యార్థులకు మానవ అక్రమ రవాణా అంటే ఏమిటి, దాని వల్ల కలిగే ప్రమాదాలు, అప్రమత్తంగా ఉండాల్సిన జాగ్రత్తలు, సురక్షితంగా ఎలా ఉండాలి అనే అంశాలపై సమగ్ర అవగాహన కల్పించాను. అలాగే అత్యవసర పరిస్థితుల్లో 112 మరియు 1098 (చైల్డ్ హెల్ప్లైన్) టోల్-ఫ్రీ నంబర్లను నిర్భయంగా వినియోగించాలని సూచించాను. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన -- గిరిజన విద్యార్థుల భద్రత అనే సందేశంతో రూపొందించిన అవగాహన పోస్టర్ను ఆవిష్కరించారు.లిఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎంపీడీఓ లలిత , తహసీల్దార్ సుబ్రహ్మణ్యం , సీడీపీఓ శాంతి దుర్గ , తొట్టంబేడు ఎస్ఐ బాలకృష్ణ పాఠశాల ప్రిన్సిపాల్ లలిత , అలాగే జనసేన నాయకులు లక్ష్మణ్, నవీన్, దివాకర్, జయశంకర్ పాల్గొన్నారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని సందేహాలు అడుగుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయం. ఇంత విలువైన సామాజిక చైతన్య కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన డీవీఎంసీ సభ్యులు చందమామల కోటయ్య మరియు ప్రగతి సంస్థ ప్రతినిధులు సుధాకర్, మోహన్బాబు, లతలకు హృదయపూర్వక అభినందనలు మరియు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

## ప్రతి ఇంటికి - ప్రతి కుటుంబానికి ప్రభుత్వం లక్ష్యంతో మూడో వార్డు లో ఇంటింటికి కార్యక్రమం

### పేద ప్రజలకు అండగా తెలుగుదేశం పార్టీ: టిడిపి నేత కప్పల మునస్వామి

ప్రజాభూమి ప్రతినిధి
నాయుడుపేట.



సులూరుపేట నియోజకవర్గ పరిధి లో నాయుడుపేట మున్సిపాలిటీలో వార్డు--3 ఎన్ ఎస్ ఆర్ కాలనీలో గురువారం "ఇంటింటికి తెలుగు దేశం" కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని టిడిపి నేత కప్పల మునుస్వామి తెలియజేశారు. నాయుడుపేట పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా ఇంటింట ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నేత కప్పల మునిస్వామి స్థానిక నాయకులతో కలిసి ఎన్ఎస్ఆర్ కాలనీలో పర్యటించారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ప్రోత్సాహంతో కూటమిపార్టీ నాయకుల సహకారంతో కోట్ల రూపాయలతో నియోజవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలియజేశారు. అలాగే అర్హత గల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. వైద్యవృత్తిలో ఉంటూ రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పాలన సాగిస్తూ ప్రజల మననలు అందుకుంటున్నారని తెలిపారు. ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించి జరగనున్న స్థానిక ఎన్నికల్లో విజయం చేకూర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధితుల కుటుంబాన్ని పరామర్శించకుండా నిర్బంధం

### సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని కలవనీయకుండా పోలీసుల అత్యుత్సాహం

### వైకాపా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి మండిపాటు



ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి

అఘాయిత్యాలకు బలై ఆత్మహత్య చేసుకున్న సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్లిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు



భూమన కరుణాకర్ రెడ్డిని పోలీసులు అత్యంత అప్రజాస్వామికంగా నిర్బంధించారు. అధికార పార్టీ నేతల ఆదేశాలతో పోలీసులు వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, ఇటీవల అన్యాయానికి గురై ప్రాణాలు కోల్పోయిన సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని ఓదార్చేందుకు గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లా వైయస్ఆర్సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి రామచంద్రపురం మండలం రాయలచెరువు పేట గ్రామం మృతుడి నివాసానికి బయలుదేరారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ముందుగానే రంగప్రవేశం చేసి ఆయనను అడ్డుకునేందుకు యత్నించారు. అయినప్పటికీ పోలీసుల వలయాలను ఛేదించుకుంటూ మృతుడి నివాసానికి చేరుకున్న భూమన కరుణాకర్ రెడ్డిని, అక్కడికక్కడే పోలీసులు అక్రమంగా నిర్బంధించారు. స్థానిక ఎమ్మెల్యే పునవర్తి నాని ప్రత్యక్ష ఆదేశాల మేరకే పోలీసులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని వైయస్ఆర్సీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వస్తే అడ్డుకోవడం ప్రభుత్వ తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నమేనని నాయకులు మండిపడ్డారు. పోలీసుల అక్రమ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ప్రభుత్వ తీరుపై భూమన కరుణాకర్ రెడ్డి నిరసన తెలిపి మృతుడి నివాస ప్రాంతం నుంచి వెనుతిరిగారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## 2 వ పుష్కరం సందర్భంగా శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో మహా కుంభాభిషేకం

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.



నాయుడుపేట అగ్రహారంపేటలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం స్థాపించి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ద్వితీయ పుష్కర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహా కుంభాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, వేద పండితులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ యాగశాలలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితుల సమక్షంలో పవిత్ర కలశాలను ప్రతిష్ఠించి మహా కుంభాభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణలు చేసి, శ్రీ షిరిడి సాయినాథునికి విశేష అభిషేకాలు, అర్చనలు, హారతులు సమర్పించారు. భక్తులు "ఓం సాయిరామ్" నామస్మరణతో భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. కుంభాభిషేకం అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి సాయిబాబా ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తుల రద్దీతో సందడిగా మారింది.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ద్వితీయ పుష్కర మహోత్సవాల్లో భాగంగా రేపు శ్రీ షిరిడి సాయినాథుని నగరోత్సవం (ఊరేగింపు) అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై శ్రీ సాయినాథుని విగ్రహాన్ని పట్టణ వీధుల గుండా ఊరేగిస్తామని, భజన బృందాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల సాయినామ సంకీర్తనల మధ్య కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.నాయుడుపేటతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలోహాజరై శ్రీసాయినాథుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి, మహోత్సవాలను విజయవంతం చేశారు. ఈ వేడుకలు భక్తి, ఆధ్యాత్మికత, సేవాకార్యక్రమాల సమ్మేళనంగా ఘనంగా సాగాయి.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 10

శుక్రవారం 31 జూలై 2026

# జననివాసాల మధ్య వెలసిన మద్యం షాపుల అనుమతులు రద్దు చేయాలి

## రేణిగుంట పట్టణంలో "సర్వేశ్ వైన్స్ బి ఆద్య వైన్స్" షాపులను తక్షణమే తొలగించాలి!

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
తిరుపతి జిల్లా రేణిగుంట పట్టణంలోని నివాస ప్రాంతాల్లో ఇటీవల ప్రారంభించిన "సర్వేశ్ వైన్స్ బి ఆద్య వైన్స్" షాపులు అనుమతి రద్దుచేసి తక్షణమే జనావాసం నుండి మద్యం దుకాణాలను తొలగించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ పత్రిక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తిరుపతి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మరియు డిఆర్ఓ అధికారులకు రేణిగుంట ఐద్వా ఆధ్వర్యంలో "వినతిపత్రం" అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ మాట్లాడుతూ..రేణిగుంట పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని "సర్వేశ్ వైన్"షాప్, వైఎస్ఆర్ విగ్రహం సర్కిల్ సమీపంలోని "ఆద్య వైన్స్" దుకాణాలు నివాస ప్రాంతాలు, పాఠశాలలు, దేవాలయాలు, రైల్వే స్టేషన్, బస్టాండ్‌కు సమీపంలో ఉండటంతో మహిళలు, విద్యార్థులు, చిన్నారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో 15 సంవత్సరాల క్రితం రేణిగుంట పట్టణంలో మద్యం దుకాణాలు తొలగించాలని



మూడు ప్రాంతాల్లో స్థానిక ప్రజలు నిరసనలు వ్యక్తం చేయడంతో ప్రజల అభ్యంతరాల మేరకు ఇదే ప్రాంతంలోని మద్యం దుకాణాలను తొలగించారని గుర్తు చేశారు. అయితే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రస్తుతం మళ్లీ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. మహిళల భద్రత, ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని రెండు మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని జిల్లా ఎక్సైజ్ శాఖ, డిఆర్ఓ, రేణిగుంట పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, రేణిగుంట మండల అధ్యక్షురాలు బి.భారతి, వేణుగోపాలపురం కమిటీ కార్యదర్శి అమ్ములు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు ఓ. వెంకటరమణ పాల్గొన్నారు.

# ఐరాల పోలీస్ స్టేషన్ ఎదుట వికలాంగుల భారీ నిరసన

ప్రజాభూమి ప్రతినిధి ఐరాల
ఈనెల 8వ తేదీన మండలంలోని కంపల్లి లో జరిగిన దివ్యాంగ యూనియన్ నాయకుల పై జరిగిన దాడి ఘటనలో ఐరాల ఎస్సై జయశ్రీ తీరుకు నిరసనగా అమ్మ వికలాంగుల హక్కుల పరిరక్షణ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట గురువారం వికలాంగులు నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి రాయలసీమ జిల్లాల నుంచి వివిధ వికలాంగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ దివ్యంగా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కొనతం చంద్రశేఖర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళి వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అనంతపురం జిల్లా అధ్యక్షుడు వసంత్ కుమార్ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి అనంతపురం జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ ఈనెల 8న మండలంలోని కంపల్లి గ్రామంలో జరిగిన దివ్యాంగ యూనియన్ నాయకుల పై దాడి ఘటనకు సంబంధించి ముందస్తు తాసిల్దార్ వారి నుంచి పోలీసు ప్రొటెక్షన్ అనుమతులు ఉన్నప్పటికీ ఆ విషయాన్ని స్థానిక ఎస్సై జయశ్రీ గారికి ముందస్తుగా తెలిపినప్పటికీ దాడి ఘటన జరుగుతున్న సమయంలో పలుమార్లు ఎస్ఐ గారికి ఫోన్ చేసినప్పటికీ పోలీసులు స్పందించకపోవడంతో పోలీసు అత్యవసర సేవలు 112 కు ఫోన్ చేసినా హాయ్ రాల ఎస్సై జై శ్రీ గారు స్పందించనందున దివ్యాంగ యూనియన్ నాయకుల పై దాడి చేసిన రాజేంద్ర రెడ్డితో ఎస్సై జయశ్రీ గారు కుమ్మక్కై వికలాంగులకు రక్షణ కల్పించడంలో పక్షపాతం చూపారని, పోలీస్ అత్యవసర సేవలు 112 కు ఫోన్ చేసినా గాని స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దాడి జరిగిన మూడు రోజుల తర్వాత దివ్యాంగ నాయకుల పై దాడి చేసిన రాజేంద్ర రెడ్డి వద్ద ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదు తీసుకుని దివ్యాంగ యూనియన్ నాయకుల పై అక్రమ కేసు బనయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎస్సై ఒక మహిళగా ఉండి రాష్ట్ర హోంశాఖ మంత్రి ఒక మహిళగా ఉండి ఒక దివ్యాంగ మహిళా నేత పై తీవ్ర స్థాయిలో దాడి జరిగితే పోలీసులు స్పందించకపోవడం సంఘటన స్థలానికి రాకపోవడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత జిల్లా అయిన చిత్తూరు జిల్లాలో వికలాంగులపై తీవ్ర స్థాయిలో దాడి జరిగిన ఘటనపై పోలీసుల తీరు ఆశ్చర్యకరమన్నారు. సుమారు రెండు గంటల పాటు కొనసాగిన నిరసన కార్యక్రమంలో పోలీసుల స్పందించకపోవడంతో పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. ఎస్పీ గారు రావాలి, ఎస్సై జయశ్రీ గారిని సస్పెండ్ చేయాలని



నినాదాలు చేశారు. చిత్తూరు డిఎస్పి వెంకటనారాయణ ఆందోళనకారులతో ఫోన్లో మాట్లాడుతూ మేం పోలీసు రక్షణ కల్పించాల్సిందే రెవిన్యూ అధికారులకే తప్ప మేం పోలీసు రక్షణ కల్పించాల్సిందే రెవిన్యూ అధికారులకే తప్ప వికలాంగులకు కాదు అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సహనం కోల్పోయిన దివ్యాంగులు వికలాంగుల పైన దాడి జరిగితే నో పోలీస్, 112 కి ఫోన్ చేసిన నో పోలీస్, ఎస్పీ గారు రావాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాష్ట్ర హోం మంత్రి ఒక మహిళగా ఉండి దివ్యాంగ మహిళలపై జరుగుతున్నటువంటి దాడుల పైన హోం మంత్రి వంగలపూడి అనిత నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం కల్లూరు సిఐ జయరామయ్య గారు ఘటన స్థలానికి రావడంతోరావడంతో దివ్యాంగులు ఆందోళనను మరింత ఉధృతం చేశారు. ఎస్సై జయశ్రీ కంపల్లి దాడి ఘటనలో ఏకపక్షంగా వ్యవహరించి దివ్యాంగ యూనియన్ నాయకుల పై ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసు బనాయించారని సదరు విషయమై సాక్షాదారాలతో జిల్లా ఎస్పీకి పీజేఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ నేటికి ఎస్సై పై చర్యలు తీసుకోక పోవడం దుర్మార్గమని అన్నారు. వెంటనే ఆమెను సస్పెండ్ చేయాలని పట్టుబట్టారు. సిఐ స్పందించి ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐకి షోకాస్ నోటీస్ ఇచ్చామని విచారణ కొనసాగుతున్నదని తెలిపారు. యూనియన్ నాయకుల పై బనగించిన అక్రమ కేసును తొలగిస్తున్నామని హామీ ఇచ్చారు. సిఐ గారి హామీతో దివ్యాంగ సంఘాల జేఏసీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని విరమించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షురాలు సుమతి, చిత్తూరు జిల్లా కార్యదర్శి లీలావతి నాయుడు, ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా కార్యదర్శి ప్రశాంతి నాయకులు బాలాజీ నాయుడు, ఏకాంబరం, మురళి గౌడ్, నారాయణస్వామి, దొనస్వామి, మాధవి, మునెప్ప, రాజేష్ బాధిత దివ్యాంగురాలు విజయ తదితరులు పాల్గొన్నారు.

## వాకాడులో ఇంటింటా టీడీపీ ప్రచారం అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న పార్టీ శ్రేణులు

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు
గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు, టీడీపీ సీనియర్ నాయకుడు సన్నారెడ్డి విజయ్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వాకాడు మండలంలో టీడీపీ కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి.వాకాడు యూనిట్ ఇన్‌చార్జి ఎస్.కే. రహమతుల్లా నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలను కలుస్తున్నారు.ఈ సందర్భంగా టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటున్నారు పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసే కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని రహమతుల్లా తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిషోర్ కుమార్ రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను పరామర్శించిన పులివర్తి వినిల్



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం.
రామచంద్రపురం మండలంలోని రాయల చెరువు పేట గ్రామంలో ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన టిడిపి కార్యకర్త సంజీవ సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ ( నాని) తనయుడు టిడిపి యువనేత పులివర్తి వినిల్ పరామర్శించారు. గురువారం రాయలచెరువుపేట లోని మృతుడు సుబ్రహ్మణ్యం స్వగృహానికి చేరుకుని మృతుని భార్య నిర్మల, కుమారుడు ప్రశాంత్ కుమార్, కుమార్తె జయలక్ష్మిలను పరామర్శించి ఓదార్చారు. అధైర్య పడకండి... పార్టీ మీ కుటుంబానికి అండగా ఉంటుంది, ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, సీనియర్ నాయకులు మాదాసు మాధవయ్య, నాగమణి యాదవ్, గిరి కుమార్ యాదవ్, ప్రసాద్ యాదవ్, మాజీ సర్పంచ్ నాగభూషణం, బాదురు కోటేశ్వర్ రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు, సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మామిడి రైతులుకు ఉద్యాన శాఖ అధికారి సూచన



ప్రజా భూమి ప్రతినిధి, పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం.
మామిడి కాయలను రాంపులకు తోలిన రైతులు మీ కు సంబందించిన రైతుసేవా కేంద్రాల వద్ద మీ బిల్లులు, పొలం పాసుబుక్, ఆధార్ కార్డు మరియు బ్యాంకు పాసుబుక్ మొదటి పేజీ తీసుకొని వెళ్లి తనిఖీ చేసుకోవాలి, ఇప్పుడు ఉన్న మొదటి లిస్ట్ లో, పేరు లేనివాళ్ళవి, రెండోవ లిస్ట్ లో చెక్ చేసుకోవాలి. త్వరలోనే ప్రభుత్వం నుంచి రావలసిన ధనం కోసం ప్రభుత్వానికి పంపడం జరుగుతుంది గనుక ఆలస్యం చేయకుండా రైతులు వారికి రావలసిన బిల్లులను తనిఖీ చేసుకోవాల్సిందిగా, కోరడమైనది. నలగాంపల్లి,తిమోజిపల్లి, నల్లం గాడు మరియు తుంబ కుప్పం రైతు సేవ కేంద్ర సిబ్బంది, మామిడి రైతుల డేటా, ఏ విధంగా వెరిఫై చేస్తున్నారని బంగారుపాళ్యం ఉద్యాన శాఖ అధికారి సాగరిక మరియు ఉద్యాన శాఖ సిబ్బంది తనిఖీ చేయడం జరిగింది.

## అమర రాజా లిమిటెడ్ కు, (పి,ఎం,ఐ) సిటీ చాప్టర్ అవార్డ్ లభించాయి



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
పీఎంఐ పెర్ల్ సిటీ చాప్టర్ వార్షిక అవార్డ్స్‌–2026లో అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్‌కు మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించాయి. అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏ, ఆర్ ఈ ఎం, ఈ, ఎం) మరోసారి తన ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ నైపుణ్యం, ఆవిష్కరణ, సుస్థిర అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధతను చాటుకుంటూ పీఎంఐ పెర్ల్ సిటీ చాప్టర్ నిర్వహించిన వార్షిక అవార్డ్స్‌–2026లో మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులను కైవసం చేసుకుంది. దేశవ్యాప్తంగా 40కు పైగా ప్రముఖ సంస్థలతో పోటీపడి ఈ విశిష్ట గుర్తింపును సాధించింది. ఈ అవార్డుల్లో పీఎంఓ ఎక్సలెన్స్ అవార్డు అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్‌కు లభించగా, అమర రాజా సర్క్యులర్ సొల్యూషన్స్ చేపట్టిన బ్యాటరీ రీసైక్లింగ్ ప్లాంట్ ప్రాజెక్టు ప్రాజెక్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో పాటు సస్టైనబిలిటీ ప్రాజెక్ట్ ఎక్సలెన్స్ అవార్డు కూడా లభించాయి. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ, వ్యూహాత్మక అమలు, వినూత్నత, సుస్థిర అభివృద్ధి, సామాజిక ప్రభావం వంటి అంశాల్లో విశేష కృషి చేసిన సంస్థలను గుర్తించి పీఎంఐ పెర్ల్ సిటీ చాప్టర్ ఈ అవార్డులను ప్రదానం చేస్తుంది. ఈ గుర్తింపు అమర రాజా నాణ్యత, ఆవిష్కరణ, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి మరియు సామాజిక బాధ్యత పట్ల సంస్థకు ఉన్న అంకితభావాన్ని మరోసారి ప్రతిబింబిస్తోంది. ఈ సందర్భంగా అమర రాజా చైర్మన్ జయదేవ్ గల్లా మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన్ గౌరినేని విజేత బృందాలను అభినందించారు. సంస్థ విజయానికి ఉద్యోగుల అంకితభావం, సమష్టి కృషి, అత్యుత్తమ పనితీరు ప్రధాన కారణమని వారు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని వినూత్న ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేస్తూ పరిశ్రమలో కొత్త ప్రమాణాలను నెలకొల్పాలని , ఆకాంక్షించారు.

## వాహనాల తనిఖీ నిర్వహించిన బంగారుపాళ్యం పోలీసులు సిబ్బంది

ప్రజాభూమి ప్రతినిధి పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం.



చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారు పాళ్యం మండలంకు సంబంధించిన మహాసముద్రం టోల్ ప్లాజా వద్ద నేషనల్ హైవే రోడ్డు నందు బంగారుపాళ్యం పోలీసులు వాహనదారులను రికార్డ్స్ తనిఖీ చేస్తూ మత్తు పానీయములు సేవించి వాహనాలు నడిపినచో చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొనడం జరుగుతుంది అని హెచ్చరించారు,కొన్ని వాహనదారులకు రికార్డ్స్ సరిగా లేనందున జరిమానా విధించడం జరిగింది, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ వాడాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఆర్ సి ఇన్సూరెన్స్ పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉంచుకోవాలని దిశ నిర్దేశం చేశారు, ఈ కార్యక్రమంలో సీఐ కత్తి శ్రీనివాసులు ఎస్ఐ టిఎస్ ప్రసాద్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొనడం జరిగినది

## ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు ఉచిత విద్యాసామగ్రి, దుస్తుల పంపిణీ



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం
రామచంద్రపురం మండలం సొరకాయల పాల్యం గ్రామంలో ఉన్న ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులు దాదాపు 70 మంది విద్యార్థులకు సొసైటీ ఫర్ సోషల్ సర్వీస్ సంస్థ తిరుపతి కార్యదర్శి సి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఉచితంగా విద్యా సామాగ్రి మరియు దుస్తులు, బుక్స్, పెన్సిల్స్, వాటర్ బాటిల్స్ బిస్కెట్స్ హాస్టల్ వార్డెన్ ఎం అంజప్ప నాయక్ చేతులు మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యాసామగ్రిని చక్కగా ఉపయోగించుకుని శ్రద్ధతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు వినయం పెద్దలపై గౌరవం అలవర్చుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా హాస్టల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సొసైటీ ఫర్ సోషల్ సర్వీస్ తిరుపతి సంస్థ వారు అందిస్తున్న విద్యాసామగ్రి వారి ప్రోత్సాహం విద్యార్థులకు చాలా ఉపయోగపడుతుందని, ఆ సంస్థ చేస్తున్న ఎన్నో కార్యక్రమాల గురించి కొనియాడారు. సంస్థ ఆర్గనైజర్ ఎస్ యువరాజు యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా విద్యనభ్యసించి మంచి ప్రయోజకులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తంరెడ్డి తండ్రి పెద్దకర్మ కార్యక్రమానికి హాజరైన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు



ప్రజా భూమి ప్రతినిధి, వాకాడు
బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి తండ్రి, స్వర్గీయ పాపారెడ్డి రాజారామరెడ్డి పెద్దకర్మ కార్యక్రమాన్ని వాకాడు మండలం జమీన్ కొత్తపాళెం గ్రామంలో కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు కార్యక్రమానికి హాజరై రాజారామరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆయన సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, సూళ్లూరుపేట నియోజకవర్గ కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు ఆనందరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.రాజారామరెడ్డి, సమాజానికి అందించిన సేవలను నాయకులు స్మరించుకుని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

## చంద్రగిరి కైలాస దామశీ కు విశ్వనాథ రెడ్డి రూ"51,101/-లు విరాళం..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి
చంద్రగిరిలో నిర్మితమవుతున్న కైలాసదామము నిర్మాణం కొరకు నరసింగాపురం వాస్తవ్యులైన పి. వేణుగోపాల్ రెడ్డి కుమారుడు పి. విశ్వనాథ రెడ్డి, మాజీ వి.ఎం. సి. వెంకట ముని రెడ్డి ద్వారా ?51,101/- విరాళాన్ని కమిటీ చైర్మన్ వీరం గారి రమేష్ రెడ్డి మరియు కమిటీ సభ్యులు ఎస్. గౌస్ బాష కు అందజేశారు.ఈ సందర్భంగా చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని మరియు కైలాసదామము కమిటీ సభ్యులు దాతలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.



## గుడివారిపల్లి గ్రామంలో '2 ఏళ్ల నమ్మకం -అభివృద్ధి,సంక్షేమం కార్యక్రమం

### ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్న చంద్రగిరి ఎమ్మెల్యే తనయుడు పులివర్తి వినీల్ బాబు



ప్రజాభూమి ప్రతినిధి పాకాల
తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం గాదంకి పంచాయతీ గుడివారిపల్లిలో రెండు ఏళ్ల నమ్మకం–అభివృద్ధి,సంక్షేమం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ బాబు గురువారం పాల్గొన్నారు. గ్రామానికి విచ్చేసిన యువ నాయకుడు పులివర్తి వినీల్ బాబు'కి మాజీ ఎంపీటీసీ,టిడిపి నేత ఇరుగు గురుమూర్తి, గ్రామస్థులు, నాయకులు,కార్యకర్తలు కలిసి ఘన స్వాగతం పలికి,శ్యాలువాతో సత్కరించారు. 2 ఏళ్ల నమ్మకం--అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలను టిడిపి యువ నాయకుడు పులివర్తి వినీల్ బాబు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పాకాల జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి,చిత్తూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా మందలపు వెంకటేష్ బాబు మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమం–భవిష్యత్తుకు భరోసా ఇచ్చిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వాన్ని అన్నారు.కూటమి ప్రభుత్వంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పెంపు,ఇంట్లో ప్రతి విద్యార్థికి తల్లికి వందనం, దీపం–2 ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం,ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ,పేదలకు ఐదు రూపాయలకే అన్న క్యాంటీన్ ద్వారా భోజనం, ఎన్టీఆర్ ఉచిత వైద్య సేవలు,ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బోయపాటి నాగరాజు నాయుడు,టిడిపి నాయకులు టి.జె ప్రవీణ్ కుమార్, సుబ్బు, రవి,రాజు,దేవా, సుదర్శన్, సింగల్ విండో చైర్మన్ కృష్ణమనేని సావిత్రి,టిడిపి నాయకులు బొల్లినేని మహేష్,ఈశ్వర్ చౌదరి,మాజీ జెడ్పిటిసి కనుమూరి సురేష్ కుమార్,అనంతనేని బాలాజీ,బుల్లి, మోహన్,రాష్ట్ర మొదిలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ శరవణన్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ బద్రి నారాయణ,టీడీపీ పార్టీ నాయకులు,బూత్, యూనిట్,క్లస్టర్, గ్రామ కమిటీలు,మహిళా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ శక్తి పీఠాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం
అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గ శాసనసభ్యురాలు బండారు శ్రావణి తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం రాయల చెరువు కట్ట దగ్గర ఉన్న శ్రీ శక్తి పీఠాన్ని సందర్శించి ఆషాడం సారె సమర్పించారు. ఈ సందర్భంగా పీఠం పరిపాలనాధికారి శ్రీకాంత్ ఆచార్య గారి ఆధ్వర్యంలో పీఠంలోని దేవతామూర్తులకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆషాడ మాసం సందర్భంగా దేవతలకు సారె సమర్పించారు. అనంతరం వేద పండితులు ఆమెకు వేదాశీర్వచనం గావించారు. తదనంతరం, కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠాధిపతులు శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి మరియు శ్రీ రమ్యానంద భారతీ మహాస్వామినీ వారిని దర్శించుకుని, వారి దివ్య ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ "శ్రీ శక్తి పీఠం అత్యంత శక్తివంతమైన, ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక క్షేత్రం" అని కొనియాడారు. ఈ క్షేత్రాన్ని దర్శించుకోవడం, స్వామివార్ల ఆశీస్సులు పొందడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.





# మెగా డీఎస్సీ పరీక్షల అవినీతి పై నారా లోకేష్ తక్షణం రాజీనామా చేయాలి

## వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి డిమాండ్

ప్రజాభూమి పోరుమామిళ్ల :
నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారానికి భాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి దరేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లు నీతి,నిజాయితీ, నిబద్ధత ఉంటే మెగా డీఎస్సీ పరీక్షల నిర్వాహణ లో జరిగిన అవినీతి,అక్రమాలకు భాధ్యత వహిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖమంత్రి నారా లోకేష్ రాజీనామాచేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎస్సీ నియామక ప్రక్రియలో ముఖ్యంగా. నాలుగో తరగతి నుండి పదో తరగతి వరకు. నాలుగు సంవత్సరాలు ఎక్కడైతే చదువుతారో వారికి. వారి జిల్లాలలో లోకల్ అభ్యర్థులుగా పరిగణలోకి తీసుకుంటారు. కానీ డీఈవో స్థాయి నుంచి. ఎంఈఓ స్థాయి వరకు నివేదిక తీసుకోకపోవడం వలన. చాలామంది డిఈఓ లు అమ్ముడుపోయారని . అందుకే ఇలాంటి తప్పులు ఎన్నో జరిగాయని. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎంపికైన అభ్యర్థులను చాలామంది . అభ్యర్థులు 1.నాన్ లోకల్ అభ్యర్థులు దొంగ లోకల్ సర్టిఫికెట్లు సృష్టించారని.2 పీహెచ్ కోటాలో. హెచ్. ఐ. కోటాలో చెవుడు దొంగ సర్టిఫికెట్లు 3. ఈడబ్ల్యూఎస్ దొంగ సర్టిఫికెట్లు.4 స్పోర్ట్స్ కోట దొంగ సర్టిఫికెట్లు. ఈ నాలుగు అంశాలను ప్రభుత్వం ఎలా మర్చిపోయిందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. అనేక అక్రమాలు,అవకతవకలు జరిగిన నేపథ్యంలో ఆభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని అయినా దానిని కనీసం పరిగణలోనికి తీసుకోకుండా. నారా లోకేష్ రి ఎంక్వయిరీ చేయిస్తే దొంగలు బయటపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిజమైన లబ్ధిదారులు న్యాయం జరుగుతుందని కానీ నారా లోకేష్ పట్టీ పట్టనట్టుగా వ్యవహరించడం ఉన్నత విలువలకు కోల్పోయాడని ఆయన శాఖలో ఇంత అవినీతి జరుగుతూ ఉంటే ఏ మాత్రం స్పందించకుండా తాను నిర్వహించిన మెగా డీఎస్సీ తప్పులు కప్పిపుంచడం అతి దారుణమైన చర్యని విద్యార్థుల ప్రాణాలతో చలగాటమాడుతున్న రాష్ట్ర



విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణం రాజీనామా చేసి తన చిత్తశుద్ధిని, నైతిక విలువలను కాపాడు కోవాలని.అనంతరం డిఎస్సీ నియామకాల్లో జరిగిన లోపాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర విద్యామంత్రి దరేంద్ర ప్రధాన్ రాజీనామా ఎన్డీఏ కూటమి ప్రభుత్వా నైతిక విలువలకు అద్దం పడుతోశీదన్నారు. అదే కూటమి లో బాగస్వామిగా ఉన్న రాష్ట్ర విద్యా మంత్రి నారాలోకేష్ రాజీనామా చేసి నైతిక విలువలను పరిరక్షిస్తారా. పదవే ముఖ్యమని బావించి అంటిపెట్టు కుని ఉంటారో. చెప్పాలని, దీనిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన వైఖరిని రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు వెల్లడించాలని ఆమన డిమాండ్ చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని నమ్మిన నిరుద్యోగులు చంద్రబాబు వస్తే దొంగలకు ఉద్యోగాలు వస్తున్నాయంటే దీనికి మెగా డీఎస్సీ నిదర్శనం. ఎన్నికల ముందు, ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, కూటమి నేతలు నమ్మబలికారని, ప్రజలను విద్యార్థులను మోసం చేశారని చిత్తశుద్ధి ఉంటే చంద్రబాబు నాయుడు సిబిఐ ద్వారా విచారణ చేపట్టి అవకతవకలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని. తన కుమారుడిని మంత్రి పదవి నుంచి తొలగించాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విలువలతో కూడిన సాంకేతిక విద్యే విజయానికి పునాది

## -విడిఎమ్ అన్ ది మూవ్ వ్యవస్థాపక ఛైర్మన్ ఆచార్య అజిత్ కుమార్

ప్రజాభూమి, హిందూపురం టౌన్
సాంకేతిక విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి, వ్యక్తిత్వ వికాసాన్ని అలవర్చుకున్నప్పుడే విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని విడిఎమ్ ఆన్ ది మూవ్ వ్యవస్థాపక ఛైర్మన్ ఆచార్య అజిత్ కుమార్ అన్నారు. హిందూపురంలోని బి.ఐ.టి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో గురువారం నూతనంగా ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం డిప్లొమా విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, భారతీయ సంస్కృతి, ప్రాచీన జ్ఞానం, ఆధునిక విజ్ఞానాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు దేశభక్తి, జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యతను పెంపొందించుకుని సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మార్గదర్శకత్వాన్ని గౌరవిస్తూ విలువలతో కూడిన జీవన విధానాన్ని అలవ







ర్చుకోవాలని కోరారు. హిందూపురం వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. రాజగోపాల్ నాయుడు మాట్లాడుతూ కళాశాల జీవితం బాధ్యతలతో కూడిన కొత్త దశ అని పేర్కొన్నారు. ర్యాగింగ్ తీవ్రమైన నేరమని, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్, గ్రాఫాలజిస్ట్ డా. వై. శివరామ ప్రసాద్ మాట్లాడుతూ కొత్త వాతావరణానికి అలవాటు పడటం, ప్రతిరోజూ కొంత పురోగతి సాధించడం పై దృష్టి పెట్టడం విజయానికి అవసరమన్నారు. మంచి స్నేహాలు, పుస్తక పఠనం, ధ్యానం, సానుకూల ఆలోచనలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని తెలిపారు. కళాశాల ఛైర్మన్ డా. పి. చంద్ర మోహన్ మాట్లాడుతూ బి.ఐ.టి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గత 25 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులను ఉత్తమ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దింద న్నారు. సాంకేతిక విద్యతో పాటు నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించే విద్యా వాతావరణాన్ని కళాశాలలో కల్పిస్తున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ డా. ఎ. రమేష్ నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ, క్రమశిక్షణతో చదువుతూ విద్యా, సహపాఠ్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించేలా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గత విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం వివిధ విభాగాల అధిపతులు తమ శాఖల ప్రత్యేకతలు, ల్యాబ్ సదుపాయాలు, ఉపాధి అవకాశాలను వివరించారు. కళాశాల పూర్వ విద్యార్థి సాయి కుమార్, అతిథులతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ వై. రాధ సమన్వయకర్తగా వ్యవహరించగా, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం -ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

ప్రజాభూమి, హిందూపురం టౌన్
కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సుపరిపాలనను ప్రతి ఇంటికీ చేరవేయడమే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం లక్ష్యమని టీడీపీ పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, హిందూపురం ఎమ్మెల్యే, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ సూచనల మేరకు గురువారం హిందూపురం పట్టణంలోని 4వ వార్డు త్యాగరాజు నగర్ లో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంద




ర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సూపర్ సిక్స్ హామీల అమలు ద్వారా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వివరించారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి కుటుంబానికి చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజ్, పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, క్లస్టర్ ఇంచార్జ్ అమర్నాథ్ , శ్రీనివాస్ నాయుడు, 4వ వార్డ్ ఇంచార్జ్ అశోక్, యూనిట్ ఇంచార్జ్ రమణ, 3వ వార్డ్ ఇంచార్జ్‌లు రెహమాన్ భాష, బాబు రెడ్డి, రాజన్న, మల్లి, అబూబకర్, రుబీనా బేగం, శ్రీనివాస్ రెడ్డి, సమీవుల్లా, విజయ్ బాబు, బుడ్డప్ప, రమేష్ బాబు, ఐటీడీపీ ఇంచార్జ్ నవీన్ తదితరులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

# అప్పలాయగుంటలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి వైభవంగా పుష్పయాగ మహోత్సవం

## బ్రహ్మోత్సవాల్లో జరిగిన లోపాల పరిహారార్థం శాస్త్రోక్తంగా నిర్వహణ

ప్రజా భూమి ప్రతినిధి వడమాలపేట
తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ ఆలయమైన అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గురువారం పుష్పయాగ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. జూన్ 25 నుంచి జూలై 3 వరకు నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాల్లో నిత్యకైంకర్యాలు, ఉత్సవాల సందర్భంగా అర్చకులు, అధికారులు, పరిచారకులు, భక్తుల వల్ల తెలియక జరిగిన లోపాల పరిహారార్థం ఆగమశాస్త్ర సంప్రదాయం ప్రకారం ఈ పుష్పయాగాన్ని నిర్వహించారు.
స్నపన తిరుమంజనం, పుష్పాల శోభాయాత్ర ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీటితో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం







పుష్పయాగానికి వినియోగించే పుష్పాలను మూలమూర్తి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి, ఆలయ ప్రదక్షిణతో పాటు మాడవీధుల్లో శోభాయాత్రగా తీసుకువచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సర్వభూపాల వాహనంలో స్వామివారిని కొలువుదీర్చారు.
రెండున్నర టన్నుల పుష్పాలతో దివ్య పుష్పార్చన మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సుమారు రెండున్నర టన్నుల పుష్పాలతో పుష్పయాగం వైభవంగా జరిగింది. తులసి, చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలతో సహా 18 రకాల పుష్పాలు, ఆరు రకాల పవిత్ర పత్రాలతో స్వామివారికి పుష్పార్చన నిర్వహించారు. ఆధ్యాత్మిక వైభవాన్ని తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం వీధి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో శ్రీహరి రావు, సూపరింటెండెంట్ శ్రీవాణి, కంకణభట్టార్ సూర్యకుమార్ ఆచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ వేణుగోపాల్, ఇతర అధికారులు, అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎం జి నగర్ ఎస్ టి కాలనీ లో పౌర హక్కుల దినోత్సవం

## పౌర హక్కులు -- పౌర బాధ్యతలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.
వరదయ్యపాలెం మండలంలోని ఎం.జి. నగర్ ఎస్.టి. కాలనీలో గురువారం నిర్వహించిన సివిల్ రైట్స్ డే (పౌర హక్కుల దినోత్సవం) కార్యక్రమం గ్రామస్థుల భాగస్వామ్యంతో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యుడు గుత్తి త్యాగరాజు, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఒ వ్యవసాయ అధికారి ( ఎం ఏ ఓ ) గౌరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీవీఎంసీ సభ్యుడు గుత్తి త్యాగరాజు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు, పౌర బాధ్యతలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తుపాకుల వెంకటరత్నమ్మ అనే మహిళ ముగ్గురు కుమార్తెలకు 'తల్లికి వందనం' పథకం సాంకేతిక కారణాల వల్ల అందలేదని, వాటిని సరిచేసి వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎంపీపీ పాఠశాల వంటగదిని సక్రమంగా ఏర్పాటు చేయాలని, వన్యప్రాణుల వల్ల పంటలు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి జూనియర్ అసిస్టెంట్ ప్రమోద్, ఎంపీడీఓ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ మాధవి, ఏపీఓ గణేష్, హాస్టల్ వార్డెన్ రాజా రమేష్, పోలీసు హెడ్ కానిస్టేబుల్ వెంకటముని, కిరణ్, పీఎస్, వీఆర్వో, వీఆర్ఏ, రేషన్ డీలర్, అంగన్‌వాడీ కార్యకర్త, బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థులకు పౌర హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే వేదికగా సివిల్ రైట్స్ డే ఉపయోగపడిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.



# యువత భద్రత, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

## వ్యక్తిగత భద్రతతో పాటు సమాజ భద్రత కూడా ముఖ్యం: ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



ప్రజాభూమి,పులివెందుల
యువత తమ వ్యక్తిగత భద్రతతో పాటు సమాజ భద్రత పట్ల కూడా బాధ్యతా యుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల భద్రత, మహిళల రక్షణ, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన అత్యవసర సేవలు, భద్రతా అనువర్తనాలు, పోలీసు సహాయ వ్యవస్థలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా 112లకు ఫోన్ చేస్తే వెంటనే పోలీసు సహాయం అందుతుందని తెలిపారు.సామాజిక మాధ్యమాలను వినియోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని సూచించా రు. మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, చట్టాలను గౌరవిస్తూ క్రమశిక్షణతో చదువు కొనసాగించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.చదువుతో పాటు మంచి వ్యక్తిత్వం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించు కోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పులివెందుల డిఎస్పీ బి. మురళీ నాయక్, సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. శ్రీరామ్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. విష్ణువర్ధన్, ఉప ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. శేష మహేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి దేవాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

ప్రజాభూమి, పుట్లూరు.
తిరుపతి జిల్లాలోని ప్రముఖ శైవ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి దేవాలయాన్ని గురువారం అమ్మ శ్రీమతి బండారు లీలావతితో పాటు అక్క కిన్నెర మరియు తమ్ముడు బండారు సాయి పవన్ కుమార్ తో కలిసి సందర్శించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ . ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని, వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు.స్వామి వారి చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు.



# పోలీస్‌స్టేషన్ సమీపంలోనే చైన్ స్నాచింగ్

ప్రజాభూమి, హిందూపురం టౌన్
హిందూపురం పట్టణంలో గురువారం పట్టపగలే జరిగిన చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. ఆశ్చర్యకరంగా ఈ ఘటన రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలోనే చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఆర్టీవో కార్యాలయం సమీపంలోని గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మమత ఉపాధ్యాయురాలు విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని దుండగులు ఆమెను లక్ష్యంగా చేసుకుని మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల బంగారు చైన్‌ను లాక్కొని పరారయ్యారు. ఘటనతో తీవ్ర ఆందోళనకు గురైన ఉపాధ్యాయురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడం పోలీసుల దర్యాప్తుకు ఇబ్బందిగా మారినట్లు సమాచారం. దీంతో నిందితులను గుర్తించేందుకు పోలీసులు ఇతర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే ఇలాంటి ఘటన జరగడం, పైగా ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

# శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి సేవ లో వైఎస్ఆర్సిపి నాయకులు



ప్రజాభూమి ప్రతినిధి ఐరాల
తిరుపతి సమీపంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం అప్పలాయగుంట, లో పుష్పయాగ మహోత్సవంలో పాల్గొన్న వైయస్సార్ సిపి రాష్ట్ర లీగల్ సెల్ సెక్రెటరీ గోవర్ధన్ రెడ్డి గారు మరియు వైయస్సార్సీపి యువ నాయకుడు నాంపల్లి భాను ప్రసాద్ గారు. వీరికి టీటీడీ ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనాన్ని కల్పించి , వారికి స్వామి వారి తీర్థ ప్రసాదాలుఅందజేయడం జరిగింది

# సర్పంచ్, ఎంపీపీ, జడ్పీటీసీ లను కైవసం చేసుకోవడం ఖాయం

## - వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు

## - టీడీపీ కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

ప్రజాభూమి, వేంపల్లె
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని సర్పంచ్, ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ఖాయమని ఆ పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఎంపీటీసీ సభ్యులు కటిక చంద్రశేఖర్, రహంతుల్లా ఖాన్, భారతి, మెహతాజ్, పద్మ రాజ్ కుమార్, హబిబుల్లా, బ్రహ్మయ్య లు విలేకరులతో మాట్లాడుతూ, గత రెండేళ్ల టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఇప్పటికీ అమలు కాలేదని, మిగిలిన హామీలు కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, అన్నదాత పథకం, 50 ఏళ్లకే పెన్షన్, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని పేర్కొన్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు మద్దతు ఇస్తారని వారు తెలిపారు.



ప్రజాభూమి

జనరల్

శుక్రవారం, జులై 31, 2026





## మచిలీపట్నంలో 'ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన' అవగాహన సదస్సులు

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

వ్యవసాయ శాఖ మరియు టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో ఖరీఫ్ 2026 'ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన' (PMFBY) పై గురువారం మచిలీపట్నం మండలంలోని రెండు రైతు సేవా కేంద్రాలలో రైతులకు విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ జిల్లా క్లస్టర్ మేనేజర్ సతీష్ మరియు కంపెనీ సిబ్బంది, మండల వ్యవసాయ అధికారి ఎం. రామ్ కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.ఆగస్టు 15లోగా బీమా ప్రీమియం చెల్లించాలి: కే. సురేష్ఎస్.ఎన్. గొల్లపాలెం సచివాలయ హాలులో జరిగిన సమావేశంలో మాజీ ఎంపీటీసీ కే. సురేష్ మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆగస్టు 15వ తేదీలోగా నాన్-లోనీ (బ్యాంకు రుణం తీసుకోని) రైతులు వరి పంటకు ఎకరానికి ₹830 ప్రమియం మొత్తాన్ని మీసేవ కేంద్రాలు లేదా బ్యాంకులలో చెల్లించి పంట బీమా నమోదు చేసుకోవాలని సూచించారు.లోనీ రైతులు బ్యాంకులలో సరిచూసుకోవాలి: సతీష్ (టాటా ఏఐజీ)చిట్టిపాలెం రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన సదస్సులో టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ ప్రతినిధి సతీష్ మరియు వీఏఏ పూజిత, రైతులు ఉపేంద్ర, రాజు, పాండురంగ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్ రైతులకు పలు కీలక సూచనలు చేశారు:రుణాలు పొందిన రైతులు: బ్యాంకు ద్వారా పంట రుణం తీసుకున్న రైతులు తమ ప్రీమియం కట్ అయిందో లేదో మరియు తమ పేరు బీమా పోర్టల్‌లో ఎన్రోల్ అయిందో లేదో వెంటనే సంబంధిత బ్యాంకు అధికారులను అడిగి తెలుసుకోవాలి.బీమా వద్దు అనుకోవద్దు: ఒకవేళ బీమా వద్దని భావిస్తే, వెంటనే బ్యాంకును సంప్రదించి పంట బీమాను యథావిధిగా కొనసాగించాల్సిందిగా కోరాలి.పరిహారం జమ: పంట నష్టం జరిగి బీమా మంజూరైతే, ఆ పరిహారం సొమ్ము నేరుగా రైతు పంట రుణ ఖాతాకే జమ అవుతుంది.కావాల్సిన ధ్రువపత్రాలు: బీమా నమోదు కోసం రైతులు తమ ఆధార్ కార్డు, కౌలు కార్డు, పంట వేసినట్లు ఆధారంగా ఇచ్చే ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను సమర్పించాలి.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ అసిస్టెంట్లు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు విరివిగా రైతులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఉచిత పంట బీమాను పునరుద్ధరించాలి.. కౌలు రైతులకు కూడా 'అన్నదాత సుఖీభవ' వర్తింపజేయాలి



**జగన్ ప్రభుత్వ తరహాలోనే ఉచిత పంట బీమా అమలు చేయాలి**

**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు**

జగ్గయ్యపేట, ప్రజాభూమి

రాష్ట్ర ప్రభుత్వం రైతులపై అదనపు ఆర్థిక భారం మోపకుండా గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అమలు చేసిన విధంగానే ఉచిత పంట బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అలాగే కౌలు రైతులకు కూడా'అన్నదాత సుఖీభవ' పథకాన్ని వర్తింపజేయాలని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.పెనుగంచిప్రోలు మండలంలోని పత్తి పంట పొలాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతుల తరపున పంట బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించి, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు అదే సీజన్‌లో పరిహారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేదని గుర్తు చేశారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులే పంట బీమా ప్రీమియం చెల్లించాలని నిర్ణయించడం వల్ల చిన్న, సన్నకారు రైతులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని విమర్శించారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులు, సాగు ఖర్చుల పెరుగుదల, ఎరువుల కొరత వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో బీమా ప్రీమియం కూడా రైతులే భరించాలనడం అన్యాయమన్నారు.పంట నష్టపోతే తగిన పరిహారం అందుతుందనే నమ్మకం కూడా రైతుల్లో లేకపోవడం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం వారిపై అదనపు భారం మోపడం సరికాదన్నారు.అలాగే, భూమి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న కౌలు రైతులను కూడా 'అన్నదాత సుఖీభవ' పథకంలో చేర్చి ప్రభుత్వ సహాయాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అన్నదాతలందరికీ సమాన న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు.గతంలో జగన్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఉచిత పంట బీమా, సకాలంలో పరిహారం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసిందని, అదే విధానాన్ని తిరిగి అమలు చేయాలని తన్నీరు నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ సేవలు ఆదర్శనీయం

**రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు**

ప్రజాభూమి బ్యూరో కృష్ణజిల్లా

మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ సేవలు బాలల విద్య, నైపుణ్యాభివృద్ధి, సంక్షేమానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు అన్నారు.గురువారం కమిషన్ సభ్యులతో కలిసి స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్‌ను సందర్శించిన చైర్మన్, ట్రస్ట్ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను పరిశీలించారు. అక్కడి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. వారి సంక్షేమం, విద్య, ఆరోగ్యం సంస్థలో అమలు చేస్తున్న సేవా కార్యక్రమాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి కమిషన్ చేపడుతున్న కార్యక్రమాలను వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలల రక్షణ, పాఠశాల మధ్యలో చదువు మానేసే విద్యార్థుల (డ్రాప్‌అవుట్స్) పునఃప్రవేశం, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి కీలక అంశాలపై వెంకయ్య నాయుడు విలువైన సూచనలు చేసినట్లు చెప్పారు.స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో దీపా వెంకట్, హర్షవర్ధన్ నాయకత్వంలో సుమారు 19 రకాల వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తూ ప్రతి మూడు నెలలకు ఒక బ్యాచ్ చొప్పున శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు 19 వేల మందికి పైగా యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ధ్రువపత్రాలు అందించి, ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే భవిష్యత్తులో బాలికల కోసం మరిన్ని నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రారంభించేందుకు ట్రస్ట్ ప్రణాళికలు రూపొందించడం సంతోషకరమని అన్నారు.నెల్లూరు జిల్లాలో ఎంపీ కూడా స్వర్ణభారతి ట్రస్ట్ విశిష్ట సేవలు అందిస్తోందని చైర్మన్ తెలిపారు. అక్కడ సుమారు 1,600 మంది



విద్యార్థులకు విద్యా సదుపాయాలు, 350 మందికి వృత్తి విద్యా శిక్షణ, అలాగే తల్లిదండ్రుల్లో ఒకరిని లేదా ఇద్దరినీ కోల్పోయిన సుమారు 300 మంది చిన్నారులకు ఉచిత విద్యతో పాటు విలువలు, సంస్కారాన్ని అందించే కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తోందని చెప్పారు. గత 16 సంవత్సరాలుగా బాలల అభ్యున్నతి కోసం నిరంతరం సేవలందిస్తున్న స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్‌కు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తరపున హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు.చైర్మన్ వెంట రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు మందాల గంగ సూర్యనారాయణ, ఉండవల్లి గాంధీబాబు, చల్లా మధు సూదనరావు, పద్మలత, నాగ మానస, ఐసిడి ఎస్ పిడి ఎంఎన్ రాణి, ఉంగుటూరు మండల తహసిల్దార్ విమల కుమారి తదితరులు ఉన్నారు.

# మంగలివానిసింకు ఔట్ ఫాల్ స్లూయిస్ అభివృద్ధి పరిశీలన



ప్రజాభూమి ప్రతినిధి / అవనిగడ్డ

మంగలివానిసింకు ఔట్ ఫాల్ స్లూయిసు అభివృద్ధి చేయించి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రైతులకు మేలు చేసారని కూటమి నాయకులు అన్నారు. గురువారం మోపిదేవి మండలం పెద్దకళ్ళేపల్లిలో మంగలివానిసింకు మేజర్ డ్రైనేజీ ఔట్ ఫాల్ స్లూయిసుకు ఏర్పాటు చేసిన నూతన షట్టరును నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పరిశీలించారు.

ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, జనసేన నాయకులు తోట కృష్ణాంజనేయులు మాట్లాడుతూ ఇటీవల ఔట్ ఫాల్ స్లూయిసు ఒక షట్టర్ ఊడిపోయిన సమస్యను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా, అధికారులతో మాట్లాడి నూతన షట్టర్ ఏర్పాటు చేయించి పరిష్కారం చేశారని తెలిపారు. షటర్ లేకపోతే సముద్రపు పోటు రేవులో నుంచి వెంకటాపురం వరకు చొచ్చుకువెళ్లి భూగర్భ జలాలు ఉప్పుగా మారే ప్రమాదాన్ని సకాలంలో అరికట్టారని తెలిపారు. గతంలో ఇక్కడ మండలి బుద్ధప్రసాద్ హయాంలోనే ఔట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణం జరిగిందని, ఈ ఔట్ ఫాల్ స్లూయిజ్ సక్రమంగా నిర్వహించటం ద్వారా లభించే డ్రైనేజీ నీటితో అన్నవరం, చిల్లపాలెం, వెంకటాపురం, పెద్దకళ్లేపల్లి గ్రామాలకు కొంతమేరకు సాగునీటి సదుపాయం కలుగుతుందన్నారు.

తమ గ్రామాల రైతులు ఎదుర్కొన్న సమస్యను పరిష్కారం చేసిన ఎమ్మెల్యేకు, సహకరించిన మండలి వెంకట్రామ్‌కు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు కేతరాజు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గోళ్ళ శ్రీనివాసరావు, గుడివాక శివరావు, బాదర్ల లోలాక్షుడు నాయుడు, ఏఎంసీ డైరెక్టర్ మెరకనపల్లి నరేష్, చోడగం రాధాకృష్ణ (నానీ), నర్రా లక్ష్మణప్రసాద్, గుమ్మడి నరసింహారావు, దేవిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సామినేని విమలాభాను ఆధ్వర్యంలో ఆషాడ మాస గోరింటాకు సంబరాలు

జగ్గయ్యపేట, ప్రజా భూమి

విమల భాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమల భాను ఆధ్వర్యంలో ఆషాడ మాసం సందర్భంగా గోరింటాకు సంబరాల ను అట్టహాసంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను సతీమణి, విమల భాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను ఆధ్వర్యంలో ఆషాఢ మాస గోరింటాకు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామినేని విమలాభాను, మహిళా ప్రముఖులు, వీర మహిళలతో కలిసి గోరింటాకు వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలకు గోరింటాకు పెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆషాఢ మాసంలో గోరింటాకు సంప్రదాయం మహిళల ఐక్యతకు, సాంస్కృతిక విలువలకు ప్రతీక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ వీర మహిళలు , పట్టణంలోని పలు సంస్థలకు చెందిన ప్రముఖ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



# రాయలసీమ నీటి హక్కుల కోసం కదం తొక్కిన వైసీపీ



**-మహా పాదయాత్రకు భారీగా తరలిన పార్టీ నాయకులు**

ప్రజాభూమి, హిందూపురం టౌన్

రాయలసీమ ప్రాంత సాగు, తాగునీటి హక్కుల సాధనే లక్ష్యంగా అనంతపురం జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల గ్రామంలో గురువారం హంద్రీ–నీవా కాలువ వరకు చేపట్టిన మహా పాదయాత్రకు హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దీపికా వేణురెడ్డి నేతృత్వంలో వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో హిందూపురం నుంచి భారీగా తరలివెళ్లారు. రాయలసీమ రైతాంగానికి సాగు, తాగునీటి హక్కులు సాధించాలనే సంకల్పంతో ఈ మహా పాదయాత్రలో పాల్గొన్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా దీపిక వేణు రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

హంద్రీ– నీవా కాలువకు లైనింగ్ పనులు చేపట్టడంతో శ్రీ సత్యసాయి జిల్లాలో సుమారు 1.76 లక్షల ఎకరాలకు సాగునీరు అందకుండా పోయిందని ఆరోపించారు. నీటి ప్రవాహం నిలిచిపోవడంతో బోర్లు ఎండిపోయి, భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 600 నుంచి 700 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీరు దొరకడం లేదని, దీంతో రైతులు పూర్తిగా వర్షాధార సాగుపైనే ఆధారపడాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. గత రెండేళ్లుగా వర్షపాతం కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూశారని, పంటలు ఎండిపోవడంతో అనేక వ్యవసాయ భూములు బీడుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం గిట్టుబాటు కాక వేలాది మంది రైతులు, వ్యవసాయ కూలీలు జీవనోపాధి కోసం బెంగళూరు వంటి నగరాలకు వలస వెళ్లి కూలి పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని దీపిక వేణు రెడ్డి అన్నారు. రాయలసీమకు నీటి హక్కు సాధించడం కోసం ప్రజలంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. హంద్రీ–నీవా కాలువ ద్వారా రాయలసీమ రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు వైఎస్సార్‌సీపీ ప్రజాపోరాటాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ మహా పాదయాత్రకు హిందూపురం నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై రాయలసీమ నీటి హక్కుల కోసం సంఘీభావం తెలిపారు.

# తల్లిపాలే శిశువుకు అమృతం

**-ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు**


**-రిటైర్డ్ మెడికల్ సూపరింటెండెంట్, శిశు వైద్య నిపుణులు డాక్టర్ కేశవులు**

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి విశ్రాంత మెడికల్ సూపరింటెండెంట్, ప్రముఖ శిశు వైద్య నిపుణులు డాక్టర్ కేశవులు తెలిపారు. ఈ వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. నవజాత శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ ఆహారం తల్లిపాలేనని ఆయన పేర్కొన్నారు. పుట్టిన వెంటనే వచ్చే పసుపు రంగు పాలు (కొలస్ట్రం) శిశువుకు తొలి టీకాలా పనిచేసి వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తాయని వివరించారు.

తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు సమతుల్యంగా ఉంటాయని, అవి సులభంగా జీర్ణమవుతాయని తెలిపారు. తల్లిపాలు తాగే పిల్లల్లో జలుబు, విరేచనాలు, న్యూమోనియా వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు తగ్గడంతో పాటు మేధో వికాసం కూడా మెరుగ్గా ఉంటుందని చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు పుట్టిన తొలి ఆరు నెలలు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తరువాత పోషకాహారాన్ని ప్రారంభించినప్పటికీ రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం శ్రేయస్కరమని సూచించారు.

తల్లిపాలు శిశువుకే కాకుండా తల్లి ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తాయని డాక్టర్ కేశవులు తెలిపారు. ప్రసవానంతరం తల్లి త్వరగా కోలుకోవడం, కొన్ని ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని తగ్గించడం, తల్లి–బిడ్డల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని, ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



Printed by MOHANEESWARPUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at East Godavari and published at d.no.70-7-28/1A, KRISHNA NAGAR, SBI COLONY PARK RAMANAYYA PETA KAKINADA editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1470.cell:9502116677.

### తుని, కాపవరం ప్రాంతాల్లో రోడ్

# అండర్ బ్రిడ్జిల (ఆర్ యుబి) నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

## కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ వినతి

**ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ**

కాకినాడ జిల్లా ప్రజల భద్రత, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తుని రైల్వే స్టేషన్ యార్డు వద్ద మరియు సామర్లకోట సమీప కాపవరం గ్రామం వద్ద రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకొని ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు లేఖ రాశారు. తుని రైల్వే స్టేషన్ యార్డులో ప్రస్తుతం ఉన్న ఇరుకైన కల్వర్టును ప్రతిరోజూ 40 వేల మందికి పైగా ప్రజలు వినియోగిస్తున్నారని ఎంపీ తెలిపారు. ఈ మార్గంలో రోజురోజుకీ పెరుగుతున్న రాకపోకల వల్ల తీవ్ర ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు రైల్వే



పట్టాలు దాటి ప్రయాణించాల్సి వస్తోందని, అత్యవసర వైద్య పరిస్థితుల్లో అంబులెన్సులు దాదాపు నాలుగు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోందని వివరించారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు తునిలో రోడ్ అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గడిచిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ గుర్తు చేశారు. అలాగే సామర్లకోట మండలంలోని కాపవరం గ్రామ ప్రజలు, రైతులు కూడా రోడ్ అండర్ బ్రిడ్జి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. సుమారు 2 వేల మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో 1,200 ఎకరాల వ్యవసాయ భూములు రైల్వే మార్గానికి ఇరువైపులా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులు, విత్తనాల రవాణా కోసం ఉన్న చిన్న వంతెనను వినియోగించాల్సి రావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాపవరం గ్రామ ప్రజలు విద్య, వైద్యం, రెవెన్యూ తదితర ప్రభుత్వ సేవల కోసం సామర్లకోటకు వెళ్లాల్సి వస్తోందని, సరైన క్రాసింగ్ లేక దాదాపు 11 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోందని ఎంపీ వివరించారు. ప్రతిపాదిత రోడ్ అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈ దూరం 3.5 నుంచి 4 కిలోమీటర్లకు తగ్గి ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. వర్షాలు, తుఫానుల సమయంలో ప్రస్తుతం ఉన్న మార్గంలో రాకపోకలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయని, రైల్వే శాఖ చేపడుతున్న ఫెన్సింగ్ పనుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గం లేకుంటే రైతులు, గ్రామస్థుల రాకపోకలు పూర్తిగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వే లైన్ నిర్మాణానికి భూముల సేకరణ సమయంలో స్థానిక రైతులు పూర్తిస్థాయిలో సహకరించిన విషయాన్ని కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల భద్రత ను దృష్టిలో ఉంచుకొని తుని, కాపవరం ప్రాంతాల్లో ప్రతిపాదిత రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను కోరారు.

# ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్షలు" (ఏపీ టెట్) పగడ్బందీగా నిర్వహించాలి

- టెట్ పరీక్ష కు హాజరుకానున్న 10,620 మంది అభ్యర్థులు
- జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు 5 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ**

ఆగస్టు 5వ తేదీ నుండి ఆగస్టు21వ తేదీ వరకు నిర్వహించనున్న ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్షలు నిర్వహణ లో అధికారులు వారికి కేటాయించిన విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వహించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పగడ్బందీ గా పరీక్షల నిర్వహణ జరగాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నందు పరీక్షల నిర్వహణ మరియు సన్నద్ధత అంశాలపై సంబంధిత అధికారుల తో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 10,620 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు రాసేందుకు గాను 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**పరీక్షా కేంద్రాల వివరాలు- అభ్యర్థులు సంఖ్య...**

1.అచ్చుతాపురం నందు "ఈఓఎన్ డిజిటల్ జోన్ ఐడిజెడ్(ఱూచీ ఐఅస్త్రఖ్శ్రీ  ్శీఅవ ఱఅ్గ)" కేంద్రం- అభ్యర్థులు 4300 మంది. 2.రాయుడు పాల్యం జంక్షన్ జంక్షన్ నందు "సాఫ్ట్ టెక్నాలజీస్"నందు అభ్యర్థులు 4400 మంది. 3.ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సూరంపాలెం అభ్యర్థులు 530 మంది.4 ఆదిత్య యూనివర్సిటీ, ఆదిత్య నగర్,సూరం పాలెం నందు.....అభ్యర్థులు 540 మంది 5.ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ,ఆదిత్య నగర్, సూరం పాలెం... అభ్యర్థులు 850 మంది ఈ పరీక్షలు ఆగస్టు 5వ తేదీ నుండి ఆగస్టు21వరకు రెండు సెషన్స్ లో నిర్వహిస్తారని.... మొదటి సెషన్ ఉ. 9:30 గంటల నుండి మ.12 గంటల వరకు ఉంటుందని రెండవ సెషన్ మ.2:30



గం.ల నుండి సా.5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణం లో ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా నిర్వహించాలనన్నారు.ప్రతి కంప్యూటర్ కు యుపిఎస్ తప్పనిసరి గా ఉండాలని అదేవిధంగా ప్రతి పరీక్షా కేంద్రంలో నిరంతరాయం గా విద్యుత్ సరఫరా ఉండాలని,దీనితో పాటు ప్రత్యామ్నాయం గా జనరేటర్ ఏర్పాటు చేయాలన్నారు.ప్రతి అధికారి వారికి కేటాయించిన విధులు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. రెవెన్యూ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ ను అమలు చేయాలని పోలీస్ శాఖ వారు బందోబస్తు ఏర్పాటు చేసి శాంతి భద్రత లను పరిరక్షించాలన్నారు..ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్ష నిర్వహణ తీరును క్షుణ్ణంగా పర్యవేక్షించాలన్నారు.అభ్యర్థులు మొబైల్ ఫోన్లు,ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదని తెలిపారు.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారు ప్రతి పరీక్ష కేంద్రం నందు ఫస్ట్ ఎయిడ్ వైద్య శిబిరాలను పరీక్షా కేంద్రాల వద్ద అంబులెన్స్ లో సహా నిర్వహించాలన్నారు.ఆర్టీసీ వారు ఆయా పరీక్ష కేంద్రాల రూటు లలో బస్సులు పరీక్షా సమయాల కు అభ్యర్థుల రాకపోకలకు అనుగుణంగా నడపాలన్నారు.ప్రతి పరీక్షా కేంద్రంలోనూ అభ్యర్థులకు సమాచారం కొరకు అవసరమైన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు.అభ్యర్థులు వారి ఏదైనా ఒరిజినల్ ఐడి గుర్తింపు కార్డులను పరీక్షా కేంద్రమునకు వెరిఫికేషన్ నిమిత్తం తీసుకొని రావాల్సి ఉంటుందన్నారు..ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, ఇతర సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అండ్రంగి డ్రైన్‌పై పైశిథిలమైన వంతెనతో పొంచి ఉన్న ప్రమాదం...!

- హెచ్చరిక బోర్డులు లేక కూలిన వంతెన పైనుండే రాకపోకలు.
- అండ్రంగి డ్రైన్ పొంగడంతో ప్రయాణికుల పాట్లు.
- కాజులూరుకు కనుమరుగైన ఆర్టీసీ సర్వీసులు.
- శ్రీశక్తి పథకం ఆయా గ్రామాల మహిళలకు అందని ద్రాక్షే
- వంతెన నిర్మాణం కోసం అనుమతులున్నా కార్యరూపానికి నోచుకోలేదు.

**ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు.**

మండల కేంద్రమైన కాజులూరుకు ఆనుకొని ఉన్న గొల్లపాలెం- కుయ్యేరు ప్రధాన రహదారిలో అండ్రంగి మేజర్ డ్రైన్ పై నిత్యం రాకపోకలు సాగే వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే ఈ వంతెన పైనుండి గత కొన్ని సంవత్సరాలుగా రాకపోకలు నిలిచిపోయాయి. అయితే పురాతన వంతెన కావడంతో ఎక్కడ సుమారు 40 శాతం వరకు వంతెనపై అక్కడక్కడ గుంతలు పడి కూలిపోయింది.దీంతో అదే వంతెన పై రహదారికి కాలినడక ధ్విచక్ర వాహన దారులకు ఆటంకం లేకుండా కూలినచోట ఎలక్ట్రికల్ పోల్స్ వేసి తాత్కాలికంగా వదిలేశారు. నాలుగు చక్రాలు వాహనాలు వెళ్లేందుకు ఈ వంతెనపై అవకాశం లేకపోవడంతో గత కొన్ని సంవత్సరాల క్రితం తూరలు వేసి ఒకవైపు ప్రత్యామ్నాయంగా రహదారిని ఏర్పాటు చేశారు. అయితే వేసవి ,చలికాలాల్లో , సాధ్యమైనంతవరకు ఇబ్బందులు లేకపోయినా వర్షాకాలం వస్తే ఈరహదారిపై ఇక్కడ నుండి ప్రయాణం చేయాలంటే వర్షాకాలం వస్తే సాహసోపేతమే.ఇక వంతెనకు ఒకవైపు వంతెనకి ఇరువైపులా ఉన్న సపోర్టు గోడలు కూడా సగానికి పైగానే కూలిపోవడంతో ఇక్కడ వంతెన చూస్తేనే గగుర్పాటుకు గురుకావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం ఈ వంతెనపై రాకపోకలు లేవంటూ హెచ్చరిక బోర్డులు సైతం పెట్టకపోవడం ద్విచక్ర వాహన దారులు ఈ వంతెన పైనుండి ప్రయాణిస్తున్నారు. దీంతో ఇక్కడ ఎప్పుడు ఏప్రమాదం ఏరూపంలో ముంచుకొస్తుందో అని రహదారి చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పొంగుతున్న అండ్రంగి డ్రైన్ ప్రయాణికుల పాట్లు.**

ఇక్కడ అండ్రంగి డ్రైన్ ఇటీవల కురుస్తున్న కొద్ది పాటి వర్షానికే పొంగడంతో ప్రయాణికులు అప్పట్లో ప్రత్యామ్నాయంగా



ఏర్పాటు రహదారిపై నీరు ప్రవహించడంతో వాహనాలు వెళ్లేందుకు భయం భయంగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నిలిచిపోయిన ఆర్టీసీ సర్వీసులు గత పది సంవత్సరాలుగా ఇదే పరిస్థితి.మండల కేంద్రమైన కాజులూరుకు ఈ వంతెన పైనుండి ఇటు కాకినాడ నుండి గొల్లపాలెం, చేదువాడ, కాజులూరు మీదుగా కుయ్యేరు,పల్లిపాలెం గ్రామాలకు నిత్యం ఆర్టీసీ బస్సు సర్వీసు ఉండేది.మరోవైపు రాజమండ్రి, రామచంద్రపురం నుండి దుగ్గుదుర్రు , కాజులూరు, శీలపురం గ్రామాలకు సైతం ఆయా డిపోల నుండి ఆర్టిసి సర్వీసు నిత్యం వందలాది ప్రయాణికులను వారు వారు గమ్యస్థానాలకు చేర్చేది. అయితే ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోకలు బంధై కాజులూరు మండలానికి ఆర్టీసీ సర్వీసు కనుమరుగైంది. దీంతో ఇటీవల



మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఆర్టీసీ సర్వీసులు లేక అందని ద్రాక్షగానే మిగిలింది. ఇక్కడ వంతెన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చినప్పటికీ నేటికీ ఈ వంతెన కార్యరూపం దాల్చకపోవడంతో ప్రయాణికులు నిత్యం నరకయాతన అనుభవిస్తూ సుమారు 20 నుండి 30 కిలోమీటర్ల అదనపు దూరబారాన్ని భరించాల్సిన పరిస్థితి ప్రయాణికులకు ఏర్పడింది. మండల కేంద్రమైన కాజులూరుకు రావాలంటే వ్యయ ప్రయాసలతోనే ఇక్కడ ప్రయాణికులు నిత్యం ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి ఈ వంతెన కార్యరూపం దాల్చేలా ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

# కూటమి సమన్వయంతో 'ఇంటింటికి తెలుగుదేశం'

- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి
- కాకినాడ రూరల్‌లో టీడీపీ నేతల ఆత్మీయ విందు.. కీలక నిర్ణయాలు

**ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ రూరల్**

కూటమి భాగస్వామ్య పార్టీలతో సమన్వయం పెంచుకుంటూ 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించాలని టీడీపీ నాయకులు నిర్ణయించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పార్టీ శ్రేణులు బూత్ స్థాయి నుంచే సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. వాకలపూడి మహాలక్ష్మి నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జి శ్రీ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి నివాసంలో గురువారం నిర్వహించిన జిల్లా పార్టీ నేతల ఆత్మీయ విందు సమావేశం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా కాకినాడ రూరల్



నియోజకవర్గ కార్యకర్తలకు పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, జిల్లా, మండల, గ్రామ కమిటీల ఏర్పాటు, కార్యకర్తల సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు సమిష్టిగా పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేర్చాలని నిర్ణయించారు.స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయి నుంచి పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడం, బూత్ కమిటీలను చురుకుగా పనిచేసేలా తీర్చిదిద్దడం, కార్యకర్తలను సమన్వయం చేస్తూ విజయానికి అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని నాయకులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సమిష్టిగా పని చేస్తే రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించడం సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి, నిమ్మకాయల రంగనాథ్,పెంకె శ్రీనివాస్ బాబా, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## విద్యార్థి ఆత్మహత్యపై సమగ్రంగా విచారణ చేయాలి-పి డి ఎస్ యు

**ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట**



కామవరపుకోట మండలం రావికంపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకుంటున్న కునుసోతు బాల సాయి సుబ్రహ్మణ్యం ఆత్మహత్య పై సమగ్ర న్యాయ విచారణ జరపాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి డి ఎస్ యు) జిల్లా ప్రధాన కార్యదర్శి బన్నె వినోద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సంవత్సరంమే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చేరీ రెండు నెలలు గడవకముందే జూలై 24 తారీఖున ఎవరూ లేని సమయంలో జంగారెడ్డిగూడెం ఇంట్లో ఆత్మహత్య చేసుకుని చనిపోవడం చాలా బాధాకరం అన్నారు. విద్యార్థి ఆత్మహత్యపై పాఠశాల ఉపాధ్యాయులు వేధింపులు కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నా రు. ఈ విషాద ఘటన లేటుగా వెలుగులోకి రావడం జరిగిందన్నారు. కావున విద్యార్థి ఆత్మహత్యపై సమగ్రంగా న్యాయ విచారణ జరపాలని ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు .

## పోలవరం నియోజకవర్గ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి**

పోలవరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఈరోజు అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లిన ప్రధాన అంశాలు:జీలుగుమిల్లి ప్రభుత్వ పశువైద్య ఆసుపత్రికి నూతన భవన నిర్మాణం చేపట్టాలని, అలాగే పోలవరం నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న పశువైద్యుల (వెటరినరీ డాక్టర్స్ ) పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కొయ్యలగూడెంలో అగ్నిమాపక కేంద్రం (ఫైర్ స్టేషన్) ఏర్పాటు చేయాలని కోరారు. బుట్టాయిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యు ల పోస్టులను భర్తీ చేయడంతో పాటు, ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులను వేగవంతం చేసి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. పోలవరం నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్పించిన ఈ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు.

## విక్టర్‌బాబుకు మంత్రి కొలుసు పార్థసారథి నివాళి



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు చౌటపల్లి విక్టర్‌బాబు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార--పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి విక్టర్‌బాబు పార్థివ దేహానికి ఘన నివాళులర్పించారు. గ్రామానికి, పార్టీకి ఆయన అందించిన సేవలను గుర్తు చేస్తూ విక్టర్‌బాబు మృతి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## చట్టాలు న్యాయవ్యవస్థ పై విద్యార్థులకు అవగాహన ఉండాలి




**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**

నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఓ అనూష మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి చట్టాలు, న్యాయవ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో మానవ అక్రమ రవాణా, ఫోక్సో చట్టం, గుడ్ టచ్ బాడ్ టచ్ అంశాలు వివరించారు. విద్యార్థి దశలో చదువుతోపాటు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. చదువు మాత్రమే ప్రతి వ్యక్తిని సమాజంలో ఉన్నతంగా తీర్చిదిద్దుతుందన్నారు. చదువు విజ్ఞానాన్ని, ప్రపంచ జ్ఞానాన్నిఅందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎస్ కే డి ప్రసాద్, ప్రెస్సైడింగ్ ఆఫీసర్ డాక్టర్ డి నాగార్జున దేవి, గర్ల్స్ డి ఎస్ డబ్ల్యూ డాక్టర్ టి దుర్గాభవాని, డి ఎస్ డబ్ల్యూ డాక్టర్ ఎల్ రాజేష్ పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

శుక్రవారం 31 జూలై 2026

## ఎన్క్యూఏఎస్ తనిఖీల్లో ఆగిరిపల్లి ప్రాథమిక వైద్యశాలలకు ప్రశంసలు

### జాతీయ నాణ్యతా ప్రమాణాలకు చేరువలో ఉందని అధికారుల సంతృప్తి



ప్రజాభూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల (ఎన్క్యూఏఎస్) తనిఖీల్లో భాగంగా బుధవారం, గురువారం ఆగిరిపల్లి ప్రాథమిక వైద్యశాలను ఎన్క్యూఏఎస్ అధికారులు డాక్టర్ అభిషేక్, డాక్టర్ సాహూ సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రి పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఓపీ, ఐపీ విభాగాలు, ప్రయోగశాల సేవలు, సమాచార ప్రదర్శన బోర్డులు, రికార్డుల నిర్వహణతో పాటు ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి, సుందరీకరణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి ప్రాథమిక వైద్యశాల జాతీయ నాణ్యతా ప్రమాణాలకు చేరువలో ఉందని అధికారులు ప్రశంసిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి మరింత మెరుగైన ప్రమాణాలు సాధించేలా సిబ్బంది ఇదే నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొని ఆసుపత్రి సుందరీకరణ, నిర్వహణలో విశేష కృషి చేశారు.

## చందపర్రులో మంచినీటి సమస్య పరిష్కరించాలి



ప్రజా భూమి ప్రతినిధి–పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం చందపర్రు గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ వివి రమణకు గురువారం వినతి పత్రం చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు గ్రామంలోని మంచినీటి సమస్య పరిష్కరించడానికి మైక్రోఫిల్టర్ ఏర్పాటు చేసిన అది పనిచేయడం లేదని, వినతి పత్రంలో పేర్కొన్నారు. తాగునీటి వినియోగానికి పాలకొల్లు నుంచి టిన్ను లతో తీసుకు తెచ్చుకుంటున్నామని, అయితే కనీసం ఇంటిలో వినియోగించుకోవడానికి కూడా గ్రామంలో నీరు పనికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున తక్షణమే గ్రామ మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో గుమ్మాపు శ్యాం కుమార్, పొన్న క్రాంతి కుమార్, మండ దిలీప్ కుమార్, తదితర గ్రామ పెద్దలు ఉన్నారు.

## పిల్లల పెరుగుదల సంరక్షణ పై తల్లి శ్రద్ధ వహించాలి

– డాక్టర్ రామకృష్ణ ఆనందరాజు.



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

పోడూరు రాజు హోమియోపతి హాస్పటల్ వద్ద రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు అధ్యక్షులు గుడాల హరిబాబు ఆధ్వర్యంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ కేర్ లో భాగంగా డాక్టర్ కోసూరి రామకృష్ణ ఆనందరాజు ఆర్థిక సహకారంతో 20 మంది చంటి పిల్లలకు బేబీ కిట్ లు మరియు బెడ్ షీట్లను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ ఆనందరాజు మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుండి నడక వచ్చేవరకు తల్లి పలు జాగ్రత్తలు తీసుకుని వారి పెరుగుదలకు అన్ని విదాలుగా శ్రద్ధ వహించాలని. బిడ్డ పుట్టినప్పుడు వారిని కంగారు పద్ధతిలో వెచ్చదనంలో ఉండేటట్లు చూడాలని. తల్లి పడుకుని బిడ్డకు పాలు ఇవ్వరాదని. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తదుపరి అదనపు పోషకాహారం అందించాలని. వ్యాధి నిరోధక టీకాలు తగు సమయంలో వేయించాలని డాక్టర్ ఆనంద రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు గుడాల హరిబాబు. కార్యదర్శి శిరిగినీడి నాగార్జున. కోశాధికారి ఆరుమిల్లి సురేష్, ఫాస్ట్ ప్రెసిడెంట్ లు డీజీ ఎన్ ముచ్చర్ల సంజయ్. జిల్లా జాయింట్ సెక్రెటరీ ముత్యాల శ్రీనివాస్. మద్దాల రాంప్రసాద్. కావలి నగేష్. ఇమిడి రాజేష్ పోతాబత్తులసత్యనారాయణ. ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్. ఓడూరి సురేష్. నాగళ్ల వరప్రసాద్. వైద్య సిబ్బంది పి. ఎలిజిబెత్. పి సీతామహాలక్ష్మి. మీ రాంజనేయులు. స్రవంతి. ఆదిలక్ష్మి. ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులకు శాఖా పరమైన చర్యలు తప్పవు

### జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి.



ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా.

ఏలూరు, జిల్లా కలెక్టరేటు గోదావరీ సమావేశ మందిరంలో గురువారం రెవిన్యూ పరమైన పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్లు, లావాదేవీలు మరియు సవరణలు కోసం మ్యూటేషన్, పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ, అర్హులు అందరికీ గృహాలు, ఐవిఆర్ఎస్ ఫోనుకాల్స్, ఆర్ వోఆర్ కేసులు, 22 (ఏ) కేసులు, కోర్టు కేసులు, డిజిటలైజేషన్ రెవెన్యూ ఇన్వెంటరీ, వరద మరియు విపత్తునిర్వహణ తదితర 14 అంశాలుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు యం.జె. అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.(శావణ్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి యం.శ్రీదేవి లు పాల్గొన్నారు. ఒక్కొక్క అంశం మీద మండలాలు వారీగా సమీక్షించి, నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు కలిసికట్టుగా పనిచేసి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. లక్ష్యాలులో వెనుకబడిన అధికారులకు చర్యలు తప్పవని జిల్లా కలెక్టరు హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాల ను అధికారులు కలిసికట్టుగా పనిచేసి లక్ష్యాలు అధిగమించాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌరసేవలు అందించుటలో మనస్సుపెట్టి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులకు చర్యలు తప్పవని హెచ్చరించారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్లు అర్జీలు శాశ్వత పరిష్కారం చూపాలి అన్నారు. కొందరు అధికారులు మాశాఖకు సంబంధించింది కాదని, కాలయాపన చేస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. వివాదాలకు తావులేకుండా పట్టాదారు పాసుపుస్తకాలు రూపొందించాలని, అర్హులు అయిన వారందరికీ అందజేయ్యాలని అన్నారు. పౌరసే వలో ఎక్కడ కూడా ఒక్కఫిర్యాదు రాకుండా ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహాలు మంజూరు చెయ్యాలని, నిర్మాణంలో ఉన్న గృహాలను వేగవంతం చేసి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించాలని అన్నారు. కొన్ని శాఖలు పనితీరుపై ఐవిఆర్ ఎస్ రిపోర్టులు వివరిస్తూ, అసహనం వ్యక్తం చేస్తూ పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని అన్నారు. కోర్టుకేసులు పురోగతిపై ఎప్పటికప్పుడు పరిశీలన చేసుకోవాలని, కాలయాపనలు చేస్తే ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. గత అనుభవాలను జోడిస్తూ వరదలుపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలాలు వారీగా ప్రత్యేక అధికారులను నియమిస్తూ, కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు సిద్ధం చెయ్యాలని అన్నారు. ప్రతి అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని, సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచెయ్యాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పెండింగులో ఉన్న ధరఖాస్తులు, ఫిర్యాదులు, కేసులను వేగంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు, రెవెన్యూ సేవలు అందించుటలో పారదర్శకత, జవాబు దారీతనంతో పనిచెయ్యాలని సూచించారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, ఆర్డీవోలు కె.లక్ష్మీప్రసన్న, యం.వి. రమణ, సంబంధిత జిల్లా అధికారులు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత, పోక్సో, పోష్ చట్టాలపై అవగాహన సదస్సు



ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం, మహిళలు మరియు చిన్నారుల భద్రత పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందించడం, విద్యాసంస్థల్లో సురక్షితమైన మరియు వేధింపుల రహిత వాతావరణాన్ని నెలకొల్పడం లక్ష్యంగా రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)–నూజివీడు క్యాంపస్‌లో మహిళల భద్రత, పోక్సో చట్టం, పోష్ చట్టం అంశాలపై గురువారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ మరియు అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ –ఐసీసీ) సంయుక్త ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని శాక్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి నూజివీడు ప్రథమ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఓ. అనూష ముఖ్య వక్తగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, మహిళల చట్టబద్ధ హక్కులు, పోక్సో చట్టం–2012 ద్వారా చిన్నారులకు కల్పించిన రక్షణ, పోష్ చట్టం--2013 ద్వారా కార్యాలయాలు మరియు విద్యాసంస్థల్లో లైంగిక వేధింపుల నివారణకు ఉన్న నిబంధనలు, సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాలు మరియు వేధింపుల నుంచి రక్షణ, చట్టపరమైన పరిహార మార్గాలు, ఫిర్యాదు నమోదు విధానం, బాధితులకు అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థలు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.

విద్యార్థులు తమ హక్కులను తెలుసుకోవడమే కాకుండా, ఇతరుల గౌరవాన్ని కాపాడే బాధ్యతను కూడా గుర్తించాల్సిన అవసరం ఉందని "అవగాహనే భద్రత, గౌరవం, సాధికారతకు తొలి మెట్టు" అనే సందేశాన్ని ఈ అవగాహన కార్యక్రమం ద్వారా వివరించారు. విద్యార్థులు ఎలాంటి వేధింపులు లేదా అనుచిత సంఘటనలు ఎదుర్కొన్నా మౌనంగా ఉండకుండా వెంటనే ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ (ఐసీసీ), కౌన్సెలర్లు లేదా స్టూడెంట్ వెల్ఫేర్ విభాగాన్ని సంప్రదించి ఫిర్యాదు చేయాలని, ప్రతి ఫిర్యాదును గోప్యతతో, చట్టబద్ధంగా పరిశీలించి అవసరమైన సహాయం అందించబడుతుందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన, నైతిక విలువలు, మహిళల పట్ల గౌరవ భావన, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నట్లు ఆర్జీయూకేటీ అధికారులు తెలిపారు. ఈ సదస్సు విద్యార్థుల్లో చట్టాల పట్ల అవగాహనతో పాటు సురక్షితమైన, బాధ్యతాయుతమైన విద్యార్థి జీవనానికి దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి మరియు నూజివీడు క్యాంపస్ ఇంచార్జ్ డైరెక్టర్ ఆచార్య మద్దాలి లక్ష్మీనారాయణ రావు, పరిపాలనాధికారి డా. లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డా. చిరంజీవి పర్యవేక్షించారు. సెంట్రల్ ఫైనాన్స్ ఆఫీసర్ డా. నాగార్జునదేవి, డీఎస్డబ్ల్యు గాల్స్ ఒ బాయ్స్ డా. దుర్గాభవాని, డా. రాజేష్, చీఫ్ వార్డెన్ సురేష్, గర్ల్స్ చీఫ్ వార్డెన్ డా. గౌతమి, పీయూసీ అకడమిక్ డీన్ డా. హరికృష్ణ ఇంకా వివిధ విభాగాల శాఖాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## యస్.ఆర్.ఆర్. జిల్లాపరిషత్ హైస్కూల్‌లో నియోజకవర్గస్థాయి వాలీబాల్ సెలక్షన్స్



ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు మండలము యస్.ఆర్.ఆర్. జిల్లా హైస్కూల్ లో అమరావతి చాంఫియన్ షిప్ లోభాగంగా వాలీబాల్‌కోర్టును మున్సిపల్ కమీషనర్ కె.పీరయ్య ప్రారంభించారు. తదనంతరం క్రీడాకారులనుపరిచయం చేసుకొనుట జరిగినది. కొంచెంసేపు క్రీడాకారులతో ఆడి ఉత్తేజపరిచారు. మున్సిపల్ కమీషనర్ పీరయ్య మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గస్థాయిలో సెలక్ట్ అయిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో మంచిపేరు ప్రఖ్యాతులు తేవాలని కోరారు. ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయుని వల్ల భనేని పద్మ మా పాఠశాల తరుపున క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈరోజు వాలీబాల్ అండర్ 17,అండర్ 23క్రీడాకారులకు సెలక్షన్స్ నిర్వహించామని నూజివీడు నియోజకవర్గ ఇన్చార్జి అన్నామణి తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో సెలెక్ట్ అయిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. ఈకార్యక్రమములో వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, లక్ష్మి, బాలబాస్కర్, రవీంద్ర,సుగుణ రావు, శివ నాగేంద్రం,సుకుమార్,ఆలీఖాన్, వనజ, స్వప్న, నాగేశ్వరరావు, రాణి, సరళ, ప్రభాకర్, వాసు, సతీష్, నాగరాజు, ,అన్నపూర్ణ,హేమ, నారాయణ, శ్రీహరి, ఉమమహేశ్వరి, సాయి కిషోర్ పాల్గొన్నారు.

## శిథిల భవనం కూల్చివేతకు వేలంపాట

ప్రజాభూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



అడవి నెక్కలం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల ప్రాంగణంలో శిథిలావస్థకు చేరిన పురాతన భవనాన్ని కూల్చివేసేందుకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సలాం తెలిపారు. వేలంపాటలో పాల్గొనదల చిన ఆసక్తిగల వారు పూర్తి వివరాల కోసం మండల సహాయ ఇంజనీరు వాసుదేవరావు ను సంప్రదించాలని ఆయన సూచించారు.

## ర్యాలిలో కూటమి నాయకులు ఇంటింటి ప్రచారం, కూటమి రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరణ

### సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రం ముందుకు సాగుతోందని కూటమి నాయకుల వెల్లడి.



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధినే ధ్యేయంగా పెట్టుకుని పాలన సాగిస్తోందని ఆత్రేయపురం మండలం కూటమి నాయకులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల నాయకులు కూసంపూడి రామకృష్ణంరాజు , కరుటూరి నరసింహారావు, పెండెం వెంకన్న, మద్దూరి సుబ్బారావు, పెర్చెర్ల పుల్లంరాజు వర్మ పాలింగి రవిచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలను కలిసి గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. గత ప్రభుత్వ పాలనలో అరాచకం, విధ్వంసకర విధానాలు కొనసాగాయని విమర్శిస్తూ, ప్రజలు వాటిని తిరస్కరించి కూటమికి అపూర్వమైన మెజారిటీతో అధికారాన్ని అప్పగించారని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడిన సందర్భంగా కూటమి ప్రభుత్వ పాలన పట్ల సంతృప్తి వ్యక్తమవుతోందని తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రచారంలో భాగంగా పింఛన్ల పెంపు, 'తల్లికి వందనం' పథకం కింద అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఒక్కో విద్యార్థికి రూ.13 వేల చొప్పున జమ అయ్యాయా లేదా, అలాగే 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందిందా లేదా అనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు కటారి నాగేశ్వరావు, గుడెల నాగేంద్ర, గార్లపాటి గోపాలకృష్ణ మూర్తి, గూడపాటి శ్రీనివాసరావు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు

- రాష్ట్రాలు ప్రతిపాదిస్తే కొత్త ఐటీడీఏల ఏర్పాటుకు కేంద్రం సుముఖం
- కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్రం సమాధానం



ప్రజాభూమి ప్రతినిధి–కాకినాడ

దేశంలోని సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ, మౌలిక సదుపాయాల పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువాల్ ఓరాం వెల్లడించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న నిధులు, నూతన ఐటిడిఏ ల ఏర్పాటుపై కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 275(1) గ్రాంట్లు, ప్రధాన్ మంత్రి ఆది ఆదర్శ గ్రామ యోజన, ధర్తి ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (ఢాజా–జీ+ఖూ), పీఎం–జన్‌మన్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, గిరిజన జీవనోపాధి కార్యక్రమాల ద్వారా ఐటిడిఏ ప్రాంతాల అభివృద్ధికి సహకరిస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి వివిధ పథకాల కింద నిధులు విడుదల చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఇటీవల నిర్వహించిన జాతీయ సదస్సులో ఐటిడిఏల సామర్థ్య పెంపు, సమగ్ర ప్రణాళిక, డేటా వ్యవస్థల బలోపేతం, ప్రజల భాగస్వామ్యం, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొంది.

ఐటిడిఏ ప్రాంతాల్లో రహదారులు, గృహాలు, తాగునీరు, విద్యుత్, మొబైల్ కనెక్టివిటీ వంటి మౌలిక వసతులు, ఏకలవ్య పాఠశాలలు, హాస్టళ్లు, ఆరోగ్య సేవలు, మాతా–శిశు సంక్షేమం, సికిల్ సెల్ అనీమియా నిర్మూలన, వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల విలువ వృద్ధి, వన్ ధన్ వికాస్ కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి శిక్షణ వంటి కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కొత్త ఐటిడిఏల ఏర్పాటు, పునర్వ్యవస్థీకరణ లేదా విస్తరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రతిపాదనలు వస్తే నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి తెలిపినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడించారు.